సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 60

బుధవారం 22-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



సింగపూర్ విమానంలో కుదుపులు

ఒక ప్రయాణికుడి మృతి.. 30 మందికి గాయాలు - 6లో



ఫైనల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్

క్వాలిఫయర్–1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై విజయం - 12లో



అది 'మోసగాళ్ల కూటమి'

విపక్షాల 'ఇండియా' కూటమిపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. అది మతతత్వ, కులతత్వ, వారసత్వ కూటమి అని ధ్వజమెత్తారు.

- వివరాలు 6లో



మోదీజీ.. ఇక చాలు

విద్వేష ప్రసంగాలతో హిందూ, ముస్లింల మధ్య విషం చిమ్ముతున్న మోదీ ప్రజాజీవితం నుంచి నిష్క్రమించడం మేలని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే హితవు పలికారు.

- వివరాలు 6లో

ఐఏఎస్‌లే ఇన్‌చార్జులు

10 యూనివర్సిటీలకు వీసీలుగా నియమించిన ప్రభుత్వం

మంగళవారమే ముగిసిన రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలం

వివాదాలు, ఆరోపణలతో వారిని కొనసాగించడంపై సర్కారు విముఖత

కొత్త వీసీల కోసం సెర్చ్ కమిటీలు ఏర్పాటైనా ముందుకు పడని అడుగు

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియామకాల్లో జాప్యం

వైస్ చాన్స్‌లర్ల పోస్టుల కోసం భారీగా కొనసాగుతున్న పైరవీలు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ఐఏఎస్ అధికారుల అజమాయిషీలోకి వెళ్లాయి. వైస్ చాన్స్‌లర్ల (వీసీల) పదవీకాలం ముగియడంతో.. ప్రభుత్వం ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో ఐఏఎస్ అధికారిని ఇన్‌చార్జి వీసీగా నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని మొత్తం పది విశ్వవిద్యాలయాల వీసీల పదవీ కాలం ఈ నెల 21వ తేదీతో ముగిసింది. దీనితో వెంటనే మిగతా 2వ పేజీలో ▶



వర్సిటీల ఇన్‌చార్జి వీసీలుగా నియామకమైన ఐఏఎస్‌లు

ఉస్మానియా వర్సిటీ	దాన కిషోర్	తెలుగు యూనివర్సిటీ	శైలజా రామయ్యర్
జేఎన్టీయూహెచ్	బుర్రా వెంకటేశం	మహాత్మాగాంధీ వర్సిటీ	నవీన్ మిట్టల్
కాకతీయ వర్సిటీ	వాకాటి కరుణ	శాతవాహన వర్సిటీ	సురేంద్ర మోహన్
అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ	రిజ్వీ	జేఎన్‌ఏఎఫ్‌ఏ వర్సిటీ	జయేశ్ రంజన్
తెలంగాణ వర్సిటీ	సందీప్ సుల్తానియా	పాలమూరు వర్సిటీ	నదీం అహ్మద్

భారీగా పైరవీలు షురూ..

వైస్ చాన్స్‌లర్ పోస్టుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలోని పది విశ్వ విద్యాలయాలకు కలిపి 312 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. కొందరు ఎక్కువ వర్సిటీలకు దరఖాస్తు చేయడంతో.. మొత్తంగా 1,282 దరఖాస్తులు అందినట్టు అధికార వర్గాలు తెలిపాయి. వీటిలో ఎక్కువ భాగం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోసం వచ్చాయి. ఈ విశ్వవిద్యాలయానికి 208 మంది దరఖాస్తు చేశారు. ఆ తర్వాత ఎక్కువ మంది ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్టీయూహెచ్‌లకు పోటీపడ్డారు. ఇలా పోటీ తీవ్రంగా ఉండటంతో మంత్రులు, ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల ద్వారా కొందరు ప్రొఫెసర్లు పైరవీలు చేస్తున్నారు. రాజధానిలో ఓ యూనివర్సిటీ వీసీగా ఇంత కాలం పనిచేసిన వ్యక్తి.. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇదే యూనివర్సిటీ వీసీ పోస్టు కోసం మెదక్ జిల్లాకు చెందిన మంత్రి ద్వారా మరో ప్రొఫెసర్ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇదే యూనివర్సిటీలో పనిచేసి రిటైర్ అయిన ప్రొఫెసర్ కూడా ఓ కీలక మైనార్టీ నేత ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ పోస్టు కోసం నలుగురు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నారు. పోటీ తీవ్రంగా ఉండటం, అధికార పార్టీలోని కీలక వ్యక్తులు తమ వారి కోసం పట్టుపడుతుండటంతో.. వీసీల ఎంపిక కత్తిమీద సాములా మారిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సీసీఎస్ ఏసీపీ ఇంట్లో ఏసీబీ సోదాలు

అరెస్టు చేసిన అధికారులు

హైదరాబాద్, ఏపీలో మొత్తం 11 చోట్ల దాడులు

నగదు, ఆస్తి పత్రాలతో పాటు రెండు బ్యాంకు లాకర్ల గుర్తింపు

- 'ప్రీలాంచ్' బాధితులకు అన్యాయం చేశారంటూ ఉమామహేశ్వరరావుపై ఫిర్యాదులు
- ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు
- గతంలోనూ పలు వివాదాలు.. రెండుసార్లు సస్పెన్షన్



ఉమామహేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) ఏసీపీగా పని చేస్తున్న టీఎస్ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం దాడులు చేశారు. తెలంగాణ, ఏపీలోని ఉమామహేశ్వరావు ఇళ్లు, ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లతో సహా మొత్తం 11 చోట్ల సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో నగదు, బంగారం, ఆస్తి పత్రాలతో పాటు రెండు బ్యాంకు లాకర్లను గుర్తించినట్లు తెలిసింది. మంగళవారం మిగతా 2వ పేజీలో ▶

ప్రపంచంతో పోటీపడేలా కొత్త పారిశ్రామిక పాలసీలు

పరిశ్రమల శాఖ అధికారులకు సీఎం ఆదేశం

టీఎస్ఐఐసీ కార్యకలాపాలపై సమీక్ష



సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన ఆరు కొత్త పాలసీలకు ఎన్నికల కోడ్ ముగిసేలోగా తుదిరూపు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) కార్యకలాపాలపై మంగళవారం పరిశ్రమల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సూక్ష్మ, లఘు పరిశ్రమల కోసం ఎంఎస్ఎంఈ విధానం, ఎగుమతుల విధానం, నూతన లైఫ్‌సైన్సెస్, మెడికల్ టూరిజం, ఈవీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను కొత్తగా రూపొందిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. కొత్త పాలసీల రూపకల్పన క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉత్తమ పాలసీలపై అధ్యయనం చేయాలని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడేలా ఈ నూతన విధానాలు ఉండాలన్నారు. నేత, వస్త్ర పరిశ్రమకు సంబంధించి రాష్ట్రంలోని పవర్‌లూమ్, చేనేత కార్మికులకు ఉపయోగపడేలా విధానాలను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి

మంత్రివర్గ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

దొడ్డు వడ్లకూ బోనస్ ఇచ్చేలా పోరాడతాం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనే రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వానాకాలం నుంచి అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలన్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇచ్చేలా బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. వరి ధాన్యానికి బోనస్ చెల్లింపు అంశంపై రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై హరీశ్‌రావు మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ముఖ్య నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో మిగతా 3వ పేజీలో ▶



సన్న వడ్లపై సర్కార్ సన్నాయి నొక్కులు

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ ఫైర్ 2లో

రాష్ట్రంలో కొత్తగా యు ట్యాక్స్!



రూ.500 కోట్లు చేతులు మారాయి

ఇందులో రూ.100 కోట్లు మంత్రి ఉత్తమ్ అధిష్టానానికి పంపించారు: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 3లో

'యు ట్యాక్స్' పచ్చి అబద్ధం: ఉత్తమ్

3లో



మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలకు జవాబిస్తా

సన్న బియ్యంతో 'బోనస్' ప్రారంభిస్తున్నాం

భవిష్యత్తులోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా మద్దతు ధర ఇస్తున్నామని వెల్లడి



- ప్రతిపక్షాలు అబద్ధాలతో రైతులను ఇబ్బంది పెట్టి రాజకీయానికి వాడుకోవద్దని వ్యాఖ్య 3లో

ఇదండీ సంగతి



అయితే ఆయన ఓటు కూడా మనకే వేస్తారు!

మాటలతో మూటలు

రూ.200 కోట్ల స్కామ్‌లో నిమ్మగడ్డ వాణీబాల అత్యంత కీలకం

చేతులు కాలాక వాణీబాలను సస్పెండ్ చేసిన టెస్కాబ్ అధికారులు



వాణీబాల

సాక్షి, హైదరాబాద్: శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ చేసిన రూ.200 కోట్ల స్కామ్‌లో టెస్కాబ్ మాజీ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాణీబాల పాత్ర కీలకమని పోలీసులు అనుమానిస్తున్నారు. తన భర్త మేక నేతాజీ, కుమారుడు మేక శ్రీహర్ష నిర్వహిస్తున్న ప్రింటింగ్ మెటీరియల్ సప్లై ఏజెన్సీని ఫైనాన్స్ సంస్థగా మార్చడంలో ఆమె పాత్ర కీలకమని భావిస్తున్నారు. ఈ సంస్థ చేతిలో మోసపోయిన వారి సంఖ్య 517 కాగా, దర్యాప్తు నిమిత్తం కేసును ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అప్పగించారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. మరోపక్క టెస్కాబ్ అధికారులు వాణీబాలను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. వాణీబాల చేసిన మోసంలో తమ బ్యాంకుకు ఎలాంటి సంబంధం లేదంటూ చెబుతున్నారు.

'ప్రియాంక' సంస్థ ఏర్పాటు ఉద్దేశమే వేరు...

ఏపీలోని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మేక నేతాజీ 1985 నుంచి అబిడ్స్ తిలక్‌రోడ్‌లో శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్, గ్రాఫిక్ సిస్టమ్స్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నాడు. ముద్రణ రంగంలో మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

కేసీఆర్ ముక్కు నేలకు రాసినా మల్లన్నదే గెలుపు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఖమ్మం రూరల్: మాజీ సీఎం కేసీఆర్ ముక్కు నేలకు రాసినా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని ఆపలేరని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. కేసీఆర్ నియంత పోకడలు, అరాచకాలను ప్రశ్నించినందుకే మల్లన్నపై వందల కేసులు నమోదు చేసి జైలుపాలు చేశారని విమర్శించారు. కేసీఆర్‌కు ఇంగిత జ్ఞానం లేకపోవడంతో అలా ప్రవర్తించగా, ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని తెలిపారు. బీఆర్‌ఎస్ వైఫల్యంతోనే ఈ ఉపఎన్నిక వచ్చిందని, కేసీఆర్, కేటీఆర్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరని పొంగులేటి చెప్పారు. సమావేశంలో తీన్మార్ మల్లన్నతో పాటు ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రఘునాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి

ఢిల్లీలోని తెలుగువారికి కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ దేశంలో శాంతి కోసం ప్రయత్నిస్తోందని...ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తెలుగు ప్రజలు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని ఇండియా కూటమిని గెలిపించాలని ఆ పార్టీ నేత మల్లు రవి కోరారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ప్రజలకు శాంతి లేదన్నారు. కాంగ్రెస్ పాలన హయాంలో దేశం అభివృద్ధిలో ముందుకెళ్లిందన్నారు. ఇండియా కూటమి నుంచి పోటీ చేస్తున్న కన్నయ్య కుమార్, ఉదిత్‌రాజుల ప్రచారంలో పాల్గొని తెలుగు ఓటర్లతో మమేకం అయినట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవివ్వండి

ఈసీని కోరిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ–ఖమ్మం–వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరిగే ఈనెల 27వ తేదీని వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికలు వర్కింగ్ డే రోజున జరుగుతున్నందున పోలింగ్ శాతం ఎక్కువ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటు వేయడానికి ఉద్యోగులు జిల్లాలకు వెళ్లే విధంగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆ వినతిపత్రంలో వెంకట్ కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ విజ్ఞప్తి పట్ల సీఈవో వికాస్‌రాజ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

'సమగ్ర కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థల ఎన్నికలా?'



సాక్షి, హైదరాబాద్: సమగ్ర కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు తీవ్రంగా నష్టపోతారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన, బీసీల రిజర్వేషన్ శాతాన్ని తేల్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం సమాయత్తమవడం సమంజసం కాదని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన అభిప్రాయపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

మలబార్ గ్రూప్‌నకు బాంబే హైకోర్టు ఊరట

సాక్షి, హైదరాబాద్: మలబార్ గ్రూప్‌నకు బాంబే హైకోర్టు ఊరటనిచ్చింది. 77 వేల మంది నిరుపేద బాలికలకు విద్యా స్కాలర్‌షిప్‌లను అందించిన మలబార్ గ్రూప్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు వ్యతిరేకంగా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో దుష్ప్రచారం చేస్తున్న పోస్ట్‌లను తొలగించాలని తీర్పును వెలువరించింది. మలబార్ గ్రూప్ పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను వెంటనే తొలగించాలని, తదుపరి పరువు నష్టం కలిగించే స్టేట్‌మెంట్‌లను జారీ చేయకూడదని ప్రతివాదులను ఆదేశించింది. ఈమేరకు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఒక నిర్దిష్ట కమ్యూనిటీకి చెందిన బాలికలకు అందించిన స్కాలర్‌షిప్‌లను క్యాప్చర్ చేసి ఫొటోగ్రాఫ్‌ను పబ్లిష్ చేయడాన్ని కోర్టు తప్పుబట్టింది. ఈ పోస్ట్ మలబార్ గ్రూప్ ప్రతిష్టను దెబ్బతీస్తోందని, ఇది సమాజంలో విభజనకు కారణమయ్యే ప్రమాదముందని కోర్టు నొక్కిచెప్పింది.

'పట్టభద్రులపై' పట్టు కోసం!

సిట్టింగ్ సీటును నిలుపుకునేందుకు బీఆర్‌ఎస్ ముమ్మర యత్నాలు

ప్రచారానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వం

- అసంతృప్త నేతలను బుజ్జగిస్తూ ప్రచార పర్వంలోకి
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలు
- జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలపై ఫోకస్



సాక్షి, హైదరాబాద్: శాసన మండలి 'వరంగల్–ఖమ్మం–నల్లగొండ' పట్టభద్రుల ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) సిట్టింగ్ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లలో పట్టు సాధించేందుకు విస్తృతంగా ప్రచారం సాగిస్తోంది. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక వ్యూహాన్ని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. అందుకు అనుగుణంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇప్పటికే పట్టభద్రుల నియోజకవర్గం విస్తరించి ఉన్న జిల్లాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ప్రచారం చేసిన కేటీఆర్ బుధవారం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. ఎన్నికల ప్రచారం ఈ నెల 25న ముగియనుండటంతో సమయాభావాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లోనే ఆయన ప్రచారం కొనసాగుతోంది. మరోవైపు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఈ నెల 23 నుంచి రెండు రోజుల పాటు పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొంటారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఇక నాగర్‌కర్నూలు నుంచి బీఆర్‌ఎస్ తరపున లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ప్రతి ఓటరునూ కలిసి..

శాసన మండలి 'వరంగల్– ఖమ్మం– నల్లగొండ' స్థానం నుంచి బీఆర్‌ఎస్ వరుసగా నాలుగు పర్యాయాలు గెలవడంతో ప్రస్తుత ఉప ఎన్నికలోనూ ఆ పార్టీ అభ్యర్థి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎన్నికల ప్రచార గడువు, పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో పార్టీ యంత్రాంగం నడుమ సమన్వయానికి బీఆర్‌ఎస్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు సమన్వయ బాధ్యతలు అప్పగించింది. మండలాల వారీగా పట్టభద్రులు నియోజకవర్గం ఓటరు జాబితాను సమన్వయకర్తలకు అందజేసి, క్షేత్ర స్థాయిలో ప్రతీ ఓటరును పార్టీ కేడర్ కలిసేవిధంగా ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రచారంలో ప్రధానంగా కాంగ్రెస్ వైఫల్యాలు, ఉద్యోగాల భర్తీ, నోటిఫికేషన్ల జారీలో వైఫల్యం, పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి విద్యార్హతలు, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న వ్యవహార శైలి తదితరాలను ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ప్రతీ ఓటును ఒడిసి పట్టేందుకు మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఓటరును ప్రత్యక్షంగా కలవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

కేటీఆర్, హరీశ్ ప్రచార షెడ్యూలు ఇదే

కేటీఆర్ ఈ నెల 22న ములుగు, నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తారు. హరీశ్‌రావు ఈ నెల 23న భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్, 24న సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారు.

అసంతృప్త నేతలకు బుజ్జగింపు

ఏనుగుల రాకేశ్‌రెడ్డి అభ్యర్థిత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన నేతలతో కేటీఆర్ స్వయంగా మాట్లాడి బుజ్జగిస్తున్నారు. ఈ ఉప ఎన్నికను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో విభేదాలు వీడి కలిసి పనిచేయాలని కోరుతున్నారు. త్వరలో ఏర్పాటయ్యే పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల్లో ప్రాధాన్యతను ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం ఆశించిన వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి మంగళవారం కేటీఆర్‌ను కలిశారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించారు.



నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

సన్న వడ్లపై సర్కార్ సన్నాయి నొక్కులు

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక భేటీలో మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ఐదేళ్ల అపఖ్యాతి మూటగట్టుకుందని విమర్శ
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి బ్లాక్ మెయిలర్ అని ఆరోపణ

నల్లగొండ టూటౌన్/ మిర్యాలగూడ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అంటూ రేవంత్‌రెడ్డి సర్కార్ సన్నాయి నొక్కులు నొక్కుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలు నమ్మారని, కానీ ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల అపఖ్యాతిని మూటగట్టుకుందని విమర్శించారు. మంగళవారం నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియాలలో నిర్వహించిన వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. ''కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.2,500, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అని అనేక హామీలిచ్చి ప్రజలను మోసం చేసింది. డిసెంబర్ 9 నాటికి రైతుబంధు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. మే వచ్చినా సొమ్ము వేయలేదు. నాగార్జునసాగర్ ఆయకట్టు ఎండిపోతే కాంగ్రెస్ నాయకులు పట్టించుకోలేదు. అన్నదాతలు ఆగమవుతున్నారు. సాగర్ ప్రాజెక్టును కేఆర్‌ఎంబీకి అప్పజెప్పిన దద్దమ్మలు కాంగ్రెస్ వాళ్లు. రేవంత్ పాలనలో అంతా మోసమే..'' అని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపిస్తే నమ్మి కాంగ్రెస్‌ను గెలిపించారని.. ఇప్పుడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ మోసపోవద్దని పేర్కొన్నారు. మొదటిసారి మోసపోతే కాంగ్రెస్ మాయ అనుకుందామని.. అదే రెండోసారి మోసపోతే మన తప్పే అవుతుందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలర్..

ఉన్నత చదువులు చదివి అమెరికాలో మంచి ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ కోసం వచ్చిన గోల్డ్ మెడలిస్ట్ కావాలో.. బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు గుంజే గోల్డ్ స్నాచర్ కావాలో పట్టభద్రులు తేల్చుకోవాలని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్ అని ఆరోపించారు. దీనిపై మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఆలోచన చేయాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలిస్తే.. మండలిలో పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లే ఇన్‌చార్జులు

▶ మొదటి పేజీ తరువాయి

వర్సిటీలు ఇన్‌చార్జుల అధీనంలోకి వెళ్లాయి. కొత్త వీసీలు వచ్చే వరకూ అధికారుల పాలనే కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో వీసీల నియామకం ఆలస్యమయ్యే అవకాశమున్నట్లు అధికారులు చెప్తున్నారు.

సెర్చ్ కమిటీలు వేసినా..

వీసీల పదవీ కాలం ముగియక ముందే కొత్తవారిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారిందని అధికారులు అంటున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని వీసీల నియామకం కోసం అన్ని వర్సిటీలకు సెర్చ్ కమిటీలను నియమించారు. వీసీ పోస్టుల కోసం వచ్చిన దరఖాస్తులను ఆ కమిటీ పరిశీలించి.. అన్ని అర్హతలున్న వారి జాబితాను ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. ఆ తర్వాత నియామకాలు ఉంటాయి. కానీ సెర్చ్ కమిటీలు ఇప్పటివరకు సమావేశం కాలేదు. కాకతీయ వర్సిటీ పరిధిలో అయితే ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు కాకపోవడంతో సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో ప్రస్తుత వీసీలనే కొంతకాలం కొనసాగించాలని భావించారు. కానీ ఈ ప్రతిపాదనపై అధికారుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పలువురు వీసీలపై ఆరోపణలు, మరికొందరి తీరు వివాదాస్పదం కావడం నేపథ్యంలో.. వారిని కొనసాగించేందుకు ప్రభుత్వం సుముఖత చూపలేదు.

ఏ యూనివర్సిటీ వీసీ కోసం ఎన్ని దరఖాస్తులు?

వర్సిటీ	వచ్చిన దరఖాస్తులు
అంబేద్కర్ ఓపెన్	208
ఉస్మానియా	193
పాలమూరు	159
శాతవాహన	158
మహాత్మాగాంధీ	157
కాకతీయ	149
తెలంగాణ	135
జేఎన్టీయూహెచ్	106
తెలుగు వర్సిటీ	68
జేఎన్‌ఎఫ్ఏయూ	51
మొత్తం	1,382

ఎమ్మెల్సీ కవితపై చార్జిషీటు

29న తీర్పు వెలువరించనున్న ప్రత్యేక కోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మరికొందరిపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీటుపై ఈనెల 29న ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించనుంది. చార్జిషీటు పరిగణనలోకి తీసుకోవడంపై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా రెండోరోజూ మంగళవారం ఈడీ వాదనలు విన్నారు. ఈడీ తరపు న్యాయవాది నవీన్‌కుమార్ మట్టా ఈ కేసులో కవిత పాత్రపై మరోసారి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. శరత్‌రెడ్డి, బుచ్చిబాబు, శ్రీనివాస్‌ల వాంగ్మూలం ఆధారంగా కుంభకోణంలో కవిత కింగ్‌పిన్‌గా వ్యవహరించినట్లు తెలిసిందన్నారు. హవాలా రూపంలో డబ్బులు తరలించడంలో ఎవరెవరి పాత్ర ఏంటనేది వివరించారు. వాదనల అనంతరం ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకొనే అంశంపై ఈ నెల 29న తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి కావేరి బవేజా పేర్కొన్నారు.

రుద్రమదేవి కాలం నాటి శాసనం గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంలోని సంతాన వేణు గోపాల స్వామి ఆలయంలో కాకతీయుల కాలం నాటి భూమి దాన శాసనం వెలుగు చూసింది. ఆలయ మంటపస్తంభంపై ఉన్న 13వ శతాబ్దికి చెందిన ఈ శాసనాన్ని ఆలయ అర్చకుడు వేణుగోపాల్, తెలంగాణ వారసత్వ శాఖ పూర్వ ఉప సంచాలకుడు రంగాచార్యులు గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. ఈ శాసనంలో రుద్రమ దేవమహారాజులు అని పేర్కొనటం ప్రత్యేకంగా కనిపించిందని ఆయన తెలిపారు.

వారణాసిలో వార్ వన్ సైడే

కాశీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏడో దశలో జూన్ 1న పోలింగ్ జరుగనున్న వారణాసిలో వార్ వన్ సైడే అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. పోల్ అయ్యే ఓట్లలో అత్యధిక శాతం ప్రధాని మోదీకే పడటం ఖాయమన్నారు. మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గంలో తెలుగు వారు అత్యధికంగా నివసించే పాండే హవేలీ, సోనార్ పుర తదితర ప్రాంతాల్లో ఆయన డోర్ టు డోర్ ప్రచారం చేయడంతో పాటు తెలుగు సంఘాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ వారణాసిలో మోదీ విజయం ఖాయమని, అయితే దేశంలోనే అత్యధిక మెజారిటీ రావాలంటే పోలింగ్ శాతం పెరిగేలా చూడాల్సిన అవసరం ఉందని తెలుగు సంఘాల ప్రతినిధులను కోరారు. తెలుగు ఓటర్ల పోలింగ్ నూటికి నూరు శాతం జరిగేలా చూడాలని శ్రీరామ తారక ఆంధ్రాఆశ్రమంలో వారణాసి తెలుగు సమితి కార్యదర్శి వి.వి.సుందర శాస్త్రిని కోరారు. పలు మఠాలు, సత్రాల్లో తెలుగు సంఘాలతో జరిగిన సమావేశాల్లో స్థానిక కార్పొరేటర్ ముఖర్జీతో పాటు హైదరాబాద్ నుంచి వెళ్లిన బీజేపీ నాయకులు గీతా మూర్తి, బొమ్మ జయశ్రీ, ఉమారాణి, సంగప్ప, విక్రమ్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, పరిణీత పాల్గొన్నారు.

సీసీఎస్ ఏసీపీ ఇంట్లో ఏసీబీ సోదాలు

▶ మొదటి పేజీ తరువాయి

తెల్లవారుజామున 5 గంటల సమయంలో ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. కాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీపీ ఉమామహేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్రబాబు తెలిపారు.

'ప్రీలాంచ్' నిందితులకు వత్తాసుపై ఫిర్యాదులు

ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో వేలాది మంది నుంచి డబ్బు వసూలు చేసి నిండా ముంచిన సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ, దాని అనుబంధ సంస్థలపై అనేక కేసులు నమోదయ్యాయి. రూ.వేల కోట్లతో ముడిపడి ఉన్న ఈ స్కామ్‌కు సంబంధించిన కేసులు అన్నీ సీసీఎస్‌కు బదిలీ అయ్యాయి. దాదాపు 50 కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసిన ఉన్నతాధికారులు దాని బాధ్యతలు ఉమామహేశ్వరరావుకు అప్పగించారు. దీన్ని తనకు అనువుగా మార్చుకున్న ఉమా మహేశ్వరరావు నిందితుల నుంచి భారీ మొత్తం డిమాండ్ చేసి వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితులకు వత్తాసు పలుకుతూ బాధితులకు తీవ్ర అన్యాయం చేశారనే ఫిర్యాదులు ఏసీబీకి అందాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదులూ వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసుకున్న ఏసీబీ దర్యాప్తు చేపట్టింది.

ఏపీలోని బంధువుల ఇళ్లలోనూ సోదాలు

మంగళవారం ఉదయం అశోక్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఉమామహేశ్వరరావు ఇల్లు, నేరేడ్‌మెట్, ఎల్బీనగర్‌ల్లోని స్నేహితుల ఇళ్లు, ఆయన సోదరుడు, మామ ఇళ్లతో సహా ఏపీలోని భీమవరం, విశాఖపట్నం, నర్సీపట్నంల్లోని బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంటలో ఉమామహేశ్వరరావు దూరపు బంధువు దివంగత మద్దు తమ్మునాయుడు ఇంట్లో ఐదుగురు సభ్యులతో కూడిన తెలంగాణ ఏసీబీ అధికారుల బృందం తనిఖీలు చేసింది. తమ్మునాయుడు భార్య నుంచి వారి ఇల్లు, భూములు తదితర ఆదాయ వనరుల వివరాలు సేకరించారు.

సోదాలు పర్యవేక్షించిన జేడీ సుధీంద్రబాబు

ఉమామహేశ్వరరావు, సందీప్ కలిసి అనేక చోట్ల పెట్టుబడులు పెట్టారని ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సందీప్ ఎవరు? అతడి పాత్ర ఏంటి? అనేది లోతుగా ఆరా తీస్తున్నారు. సీసీఎస్‌లోని ఉమామహేశ్వరరావు చాంబర్‌లో తనిఖీలు చేపట్టి ,ఆయన దర్యాప్తు చేసిన కేసుల వివరాలు ఆరా తీస్తున్నారు. జేడీ సుధీంద్రబాబు మంగళవారం రాత్రి అశోక్‌నగర్‌లోని ఉమామహేశ్వరరావు ఇంటికి వెళ్లి సోదాలను పర్యవేక్షించారు. ఉమామహేశ్వరరావును అరెస్టు చేశామని, బుధవారం కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు. గతంలో అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఉమామహేశ్వరరావు అక్కడ ఓ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యారు. విధుల్లోకి తిరిగి వచ్చిన ఆయన్ను రేంజ్ అధికారులు సైబరాబాద్ కమిషనరేట్‌కు అలాట్ చేశారు. జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తుండగా ఓ నేర స్థలికి వెళ్లిన ఆయన అక్కడ ఓ మహిళ ముందు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తూ వివాదాస్పదుడు కావడంతో మరోసారి సస్పెండ్ అయ్యారు. ఇబ్రహీంపట్నం ఏసీపీగా పని చేసిన ఉమామహేశ్వరరావు ఎన్నికల ముందు జరిగిన బదిలీల్లో సీసీఎస్‌కు వచ్చారు.





ఉమామహేశ్వరరావు నివాసంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు, (వృత్తంలో ఉమామహేశ్వరరావు). ఆయన ఇంట్లో స్వాధీనం చేసుకున్న నగదు

పత్రాలు, డైరీల్లో సందీప్ అనే పేరు

దాడుల్లో పలు కీలక డాక్యుమెంట్లతో పాటు రూ.38 లక్షల నగదు, 60 తులాల బంగారం, 17 ఆస్తులకు సంబంధించిన పత్రాలు, 5 ప్లాట్ల వివరాలు లభించినట్లు తెలిసింది. ఉమామహేశ్వరరావు బినామీల పేరిట భారీగా ఆస్తులు కూడగట్టారని ఏసీబీ అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్ల విషయంలో ఉమామహేశ్వరరావు సహకరించట్లేదని, వాటిని తెరవడానికి కొంత సమయం పడుతుందని అధికారులు చెప్తున్నారు. ఉమామహేశ్వరరావు నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాలు, డైరీల్లో సందీప్ అనే పేరును అధికారులు గుర్తించారు. తన వెంట నిత్యం ల్యాప్‌టాప్ ఉంచుకునే ఉమామహేశ్వరరావు అందులో తాను ఎవరి నుంచి ఎంత తీసుకున్నదీ రాసుకున్నట్లు తెలిసింది. దీన్ని స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అందులోని వివరాలు విశ్లేషిస్తున్నారు.

కిర్గిస్తాన్‌లో తెలంగాణ విద్యార్థుల గోస

ఘర్షణల నేపథ్యంలో ఆందోళనలో మన విద్యార్థులు



ఘర్షణల్లో గాయపడ్డ విద్యార్థి

సాక్షి, హైదరాబాద్: కిర్గిస్తాన్ దేశంలో లోకల్, నాన్ లోకల్ ఘర్షణలు తీవ్రమయ్యాయి. దీంతో భారత్‌కు చెందిన పౌరులపై దాడులు జరుగుతున్నాయి. కిర్గిస్తాన్ వ్యక్తిని ఈజిప్ట్‌కు చెందిన గ్యాంగ్ కొట్టడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. దీంతో కిర్గిస్తాన్ దేశానికి చెందిన కొందరు అల్లర్లకు పాల్పడుతున్నారు. ఇతర దేశాల పౌరులు తమ దేశంలో ఉండొద్దని, తక్షణం దేశం విడిచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో అక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణల కారణంగా తెలంగాణకు చెందిన 172 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు సైతం అక్కడ చిక్కుకుపోయారు. వారిని హాస్టళ్ల నుంచి బయటకు పంపకుండా మేనేజ్‌మెంట్లు నిర్బంధం విధించాయి. వారి విషయంలో ఇండి యా ఎంబసీ కూడా పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తాము కాలేజీ హాస్టల్లోనే ఉంటున్నామని ఆ దేశ రాజధాని బిష్కెక్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న హైదరాబాద్ విద్యార్థి అభినయ్, నిర్మల్‌కు చెందిన మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా గొడవలు కొనసాగుతూనే ఉన్నాయని వారు చెప్తున్నారు.

విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కిషన్‌రెడ్డి లేఖ



కిర్గిస్తాన్‌లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులను క్షేమంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక విమానాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్‌కు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ దేశంలో పెద్దసంఖ్యలో తెలుగు విద్యార్థులు మెడిసిన్ చదువుతున్నారని, వారి క్షేమం గురించి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ తనకు వినతిపత్రాలు సమర్పించారని తెలియజేశారు. అక్కడి పరిస్థితులు అదుపులోకి వచ్చేదాకా విద్యార్థులను భారత్‌కు రప్పించేందుకు చొరవ తీసుకోవాలని జయశంకర్‌కు రాసిన లేఖలో కిషన్‌రెడ్డి కోరారు.

రాష్ట్రీయ గీతం.. రెండు వెర్షన్లలో

- రచయిత అందెశ్రీ, మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణితో సీఎం సమావేశం
- జయ జయహే తెలంగాణ గేయంలో మార్పులుచేర్పుల బాధ్యత అందెశ్రీకే
- దశాబ్ది తెలంగాణ ఉత్సవాల్లో సోనియాగాంధీ చేతుల మీదుగా విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 2న నిర్వహించనున్న బహిరంగసభలో తెలంగాణ రాష్ట్ర గీతమైన 'జయ జయహే తెలంగాణ'కు సంబంధించిన రెండు వెర్షన్లను అధికారికంగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' పూర్తి స్థాయి గేయాన్ని ఓ వెర్షన్‌గా, సంక్షిప్తీకరించిన గేయాన్ని మరో వెర్షన్‌గా విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గేయ రచయిత అందెశ్రీ, సినీ సంగీత దర్శకుడు కీరవాణితో సమావేశమయ్యారు. రాష్ట్ర గీతానికి రెండు వెర్షన్లు సిద్ధం చేసి కీరవాణితో కలిసి రికార్డు చేసే బాధ్యతలను అందెశ్రీకి ప్రభుత్వం అప్పగించింది. అంతర్జాతీయ, జాతీయ, వివిధ రాష్ట్రాల అధికారిక గీతాలను పరిశీలించి ఓ నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. పూర్తిస్థాయి వెర్షన్‌లో గేయాన్ని ఉన్నది ఉన్నట్టు వాడుకోవాలా, ఏమైనా మార్పులు చేయాలా అన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అందెశ్రీ తన ఆలోచనలను వివరించారు. చరణాలు, పల్లవి, బాణీలో అవసరమైన మార్పులపై తుదినిర్ణయం తీసుకునే బాధ్యతను అందెశ్రీకి అప్పజెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి అతిథులు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు సుదీర్ఘంగా ఉన్న జయజయహే తెలంగాణ గేయాన్ని పాడటం/వినిపించడానికి అవసరమైన సమయం ఉండదు. ఈ నేపథ్యంలో గేయం సంక్షిప్త రూపంతో మరో వెర్షన్‌ను సైతం సిద్ధం చేస్తున్నారు. గేయాలను ఎవరు పాడాలి? కోరస్ ఉండాలా? సోలోగా పాడాలా? అనే అంశాలను సైతం అందెశ్రీకి వదిలేసింది. సంగీత దర్శకుడిగా కీరవాణి పేరును సైతం అందెశ్రీ ప్రభుత్వానికి సూచించినట్టు సమాచారం. ఉద్యమ సమయంలో యావత్ తెలంగాణ సమాజాన్ని ఉర్రూతలూగించిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఎంపిక చేయాలని గతంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ముఖ్యప్రజాసంబంధాల అధికారి బోరెడ్డి అయోధ్యరెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.

తిరుమలకు సీఎం రేవంత్



తిరుమలలో మనవడితో సీఎం రేవంత్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుమలకు వెళ్లారు. మనవడి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకోవడానికి ఆయన శ్రీవారి ఆలయానికి వెళ్లినట్లు తెలిసింది. బుధవారం ఉదయం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీఎం హైదరాబాద్‌కు తిరిగి చేరుకోనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గొంతు కోసింది: పొన్నాల

- ఓట్లు దండుకునేందుకే రేవంత్ హామీలు



సాక్షి, హైదరాబాద్: సన్న వడ్లకు మాత్రమే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామనడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గొంతు కోసిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. ఓట్లు దండు కోవడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సొంత ప్రయోజనాల కోసమే సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసుకున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పొన్నాల లక్ష్మయ్య మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకే బోనస్ ఇస్తామని మెలిక పెడుతోందని మండిపడ్డారు. తడిసిన ధాన్యం కల్లాల వద్దకు వెళ్లకుండా కాంగ్రెస్ మంత్రులు పొరుగు రాష్ట్రాల్లో పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని ఇప్పటి వరకు ఒక్క కిలో కూడా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయలేదని పొన్నాల తెలిపారు. అధికారంలోకి వస్తే రైతుబంధు మొత్తాన్ని పెంచి రైతు భరోసా పేరిట ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామనే హామీపై కేబినెట్ సమావేశంలో చర్చ జరిగిందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతున్నారన్నారు. తక్కువ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని పొన్నాల లక్ష్మయ్య అన్నారు.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఎదుట సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

దొడ్డురకం వడ్లకూ బోనస్ ఇవ్వాలి

- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతుల ధర్నా
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

భానుపురి (సూర్యాపేట): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నరకం, దొడ్డురకం వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు గేటు ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని రేవంత్‌రెడ్డి తన మేనిఫెస్టోలో పేర్కొన్నారని, కానీ ఇటీవల కేబినేట్ సమావేశంలో మాత్రం కేవలం సన్నరకం వడ్లకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడం సరైంది కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి మోసం చేసిందని ధ్వజమెత్తుతూ కొందరు రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతుబంధు నిధులను కూడా సకాలంలో అందించాలని, సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం మొండివైఖరిని విడనాడాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు భిక్షం, లక్ష్మయ్య, సుధాకర్ తదితరులు హెచ్చరించారు.

రాష్ట్రంలో కొత్తగా యు ట్యాక్స్!

బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపణ


- ఈ మొత్తం అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వెళుతోంది
- 40 కిలోల ధాన్యం బస్తాకు అదనంగా 4 కిలోలు తీసుకుంటూ రైతులను దోచుకుంటున్నారు
- యు ట్యాక్స్ కింద రూ.500 కోట్లు చేతులు మారాయి
- ఇందులో రూ.100 కోట్లు మంత్రి ఉత్తమ్ అధిష్టానానికి పంపించారు
- రాష్ట్రంలో శాఖల వారీగా టోల్‌గేట్లు పెట్టి వసూళ్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా యు ట్యాక్స్ వసూలు చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మొత్తం అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వెళుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్య ప్రజల రక్తం తాగే కుంభకోణం జరుగుతోందని, రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అతిపెద్ద కుంభకోణాల్లో యు ట్యాక్స్ కుంభకోణం ఒకటి అని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు బయట పెట్టేందుకు కూడా తాను సిద్ధమని ప్రకటించారు. రాష్ట్రంలో శాఖల వారీగా టోల్‌గేట్లు పెట్టి వసూళ్లు సాగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు తాను ప్రస్తావించింది సివిల్ సప్లయిస్ గేట్ మాత్రమేనని, ఇతర శాఖల టోల్ గేట్లు కూడా త్వరలో బయటపెడతామని అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

అదనంగా 4 కిలోలు దోచుకుంటున్నారు

రాష్ట్రంలో ఏడాదికి కోటి 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేస్తుండగా, 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కువగా కాంటా చేస్తున్నారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 40 కిలోల బస్తాకు అదనంగా 4 కిలోలు తీసుకుంటూ రైతులను దోచుకుంటున్నారని చెప్పారు. తాలు, తేమ పేరుతో క్వింటాలుకు 10–15 శాతం ధాన్యాన్ని కొల్లగొడుతున్నారన్నారు. రైతుల నుంచి అధికంగా కొల్లగొడుతున్న రూ.1,600 కోట్ల విలువైన ధాన్యం ఎవరి ఖాతాలోకి వెళ్తోందని ప్రశ్నించారు. రైస్ మిల్లర్లు ధాన్యం అధికంగా జోకుతున్నారని ఇందులో అధికారులు, సంబంధిత మంత్రి వాటా ఎంతవరకు ఉందని ప్రశ్నించారు. కొత్తగా వసూలు చేస్తున్న యు ట్యాక్స్ కింద రూ.500 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. అందులో నుంచే గత ఎన్నికల ఖర్చు కోసం రూ.100 కోట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీ అధిష్టానానికి పంపించారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రైతులకు డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న రైస్ మిల్లర్లకు సంబంధించిన డేటా ప్రభుత్వం వద్ద ఉందా? అని నిలదీశారు. సీఎం రేవంత్ దీనిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని చెబుతోందని, ఇవి ఒక్క నల్లగొండ జిల్లాలోనే అధికంగా ఉన్నందున ఉత్తమ్ తన జిల్లాకు న్యాయం జరిగితే చాలని భావిస్తే సరిపోదన్నారు. సన్నవడ్లకు బోనస్‌తో 5 శాతం మంది రైతులకే లబ్ధి కలుగుతుందని, 95 శాతం రైతుల పరిస్థితి ఏమిటని నిలదీశారు.



బోనస్ అంటే తెలియనోళ్లు మొరుగుతున్నారు

- పొద్దునలేస్తే కాంగ్రెస్‌పై ఏడుస్తున్నారు: మంత్రి తుమ్మల



ఖమ్మం వన్‌టౌన్: కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నామని, అందుకే సన్నాలు పండించే రైతులకు రూ.500 బోనస్ ప్రకటించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బోనస్ అంటే అర్థం తెలియని వారు కాంగ్రెస్‌పై మొరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకల్లో పాల్గొని మంత్రి మాట్లాడారు. మా ప్రభుత్వం మూడు రోజుల్లోనే కూలిపోతుందని బీఆర్ఎస్ నేతలు భావించారని, అది సాధ్యం కాకపోవడంతో పొద్దున లేచింది మొదలు కాంగ్రెస్ పార్టీపై పడి ఏడుస్తున్నారన్నారు. ఎప్పుడు ఎవరి మీద ఏడవాలో తెలియని సన్నాసులు బీఆర్ఎస్ వాళ్లని పేర్కొన్నారు. పదేళ్ల పాటు వ్యవస్థలను నాశనం చేసిన వారు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కాగా, ప్రతీ ఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేసి గెలిపిస్తున్నారని.. ఈక్రమంలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెట్టిన నేత రాజీవ్‌గాంధీ అని, ప్రపంచంలో అనేక సంస్థలకు భారతీయులే సీఈఓలుగా ఉండడానికి రాజీవ్ ఇచ్చిన స్ఫూర్తే కారణమని తెలిపారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యు ట్యాక్స్.. పచ్చి అబద్ధం: ఉత్తమ్

మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలకు జవాబిస్తా



సాక్షి, హైదరాబాద్: నిత్యం వార్తల్లో ఉండాలనే ఆత్రుతతో కనీస అవగాహన కూడా లేకుండా బీజేపీ నేతలు నిరాధార, అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన యు ట్యాక్స్ ఆరోపణలు పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇతర రాష్ట్రాల్లో తీర్థయాత్ర చేస్తున్న మంత్రి ఉత్తమ్ ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'వంద రోజుల్లో తెలంగాణలో అద్భుత పాలన అందించాం. అస్తవ్యస్తంగా ఉన్న పాలనను గాడిలో పెట్టి నడిపిస్తున్నాం. యు ట్యాక్స్ వసూలు చేస్తున్నామనడం దుర్మార్గం. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు వస్తున్నా. మహేశ్వర్‌రెడ్డి చేసిన అన్ని ఆరోపణలకు తగిన జవాబు చెప్తా..'అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

రామేశ్వరం కేఫ్ కేసులో ఎన్ఐఏ దూకుడు

- తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాల్లోని 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- అదుపులో వికారాబాద్‌కు చెందిన పండ్ల వ్యాపారి?

సాక్షి, హైదరాబాద్, వికారాబాద్: బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో ఈ ఏడాది మార్చి 1న జరిగిన పేలుడు కేసు దర్యాప్తులో ఎన్ఐఏ అధికారులు వేగం పెంచారు. విదేశాల నుంచి వచ్చిన నిందితులను హ్యాండిల్ చేసిన కుట్రదారులను గుర్తించే ప్రయత్నాల్లో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బెంగళూరు బ్రాంచ్ అధికారులు నాలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి ఏక కాలంలో ఎన్ఐఏ బృందాలు తెలంగాణతోపాటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని 11 ప్రదేశాలలో సోదాలు నిర్వహించాయి. ఆ సోదాల్లో భాగంగా వికారాబాద్‌లో ఒక పండ్ల వ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. వికారాబాద్‌లో పట్టుబడిన సదరు వ్యాపారి స్వస్థలం పుణే అని, నాందేడ్‌లోనూ పండ్ల వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది.

రాయదుర్గంలో ఇరువురిని ప్రశ్నించిన ఎన్ఐఏ

ఏపీలో అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ఆత్మకూరు వీధిలో రిటైర్డ్ హెడ్‌మాస్టర్ అబ్దుల్, సోహెల్ అనే వ్యక్తులను ఎన్ఐఏ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. వీరిలో సోహెల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బాంబు పేలుడు నిందితులతో సోహెల్‌కు సంబంధాలున్నాయని, సోహెల్ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ అయినట్టు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో వివిధ డిజిటల్ పరికరాలు, పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్ఐఏ అధికారులు విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులు ముస్సావిర్ హుస్సేన్, అబ్దుల్ మతీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

పాటు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కూడా హామీ ఇచ్చిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం మోసానికి పరాకాష్టగా పేర్కొన్నారు. యాసంగిలో సాగు చేయని సన్నవడ్లకు బోనస్ ప్రకటించడం రైతుల నోట్లో మట్టికొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలంలో 20 శాతం మాత్రమే సన్నరకం సాగు చేస్తారని, యాసంగిలో 99 శాతం దొడ్డు వడ్లు సాగు చేస్తారన్నారు.

'భరోసా'రూ.5 వేలేనా?

రాష్ట్రంలో దిగుబడి వచ్చే 1.20 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానికి బోనస్ ఇచ్చేందుకు రూ.6 వేల కోట్లు అవసరమవుతాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే కేవలం సన్న రకం వడ్లకే బోనస్ ఇచ్చేందుకు రూ.500 కోట్లు సరిపోతాయని, దీనితో రూ.5,500 కోట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించి, గతంలో మాదిరిగా తొలి విడతలో కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. రైతు భరోసా కింద రైతులకు బకాయి పడిన రూ.2,500తో పాటు వానాకాలం సాయం రూ.7,500 కూడా కలుపుకుని జూన్ నెలాఖరులోగా ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలన్నారు. వాస్తవ పరిస్థితిని వివరించేందుకు మీడియా సమావేశంలోనే మెదక్ జిల్లా ముత్తాయి కోట నుంచి బెజ్జంకి కేంద్రానికి లోడ్ తీసుకెళ్లిన లారీ డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డితో హరీశ్ ఫోన్‌లో మాట్లాడారు.

బీజేపీ అనుకుంటే ఎన్నైనా ఇస్తుంది

కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. బీజేపీ తలచుకుంటే అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు ముప్పు ఉందని ఎన్డీఎస్ఏ నివేదికలు ఎన్నైనా ఇప్పించగలదని అన్నారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నది కేంద్ర ప్రభుత్వమే అయినా నేటి వరకు ఎన్డీఎస్ఏ ఒక్క నివేదిక కూడా ఇవ్వలేదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అమూల్యమైన ఆరునెలల సమయాన్ని వృధా చేసిందని, రైతుకు మేలు చేయాలని ఉంటే మార్గం కూడా ఉంటుందన్నారు. రాజకీయాలు ముఖ్యమా, రైతు ప్రయోజనాలు ముఖ్యమా అనేది కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చుకోవాలని సూచించారు.

చేపలు పట్టే వృత్తి వివాదంపై కమిటీ ఏర్పాటు చేయండి

6 నెలల్లో మార్గాలను సూచించాలి.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చేపలు పట్టే వృత్తి వివాదంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులు వెలువడిన మూడు నెలల్లోగా ఈ కమిటీ ఏర్పాటు చేసి బెస్త/గాండ్ల/గంగపుత్ర- ముదిరాజ్/ముత్రాస్/తెనుగొల్లు సంఘాల మధ్య విభేదాలను విశ్లేషించి పరిష్కారమార్గాలు సూచించాలని స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఉన్న జీఓలు, నిబంధనలను పరిశీలించి చట్టప్రకారం ఏం చర్యలు తీసుకోవాలో చెప్పాలని పేర్కొంది. మత్స్యకారుల సహకార సంఘాలు పూర్తిగా బెస్త/భోయ్/గంగపుత్ర/గాండ్ల వారికే మాత్రం చెందుతాయని.. ముదిరాజ్/ముత్రాస్/తెనుగోళ్లకు అందులో సభ్యత్వం పొందే హక్కు లేదంటూ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన మత్స్యకార సహకార సంఘంతోపాటు మరో 25 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కోర్టు ఉత్తర్వులు వెలువడిన 3 నెలల్లోగా పశుసంవర్ధక, డెయిరీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలతో కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.



సన్న బియ్యంతో 'బోనస్' ప్రారంభిస్తున్నాం

భవిష్యత్తులో ఇది కొనసాగుతుంది: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చే ప్రక్రియను సన్న ధాన్యంతో ప్రారంభిస్తున్నామని, భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, రైతులెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో పార్టీ నేతలు ఒబేదుల్లా కొత్వాల్, సునీతారావు, లింగం యాదవ్, ఇందిరా శోభన్‌లతో కలసి మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం వడ్లు కొన్న మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందని.. అది రుచించకనే ప్రతిపక్షాలు రైతులను భయాందోళనకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నాయని భట్టి ఆరోపించారు. గతంలో అప్పటి సీఎం కేసీఆర్ వరి వేస్తే ఉరేనని ప్రకటించిన విషయాన్ని రాష్ట్ర రైతాంగం మరచిపోదని పేర్కొన్నారు.

రైతులను రాజకీయానికి వాడుకోవద్దు

"రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదంటూ.. కల్లాల్లోని ధాన్యం తడిసిముద్ద అవుతోందంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రైతులను ఇలా ఇబ్బందిపెట్టి వారిని రాజకీయానికి వాడుకోవద్దు. గత ప్రభుత్వం తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. నేను పాదయాత్ర చేసిన సమయంలో రైతులు నాతో గోడువెళ్లబోసుకున్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం మొలకెత్తిన ధాన్యానికి కూడా మద్దతు ధర ఇస్తోంది. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు.." అని భట్టి పేర్కొన్నారు. ఏ ప్రాంతంలో ఎంత పంట పడుతోంది, ఏ రోజున ఎంత ధాన్యం కొనుగోలు చేశామనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు.

మహిళలకు కాంగ్రెస్‌తోనే న్యాయం: భట్టి

అంతకుముందు గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం పని చేసేది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. పార్టీలోని అన్ని స్థాయిల్లో మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తామని, నామినేటెడ్ పదవుల్లోనూ ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.



మనం తృష్ణ వల్ల ప్రేరేపించబడితే ఒక పని చేసేటప్పుడు, అది పూర్తయిన తరువాత చింతిస్తాం. అదే విచక్షణతో చేస్తే ఇక మనం చింతించాల్సిన పని ఉండదు.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 22 మే 2024

ఏం జరగనుంది?

ప్రపంచమంతటినీ ఒక్కసారి ఉలిక్కిపడేలా చేసిన ప్రమాదం... విన్న వెంటనే రకరకాల ఆలోచనలు, అనుమానాలు తలెత్తిన అనూహ్య ఘటన... ప్రతికూల వాతావరణంలో చిక్కుకోవడంతో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీమ్ రైసీ, విదేశాంగమంత్రి హుసేన్ అమీర్ అబ్దుల్లాహియన్‌లు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ వాయవ్య ఇరాన్‌లో ఆదివారం కుప్పకూలిందన్న వార్త పలు పాత, కొత్త విషయాలను ఏకకాలంలో స్ఫురణకు తెచ్చిన సంచలనం. అంతర్జాతీయ ఆంక్షలు, విమానాల నిర్వహణలో కష్టాల వల్ల ఇరాన్‌లో విమానయాన భద్రత దీర్ఘకాలంగా పెనుసవాలైంది. తాజా ఘటనతో ఆ సంగతి మళ్ళీ రుజువైంది. గగనయానంలో గతంలో పలువురు ప్రముఖుల దుర్మరణాల మొదలు రైసీ హయాంలో ఇరాన్ ప్రస్థానం, రానున్న కాలంలో వచ్చే మార్పుల వరకు అనేకం చర్చనీయాంశాలయ్యాయి.

ఇరాన్ – ఇరాక్ యుద్ధం నాటి నుంచి తన విపరీత వర్తనతో వార్తల్లో ఉన్న సంప్రదాయవాద మతబోధకుడు రైసీ దేశాధ్యక్షపదవిని చేపట్టింది 2021లోనే! ఆయన కన్నా ముందు మితవాది అయిన హసన్ రోహానీ ఎనిమిదేళ్ళు ఆ పదవిలో ఉన్నారు. చర్చల ద్వారా మార్పు తేవాలనీ, దేశాన్ని సుసంపన్నం చేయాలనీ భావించిన రోహానీకి పూర్తి భిన్నమైన వ్యక్తి రైసీ. కరడుగట్టిన ఛాందసం, హిజాబ్ ధారణ సహా సమాజంలో కఠిన నిబంధనల అమలు, వందలాది ఉరిశిక్షలతో అంతులేని అపకీర్తి సంపాదించుకున్నారు. నిజానికి, అమెరికా సహా ప్రపంచ దేశాలతో అణు ఒప్పందంపై 2015లో రోహానీ సంతకం చేశారు. కానీ, ఆనక అమెరికా అధ్యక్షపీఠమెక్కిన ట్రంప్ మాటతప్పి, 2018లో ఇరాన్‌పై మళ్ళీ ఆంక్షలు విధించేసరికి దేశంలో చెల్లని కాసయ్యారు.ఫలితంగా మితవాదుల్ని తోసిపుచ్చి, ఛాందసులు పట్టు బిగించారు. మానవ హక్కుల సంఘాలు సహా అందరూ వ్యతిరేకించడంతో అంతకు ముందు ఒకటికి రెండు సార్లు ఎన్నికల్లో నెగ్గలేకపోయినప్పటికీ, ఎట్టకేలకు 2021లో రైసీ పీఠమెక్కారు. దేశాధ్యక్షుడిగా ఆయన వ్యవహరించింది కొద్ది కాలమే! ఆయన హయాంలో పొరుగున ఉన్న అరబ్ దేశాలతో సంబంధాలను సాధారణ స్థితికి తీసుకొచ్చే ప్రయత్నం జరిగింది. అదే సమయంలో ఇజ్రాయెల్‌తో, పాశ్చాత్య ప్రపంచంతో ఘర్షణలు మరింత పెరిగాయి.

ప్రాణాలు తీసిన హెలికాప్టర్ చాలా పాతదంటున్నారు. పాశ్చాత్య దేశాల కఠిన ఆంక్షల కారణంగా కొత్త ఛాపర్లు, విమానాలను ఇరాన్ సమకూర్చుకోలేకపోయిందట. అమెరికా మాటెలా ఉన్నా... చైనా, రష్యాలతో సాయిలా ఫాయిలాగా ఉంటున్న దేశానికి, అందులోనూ అసంఖ్యాకంగా డ్రోన్లు సహా అపమిత ఆయుధ సంపత్తి గల దేశానికి పాత ప్రయాణ సాధనాలే గతి అయ్యాయంటే ఆశ్చర్యమే. ఏమైనా, ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు హమాస్, హెజ్బుల్లా లాంటి వాటికి కొండంత అండగా నిలిచి రైసీ అక్షరాలా అమెరికాకు కంటిలో నలుసయ్యారు. అందుకే, హెలికాప్టర్ ప్రమాదంలో కుట్రకోణం ఉండవచ్చనే అనుమానాలు వినవచ్చాయి. ఇటీవలి పశ్చిమాసియా పరిణామాలు... ఆ అనుమానాలకు బలమిచ్చాయి. తమపై దాడి చేసిన హమాస్‌కు పెద్ద అండ ఇరాన్ గనక తెగబడి ఇజ్రాయెల్ గుట్టుగా హత్య చేయించి ఉండవచ్చనే పుకార్లు షికారు చేస్తున్నాయి. పైగా, గాజా చర్యల్లో ఇజ్రాయెల్‌ను బాహాటంగా సమర్థిస్తూ, దానితో వ్యూహాత్మక సహకారమున్న అజర్‌బైజాన్‌కు రైసీ వెళ్ళి వస్తున్నప్పుడే ఘటన జరగడం గమనార్హం. అయితే అనుమానాలకు తగిన ఆధారాలు కానీ, కనీసం ఇరాన్ నుంచి ఆరోపణలు కానీ... ఏవీ ఇప్పటి దాకా బయటకు రాలేదు. ఫలితంగా, దురదృష్టకర ప్రమాదంలోనే ఇరాన్ అధ్యక్షుడు దుర్మరణం పాలయ్యారని ప్రస్తుతానికి భావించాలి.

ప్రమాదంపై లోతుగా దర్యాప్తు జరిపి, నిజానిజాలను సమగ్రంగా బయటపెట్టాల్సిన బాధ్యత ఇరాన్‌దే! ఏమైనా, అమెరికా ఆంక్షలు, ఆర్థికరంగంలో ఇక్కట్లు, సమాజంలో అసంతృప్తి, నెత్తిన పశ్చిమాసియా కుంపటితో అస్తుబిస్తు అవుతున్న వేళ ఈ దుర్ఘటన ఆ దేశానికి అశనిపాతం. ఇక, ప్రస్తుతానికి దేశ ఉపాధ్యక్షుడికి తాత్కాలిక అధ్యక్ష హోదా ఇచ్చారు. యాభై రోజుల సంతాప దినాల తర్వాత ఇరాన్ కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఆ దేశంలో అధినాయకుడి (అలీ ఖమేనీ)దే ఆఖరు మాట. అయినా అధ్యక్ష పదవి సైతం కీలకమే! దేశీయ, ప్రాంతీయ అనిశ్చితులు ఎన్నో ఉన్నా, రైసీ దుర్మరణంతో ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ రాజకీయాల్లో, విధానాల్లో అనూహ్యమైన మార్పులు వస్తాయనీ అనుకోలేం. హెలికాప్టర్ ప్రమాదఘటన ఇరాన్‌కు తీరని విషాదమే తప్ప, రాజకీయ సంక్షోభం కాదని విశ్లేషకులూ తేల్చేస్తున్నారు. అధినాయకుడైన ఖమేనీకి ఆశ్రితుడిగా, ఆయన మాటను ధిక్కరించే ఆలోచనైనా లేని అధ్యక్షుడిగా, ఎనభై అయిదేళ్ళ వయసు మీద పడ్డ ఆయనకు అరవయ్యోపడిలోని వారసుడిగా అందరూ భావించిన రైసీ హఠాన్మరణంతో ఒక అధ్యాయమైతే ముగిసింది. ఇరాన్ చరిత్రలో కొత్త అధ్యాయం ఏమిటి, వారసుడెవరన్నది చర్చ. ఈ వారసత్వ రాజకీయాల కొత్త కూర్పులో ఖమేనీ కుమారుడు సయ్యిద్ మొజ్తబా హుసేనీ పైకి వస్తారని ఓ అంచనా.

ఇస్లామిక్ ధర్మశాస్త్ర పాలన (వెలాయత్ ఎ ఫకీ) పేరిట మతాచార్యులకు పెద్ద అయిన షియా ధర్మశాస్త్రవేత్త అధినాయకుడిగా కొనసాగే పద్ధతి 1979లో ఇస్లామిక్ విప్లవం అనంతరం ఇరాన్‌లో వచ్చింది. అధినాయకుడు, ఆ తర్వాతే దేశాధ్యక్షుడు వగైరా అన్న విధానంపై విమర్శలు, చట్టబద్ధతపై ప్రశ్నలు, అధికారానికి అనేక సవాళ్ళు వచ్చినా ఇన్నేళ్ళుగా అది కొనసాగింది. 1989 నుంచి ఖమేనీ కనుసన్నల్లోనే ఇరాన్ నడిచింది. కానీ, మారుతున్న భౌగోళిక రాజకీయాలు, దీర్ఘకాలంగా అణిచిపెడుతున్నప్పటికీ పెరుగుతున్న అంతర్గత అసంతృప్తి లాంటివి ఈ ఇస్లామిక్ దేశం ముందున్న పెనుసవాళ్ళు. వాటిని అధినాయకత్వం ఎలా దీటుగా ఎదుర్కొంటుందో కచ్చితంగా ఆసక్తికరం.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.చతుర్దశి సా.5.56 వరకు తదుపరి పౌర్ణమి, నక్షత్రం: స్వాతి ఉ.7.16 వరకు, తదుపరి విశాఖ వర్జ్యం: ప.1.15 నుండి 2.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.31 నుండి 12.19 వరకు, అమృతఘడియలు: రా.11.28 నుండి 1.11 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఎన్నికల నైతికత నెలకొనేనా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఎన్నికల రంగంలో సాధారణంగా జరగాల్సిన నైతిక ప్రచారం... తమ పార్టీ గెలిస్తే ఏం చెయ్యబోతోందో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం. జగన్ తన పార్టీ బహిరంగ సభల్లో తను గత ఐదేండ్లు చేసిన పనులు, గెలిస్తే చెయ్యబోయే పనులు చెబుతూ తిరిగారు. అనైతిక భాషను ఎవరి మీదా వాడటం కనిపించలేదు. కానీ చంద్రబాబు గానీ, ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో మీటింగుల్లో పాల్గొన్న మోదీ గానీ ఆ నైతికతను పాటించలేదు. ఎదుటి నాయకుడిని నిందించే నైతికతను మాత్రమే పాటించారు. ఎన్నికల కమిషన్‌కు కూడా ఎన్నికల్లో ఏ చర్చ నీతివంతమైనది, ఏది కాదు అనే అంశంపై స్పష్టత లేదు. ఎన్నికల మొరాలిటీ, ప్రచారంలో వాడాల్సిన భాష మొదలగు అంశాలపై ఇంకా చాలా చర్చ జరగాల్సి ఉంది.

ప్రపంచంలో ఓటు ద్వారా ప్రజలు తమ పాలకులను ఎన్నుకోవడం మొదలైన దగ్గరి నుండి సమాజ నైతిక జీవనంలో గణనీయంగా మార్పు వచ్చింది. అంతకుముందు గుంపు నైతికతను మతం బోధించే ప్రయత్నం చేసింది. కానీ ఆ నైతికతకు జవాబుదారీతనం అనేది ఏమీ లేదు. రాజ్య వ్యవస్థలో రాజులు, నియంతలు ప్రజలకు జవాబుదారీగా లేరు. కండ బలం– అంటే నిర్మిత సైన్యబలం, ప్రజల మధ్య కల్పించిన భయ వాతావరణం రాజ్యాలను నడిపించాయి.

భారతదేశంలో మతం–కులం ఒకదానికొకటి అండగా ఉండటం వల్ల, మత వ్యవస్థ ఎన్నడూ ఇక్కడ సోషల్ మొరాలిటీ(సామాజిక నైతికత)ని ప్రజల మధ్య ప్రచారం చెయ్యలేదు. కులాధిపత్యాన్ని, మతాధిపత్యాన్ని తద్వారా కుల మొరాలిటీని ప్రజలమధ్య ప్రచారం చేసి, ఉత్పత్తి శక్తులకు విద్య, మానవ సమానత్వం అందకుండా చాలా జాగ్రత్తగా నీతి రహిత సమాజ నిర్మాణాన్ని దైవ సృష్టి నిర్మాణంగా కొనసాగించారు. ఈ విధమైన నీతి రహిత సమాజ జీవనాన్ని ఎలక్షన్ మొరాలిటీ (ఎన్నికల నైతికత) ద్వారా మార్చవచ్చు అని అంబేడ్కర్ భావించారు. ఆ మార్పునకు మూలం రాజ్యాంగం.

అయితే భారతదేశంలో 1952 నుండి చాలాకాలం కాంగ్రెస్, కమ్యూనిస్టు– సోషలిస్టుల మధ్య ఎన్నికల పోరాటం జరిగింది. కాంగ్రెస్ దేశంలో చాలా సులభంగా ఎన్నికల్లో గెలవడం వల్ల, కమ్యూనిస్టులు అసలు రాజ్యాంగం మీదనే నమ్మకం లేని ఎన్నికల పోరాటంలో ఉన్నందువల్ల ఎన్నికల మొరాలిటీపై అసలు చర్చ జరగలేదు. ఈ దశ అంతా కూడా ఉత్పత్తి కులాల్లో బాగా చదువుకున్న యువకులు ఎక్కువగా లేనందున ఎన్నికల మొరాలిటీపై పత్రికల్లో కూడా చర్చ జరగలేదు. కమ్యూనిస్టులలో సిద్ధాంత పట్టు ఉన్నప్పటికీ, శ్రమ జీవుల పట్ల ప్రేమ ఉన్నప్పటికీ ఎన్నికల ద్వారా రాజకీయ నైతికతనీ, సామాజిక నైతికతనీ సమాజంలో పెంచవచ్చని వారు భావించలేదు.

కాంగ్రెస్‌కు ప్రతిపక్షంగా ఆర్ఎస్ఎస్ పునాదిగా ఎదుగుతూ వచ్చిన జనసంఘ్/బీజేపీ ఎన్నికల వ్యవస్థను మతాధిపత్య రాజకీయంతో ముడెయ్యడం వల్ల దేశంలో కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాల మధ్య ఎన్నికల మొరాలిటీపై చర్చ జరగలేదు. ఈ క్రమంలో విభిన్న రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. జాతీయ స్థాయి ఎన్నికల మొరాలిటీపై చర్చ చేసే అవకాశం వాటికి అంతగా లేదు. కానీ రాష్ట్రాల స్థాయిలో ఉత్పత్తి కులాల నుండి వచ్చిన ప్రాంతీయ పార్టీల నాయకులు ఎదిగాక, ఎన్నికల నైతికతపై కొంత చర్చ మొదలుపెట్టారు. అయితే ఈ ఎన్నికల మొరాలిటీ, ప్రచారంలో వాడాల్సిన భాష మొదలగు అంశాలపై ఇంకా చాలా చర్చ జరగాల్సి ఉంది. ఎన్నికల కమిషన్‌కు కూడా ఎన్నికల్లో ఏ చర్చ నీతివంతమైనది, ఏది కాదు అనే అంశంపై స్పష్టత లేదు.

2024 ఎన్నికల్లో నాయకులు ప్రచార సభలలో వాడిన భాషను



ఒక్కసారి చూద్దాం. చంద్రబాబు నాయుడు ఒక బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి వాడిన 'నీ అమ్మ మొగుడు చేశాడా' లాంటి భాష ఏ ప్రజాస్వామ్య దేశంలో ఉపయోగించినా ఆయన్ని ఎన్నికల నుండి బహిష్కరించడమే కాక, తీవ్రమైన శిక్ష విధించే విలువలు ఉంటాయి. పాకిస్తాన్ వంటి అస్థిరమైన ప్రజాస్వామ్యంలో కూడా ఇటువంటి భాషను బహిరంగంగా వాడటాన్ని ప్రజల విలువలు ఒప్పుకోవు. కానీ ఇండియాలో ఇటువంటి భాష, దీని అనుసంధాన ప్రవర్తన ఎన్నికల రంగంలో మామూలుగా కనిపిస్తుంది.

జగన్ ఇటువంటి భాషను బహిరంగ సభల్లో ఎవరి మీదా వాడటం కనిపించలేదు. అదే చంద్రబాబు 'సైకో', సైకో' అంటూ జగన్‌ను తిట్టగా చూశాం. ఎన్నికల రంగంలో సాధారణంగా జరగాల్సిన నైతిక ప్రచారం... తమ పార్టీ గెలిస్తే ఏం చెయ్యబోతోందో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం. దీన్నే మనం మ్యానిఫెస్టో అంటాం. జగన్ తన పార్టీ బహిరంగ సభల్లో తను గత ఐదేండ్లు చేసిన పనులు, గెలిస్తే చెయ్యబోయే పనులు చెప్తుతూ తిరిగారు. కానీ చంద్రబాబు గానీ, ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో మీటింగుల్లో పాల్గొన్న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గానీ ఆ నైతికతను పాటించలేదు. ఎదుటి నాయకుడిని నిందించే నైతికతను మాత్రమే పాటించారు.

ప్రధానమంత్రిగా మోదీ దేశ స్థాయిలో కూడా తన మ్యానిఫెస్టో గురించి గానీ, తను గత పదేండ్లుగా చేసిన పనుల గురించి గానీ చెప్పలేదు. రాహుల్ గాంధీ మీద 'శహజాదా' (యువరాజు) అనే పదజాలంతో నిరంతరం దాడి చేశారు. అంతకంటే ఘోరంగా ముస్లింలను ఉద్దేశించి 'ఎక్కువమంది పిల్లల్ని కనేవాళ్ళు' అనే పదజాలంతో దాడి చేయడం ఎన్నికల నైతికతకు పూర్తిగా భిన్నమైంది. ఈ దేశంలో ముస్లిమేతరులు, ముఖ్యంగా బీదవారు కూడా చాలామంది పిల్లల్ని కంటారు. ఆయనే స్వయంగా తన తల్లిదండ్రులకు ఆరుగురిలో ఒకరు. ఈ రచయిత తన తల్లిదండ్రులకు ఎనిమిది మంది పిల్లల్లో ఒకడు. ఈ భాష మతం ఎన్నుకొని పుట్టని పిల్లలపై దాడి చేస్తుంది. ఒక దేశ ప్రధానమంత్రి ఇలాంటి భాష వాడినప్పుడు అలా ఎక్కువ సంతానం ఉన్న అన్ని కుటుంబాల్లో, ముఖ్యంగా చిన్న పిల్లల్లో సైతం భయాందోళన మొదలవుతుంది. ఇది అటువంటి పిల్లలను జీవితాంతం భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఎన్నికల నైతికతలో పిల్లల్ని, అమాయకుల్ని భయభ్రాంతుల్ని చేసే భాష అసలుండకూడదు. కానీ దేశ ప్రధానమంత్రే బహిరంగ సభల్లో ఇలా మాట్లాడితే, ఆ భాషకు ఎన్నికల కమిషన్ నుండి కూడా చెక్ లేకపోతే దేశంలో ఎన్నికల వ్యవస్థ కొనసాగడం కష్టం. క్రమంగా ఈ దేశ రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికీ ప్రమాదం ఇటువంటి ధోరణుల నుండే వస్తుంది.

ఈ ఎన్నికల్లో రాజ్యాంగానికీ, రిజర్వేషన్లకూ ప్రమాదమున్నదనే ప్రచారాన్ని కాంగ్రెస్ పెద్ద ఎత్తున చేసింది. రాహుల్ గాంధీ ప్రతి బహిరంగ సభలో రాజ్యాంగాన్ని చూపిస్తూ బీజేపీ తిరిగి గెలిస్తే ప్రమాదముందని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అందుకు విరుగుడు రిజర్వేషన్లను కాపాడటం, పెంచడంలో ఉందని మొదటిసారి కాంగ్రెస్ ప్రచారం చేసింది. నిజంగానే ఆర్ఎస్ఎస్–బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని క్రమంగా రద్దు చేసే అవకాశముందా? ఈ రాజ్యాంగాన్ని 1950లో ఆమోదించినప్పుడు ఆర్ఎస్ఎస్ ఒక పక్క, ఆనాటి కమ్యూనిస్టులు మరో పక్క వ్యతిరేకించారు. ఈ రాజ్యాంగం భారతీయ సంస్కృతిని (అంటే బ్రాహ్మణీయ సంస్కృతిని) ప్రతిబింబించదనీ, అది పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబిస్తుందనీ ఆర్ఎస్ఎస్ స్పష్టంగా చెప్పింది. కమ్యూనిస్టులేమో శ్రామికవర్గ నియంతృత్వ రాజ్యాంగం కావాలి, ఇటువంటి బూర్జువా రాజ్యాంగం వద్దని ప్రకటించారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్– బీజేపీ బయటకు చెప్పేది వారి అసలైన అభిప్రాయం కాదు. 400 పైన స్థానాల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కొంతమంది ఎన్నికలకు ముందు ప్రకటించారు. ఈ రాజ్యాంగ రక్షణకు మోదీ గ్యారెంటీ లాంటి వ్యక్తిగత ప్రకటనలు పనికిరావు. వంద సంవత్సరాల నుండి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఏం చెబుతోంది అనేది లోతుగా చూడాలి.

ఈ మధ్యకాలంలో సనాతన ధర్మాన్ని కాపాడాలని ఆర్ఎస్ఎస్, బీజేపీల్లోని పై కులస్థులతోపాటు ఓబీసీ అయిన మోదీ కూడా చాలా సార్లు మాట్లాడారు. సనాతన ధర్మం అంటే ఇప్పుడు అందరూ అనుకునే హిందూయిజం కాదు. సనాతన ధర్మం ప్రధానంగా వర్ణ ధర్మం (కుల వ్యవస్థ) కలిగివుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీల్లోని బీసీ, ఎస్సీలు... మళ్లీ వర్ణ ధర్మం పాత పద్ధతిలో నెలకొల్పాలంటే ఈ రాజ్యాంగాన్ని రద్దు చెయ్యకుండా సనాతన ధర్మాన్ని తిరిగి స్థాపించడం సాధ్యం కాదు అని అర్థం చేసుకోవాలి. ఆ నిర్మాణాల్లో ఉన్న శూద్రులు, బీసీలు, ఎస్సీలు, ఆదివాసులు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం లోతు చూడకపోతే తాము మునిగి దేశాన్ని కూడా ముంచే అవకాశముంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త పీజీలు



కొత్త ట్రెండ్ మొదలైంది. వాట్సాప్ యూనివర్సిటీల్లో పట్టభద్రులైనవాళ్లలో చాలామంది ఇప్పుడు తమ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను పాడ్‌కాస్ట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి చేస్తున్నారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

సాంకేతిక తరంగాలు



నేను ఇప్పటివరకు సాంకేతిక పరిజ్ఞానంలో మూడు పెద్ద వేవ్స్ చూశాను. వాటి మధ్య విరామం సమంగా ఉండటం గమనార్హం. 1970ల మధ్యలో చిప్స్ రావడం, 1990ల చివర్లో వెబ్ రావడం, 2020ల మొదట్లో ఏఐ (కృత్రిమ మేధ) రావడం.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

నియంత్రణ ఉచితం!



ప్రో–ఛాయిస్ (మహిళల ఎంపిక పట్ల సానుకూలత) అంటే, కుటుంబాన్ని ప్రారంభించాలా, వద్దా? లేదా ఎప్పుడు ప్రారంభించాలి అనే విషయంలో మహిళలకు స్వేచ్ఛ ఉందని నమ్మడం. అందుకే మేము అత్యవసరాలతో సహా అన్ని సంతాన నిరోధకాలను (కాంట్రాసెప్టివ్స్) కెనడాలో ఉచితం చేయబోతున్నాం.

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

అర్థంలేని ఆలోచన



సంతాన నిరోధక సాధనాలను విస్తారంగా అందుబాటులోకి తేవడం అనేది గొప్ప ఆలోచన. కానీ ఉచితంగా కాంట్రాసెప్టివ్స్ అందించడమే 'ప్రో–ఛాయిస్'గా ఉండటానికి గీటురాయి అనుకోవడం అర్థం పర్థం లేని విషయం.

– జొనాథన్ కే, సంపాదకుడు

దశాబ్దాల్లో ఎక్కువ!



ముంబయి కంటే కశ్మీర్‌లో 3 శాతం అధిక పోలింగ్ నమోదైంది. ముంబయిలో సుమారు 56 శాతం నమోదైతే, కశ్మీర్‌లోని బారాముల్లాలో 59 శాతం నమోదు కావడం అనేది దానికదే గొప్ప కథనం. నాలుగు దశాబ్దాల కాలంలో బారాముల్లాలో ఇదే అత్యధిక నమోదు. ఆర్టికల్ 370 రద్దే దీన్ని సాధ్యం చేసింది.

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

ప్రకృతికి దూరం



మనుషులు తమ వ్యవహారాల్లో చాలా బిజీగా ఉండి ప్రకృతితో చాలావరకు సంబంధం కోల్పోయారు. తమ పరిసరాల పట్ల అవగాహనలో జంతువులే మనుషుల కన్నా మెరుగ్గా ఉన్నాయి. ఈ విషయం మనం జాగ్రత్తగా వాటి నుంచి గ్రహించి నేర్చుకోవాలి.

– ఫ్రాంక్ హూగెర్‌బీట్స్, పరిశోధకుడు

సమయపాలన తప్పా?



సమయపాలన అనేది ఇతరుల కాలానికి మనం ఇచ్చే గౌరవానికి సంకేతం అని నమ్మేలా నన్ను పెంచారు. దురదృష్టవశాత్తూ మీరు పంక్చువల్‌గా ఉండే వ్యక్తి అయితే, మీకు ఇంకే పనీ లేదని చాలామంది భావిస్తూ... ఉల్లాసంగా మీ సమయాన్ని ఉపేక్షిస్తుంటారు.

– నిస్తులా హెబ్బర్, జర్నలిస్ట్

నిబంధనల అమలులోనే అసలు చిక్కు!

సందర్భం



దినేశ్ సి. శర్మ

భారతీయ మసాలాలపై హాంకాంగ్ ఈమధ్యే నిషేధం విధించింది. మూడు బ్రాండ్లపై ఈ నిషేధం వేటు పడింది. సింగపూర్‌లోనూ ఇంకో భారతీయ మసాలా కంపెనీపై ఇలాంటి క్రమశిక్షణ చర్యలే తీసుకున్నారు. ఎథిలీన్ ఆక్సైడ్ అనే కేన్సర్ కారక రసాయనం పరిమితికి మించి ఉన్నట్లు తేలడంతో ఆ యా దేశాల నియంత్రణ సంస్థలు ఈ చర్యలకు పాల్పడ్డాయి. మాల్దీవులు చర్యలకు సిద్ధమవుతూండగా... అమెరికా, ఆస్ట్రేలియా ఆహార నియంత్రణ సంస్థలు కూడా మసాలాల్లో కలుషితాలపై నివేదికలను అధ్యయనం చేసే పనిలో ఉన్నాయి.

నిజానికి ఇలాంటి చర్యలు భారతీయ కంపెనీలకు కొత్తేమీ కాదు. అమెరికా చేరుతున్న భారతీయ ఉత్పత్తుల్లో ఏటా కొన్ని వందలు నాణ్యత ప్రమాణాల లేమి కారణంగా తిరస్కరణకు గురవుతూనే ఉంటాయి. ఆయుర్వేద మందులపై కూడా ఎఫ్‌డీఏ తరచూ హెచ్చరికలు జారీ చేస్తూంటుంది. సీసం వంటి ప్రమాదకర భారలోహాలు, పదార్థాలు పరిమితికి మించి ఉంటాయన్నది వీరు తరచూ వ్యక్తం చేసే అభ్యంతరం. చిన్న పిల్లల ఆహారం విషయంలో ఇటీవలే అంతర్జాతీయ కంపెనీ నెస్లే భారత్‌లో మాత్రమే అధిక చక్కెరలు వాడుతున్న విషయం బయటపడ్డ సంగతి తెలిసిందే.

ఇలాంటి ఘటనలు అన్నింటిలోనూ ఒక నిర్దిష్ట క్రమం కనిపిస్తుంది. కంపెనీ భారత్‌ది అయినా, విదేశీయులది అయినా సరే మా తప్పేమీ లేదని ప్రకటిస్తాయి. తయారు చేసిన దేశం లేదా ఎగుమతి చేస్తున్న దేశం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తున్నామని కూడా చెబుతాయి. భారతీయ నియంత్రణ సంస్థలు ఇచ్చే సమాధానం కూడా పద్ధతిగా ఉంటుంది. 'పరిస్థితిని అధ్యయనం చేస్తున్నాం' అనేసి చేతులు దులిపేసుకుంటాయి. విదేశీ సంస్థలు సమాచారం పంచుకోలేదన్న ఆరోపణ కూడా ఉంటుంది.

ఎగుమతి ప్రోత్సాహక వ్యవస్థలు, కంపెనీలు రెండూ తాము బాధితులమని వాదిస్తూంటాయి. భారతీయ ఎగుమతులను మాత్రమే పాశ్చాత్య దేశాలు అడ్డుకుంటున్నాయని వాపోతాయి కూడా. ఈ మొత్తం వ్యవహారంలో నిస్సహాయంగా మిగిలిపోయేదెవరూ అంటే... వినియోగదారుడు మాత్రమే. కొంచెం సద్దుమణిగిన తరువాత అంతా షరా మామూలుగానే నడిచిపోతూంటుంది.

కల్తీ, హానికారక, కాలుష్యాలతో కూడి ఆహార పదార్థాలు విదేశాలను చేరుతున్న విషయంలో అసలు సమస్య ఏమిటన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆహార నియంత్రణ వ్యవస్థ నిబంధనల్లోని లోటుపాట్లు సరి చేసే ప్రయత్నం జరగడం లేదు.

ఇంకో ముఖ్యమైన విషయం పరిశ్రమలను, ఎగుమతులను కాపాడుకోవాలనే నెపంతో ప్రభుత్వాలు చేసే ప్రయత్నాలు. తప్పు చేసినా వాటి ప్రభావం నుంచి తప్పించేందుకు ప్రయత్నించడం. ఈ క్రమంలోనే వీళ్లు ప్రజారోగ్యాన్నీ; వినియోగదారులు, పౌర సమాజ నిపుణుల అభిప్రాయాలనూ తోసిపుచ్చుతూంటారు.

వివాదాల్లో చిక్కుకున్న కంపెనీలు భారత్‌లోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)' నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తున్నట్లు చెప్పుకుని ఎలాగోలా తప్పించుకుంటాయి. నెస్లే విషయంలో ఈమధ్య జరిగింది ఇదే. కాబట్టి... ఆహార రంగంలో ఎగుమతులకు సంబంధించి ప్రమాణాలను స్పష్టంగా నిర్వచించడం చాలా అవసరం. ఎఫ్ఎస్ఎస్ఏఐలో ఆహార ఉత్పత్తుల (పానీయాల నుంచి సముద్ర ఉత్పత్తుల వరకూ) ప్రమాణాలపై సమాచారం ఇచ్చేందుకు, నిర్దేశించేందుకు 26 శాస్త్రీయ కమిటీలు ఉన్నాయి. 2008లో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏర్పాటు జరిగినప్పుడు ఏర్పాటైన ఈ ప్యానెల్స్‌లో భారతీయ, విదేశీ కంపెనీ ప్రతినిధులు ఉన్నారు. ఈ విషయంపై పెద్ద ఎత్తున దుమారం చెలరేగడంతో వీటి పునర్వ్యవస్థీకరణ జరిగినప్పటికీ ఆహార కంపెనీల ప్రతినిధుల పెత్తనమే ఇప్పటికీ కొనసాగుతోంది.



కొన్నేళ్ల తరువాత ఇది కూడా మారింది. ప్రస్తుతం ఈ ప్యానెళ్లలో ఎక్కువగా శాస్త్రవేత్తలు, రిటైర్ అయిన వాళ్లు ఉంటున్నారు. అయినప్పటికీ నిబంధనల రూపకల్పనలో పరిశ్రమల ప్రభావం లేదని కచ్చితంగా చెప్పే పరిస్థితి లేదు. ప్రస్తుతమున్న ప్యానెళ్ల కూర్పును మచ్చుకు తరచి చూస్తే చాలామందికి ఇప్పుడు, లేదంటే గతంలో... పరిశ్రమలతో ఏదో ఒక లింకు కచ్చితంగా కనిపిస్తుంది.

ఎఫ్ఎస్ఎస్ఏఐ ముందు ఈ ప్యానెళ్ల సభ్యుల పూర్వాపరాలను కచ్చితంగా బహిరంగపరచాలి. దీనివల్ల వినియోగదారుడికి తాను తినే ఆహారానికి సంబంధించి ఎవరు రూల్స్ తయారు చేస్తున్నారో స్పష్టంగా తెలుస్తుంది. అలాగే సీఐఐ, హిందుస్థాన్ లీవర్ వంటి సంస్థలతో ఎఫ్ఎస్ఎస్ఏఐ భాగస్వామ్యం వంటి ఏర్పాటు పలు సమస్యలకు దారి తీస్తున్న విషయాన్ని గుర్తించాలి. నిష్పాక్షిక, పారదర్శక సంస్థగా ప్రజల మద్దతు పొందే ప్రయత్నం చేయడం అవసరం, మేలు కూడా.

చాలా ఏళ్ల వినియోగదారు సమూహాలు, ఆరోగ్య నిపుణులు ఉప్పు, చక్కెర, కొవ్వులు అధికంగా ఉన్న ఆహార పదార్థాలపై ప్రత్యేకమైన లేబుల్ ఒకటి వేయాలని కోరుతున్నాయి. అయితే ఫుడ్ సేఫ్టీ అథారిటీ, పరిశ్రమ వర్గాలు రెండూ దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇంకోవైపు ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిశ్రమలు చేసే డిమాండ్లను నెరవేర్చడంలో చాలా చురుకుగానే ఉంటోంది. విటమిన్లు ఇతర పోషకాలను చేర్చిన ఆహారానికి ప్రత్యేకమైన లేబుల్ ఉండాలన్న పరిశ్రమ డిమాండ్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆగమేఘాలపై ఒప్పేసుకోవడం ఒక ఉదాహరణ.

ఆహార పదార్థాల విషయంలో నియంత్రణ అధ్వాన్నంగా ఉంటే... పరిశ్రమ వర్గాల నిబంధనల పాలన కూడా అంతే తక్కువ అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) స్వయంగా గుర్తించిన విషయాన్ని ఇక్కడ మనం గుర్తు చేసుకోవాలి. కాగ్ 2017 లోనే ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలను నిర్దేశించేందుకు సమయ బద్ధమైన ప్రణాళిక ఏదీ పాటించడం లేదని విమర్శించింది. అసంపూర్తిగా ఉన్న సమాచారం ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ కంపెనీలకు లైసెన్సులు ఇచ్చింది, ఆహార పదార్థాలను పరిశీలించే ల్యాబొరేటరీలు 72లో 56 ల్యాబ్స్‌కు తగిన అక్రిడిషన్ సర్టిఫికెట్లు కూడా లేనవి ఎత్తి చూపింది. పార్లమెంటరీ కమిటీ ఒకటి కూడా ఆహార పదార్థాలకు సంబంధించిన నియమ నిబంధనల రూపకల్పన విషయంలో మరింత పారదర్శకత తీసుకు రావాల్సిన అవసరాన్ని తన నివేదిక రూపంలో స్పష్టం చేసిన విషయం గమనార్హం. ఆహార పదార్థాల విషయంలో కొంత జాగరూకతతో వ్యవహరించాలన్నది ఇప్పటికైనా గుర్తిస్తే అది ప్రజారోగ్యానికి మంచి చేయగలదని అర్థం చేసుకోవాలి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ముఖ దోషం

జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పనికొచ్చే ఎన్నో సాధనాలను భగవంతుడు మనిషి స్వాధీనంలో ఉంచాడు. కానీ దురదృష్టవశాత్తూ మనుషులు ఆ సాధనాలను వాడవలిసినంత విరివిగా, తెలివిగా వాడుతున్నట్టు కనిపించదు!

అలాంటి సాధనాలలో మౌనం ఒకటి. మనిషిని తగులుకొని వేధించే సమస్యలలో ఎన్నింటినో నిర్మూలించగల దివ్యౌషధం మౌనం. అంతేకాదు, చాలా సమయాలలో అసలు సమస్యలు తలెత్తకుండానే నిరోధించగల 'వాక్సిన్' కూడా!

ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించిన వాళ్ళూ, సాధించగోరే వాళ్ళూ ఎక్కువగా మౌనాన్ని అవలంబిస్తూ ఉండడం మన దేశంలో అనాదిగా కనిపిస్తూ వస్తున్నదే. అలాంటి మహనీయులను మన సంప్రదాయం మార్గ దర్శకులు గానూ, గురువులు గానూ గుర్తించి గౌరవిస్తుంది.



జ్యోతిర్మయం

సార్వజనీన జీవితంలో, నాయకులకు మౌనం మహత్తరమైన గౌరవాన్ని ఆపాదించి పెడుతుందని అప్పుడెప్పుడో గాంధీగారు ఆచరణ పూర్వకంగా చూపారు. ఎన్నో రాజకీయ సమస్యల పరిష్కారానికి మౌనం రామబాణంలా పనిచేస్తుందని, నిన్న మొన్న మన పీవీ నరసింహారావుగారూ నిష్కర్షగా నిరూపణ చేశారు.

ఇందుకు విరుద్ధంగా, నిరర్థకమైన వాగ్వివాదాల వల్ల నిక్షేపంలా ఉన్న సంబంధాలలో తూట్లు పొడుచుకునే తొందరపాటు కూడా విశ్వవ్యాప్తంగా కనిపించే వ్యవహారమే. నోటిని అదుపులో ఉంచుకోలేకపోవడమనే 'ముఖ దోషం' వల్ల శుక, శారికలు (చిలుకలూ, గోరింకలు) పంజరంలో ఎలా చిక్కుకుంటాయో గమనించమంటాడు ఒక పూర్వ కవి. **ఆత్మనః ముఖ దోషేన బధ్యంతే శుక శారికాః!** పలుకు లేని చిలుకను పంజరంలో ఎవరు ఉంచుతారు? చిలకా గోరింకల లాంటి యువ దంపతులు కూడా మౌనపు గోటిమీటుతో పోయే సంఘర్షణలకు, మాటల గొడ్డళ్ళను ఒకరి మీద ఒకరు దూసుకుని, పండంటి కాపురాలను పాడు చేసుకోవడం ఆధునిక సమాజంలో అరుదు కాదు. వాక్కు అనే కత్తిని, మౌనం అనే ఒరలో ఎంత ఎక్కువసేపు ఉంచితే అంత క్షేమం.

– ఎం. మారుతి శాస్త్రి



లక్ష పుష్పార్చన పూజ నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

శ్రీకృష్ణాలంకార, శ్రీరామావతార సేవలో ఊరేగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం నిత్య హవనములు, మూలమంత్ర జపములు, లక్ష్మీ సూక్త, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణములు చేపట్టారు. ఆలయంలో అభిషేకములు, నవకలశస్నపనం, శ్రీస్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీస్వామిని కాళీయమర్దన, శ్రీకృష్ణా అలంకార సేవలో ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం నిత్య హవనములు, సామూహిక పారాయణాలు, నృసింహ మూలమంత్ర హవనం నిర్వహించి అనంతరం హనుమంత వాహనంపై శ్రీరామావతారం అలంకార సేవలో శ్రీస్వామిని ఊరేగించారు. వేడుకల్లో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ మాఢవీధిలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నేటి నుంచి జూడాల సమ్మె

- అన్ని బోధనాసుపత్రుల్లో చేయాలని నిర్ణయం
- హామీలు పరిష్కరించకపోవడం వల్లేనని స్పష్టీకరణ
- డీఎంఈకి సమ్మె నోటీసు ఇచ్చిన జూడా నేతలు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ డాక్టర్లు బుధవారం నుంచి సమ్మె చేయాలని నిర్ణయించారు. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో సేవలను స్తంభింపచేయాలని నిర్ణయించినట్లు జూడాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సాయి శ్రీ హర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐజాక్ న్యూటన్, చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు వారు డీఎంఈకి సమ్మె నోటీసులు అందజేశారు. తమకు ఇచ్చిన హామీలు పరిష్కరిస్తామని నాలుగు నెలల క్రితం చెప్పిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇప్పటివరకు స్పందించకపోవడంతో సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని వారు తెలిపారు. స్టైపెండ్ సమయానికి విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య విద్యార్థులకు ఏపీలో కూడా మెడికల్ కాలేజీల్లో 15% రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కొత్త హాస్టల్ నిర్మాణాలు ప్రారంభం కాకపోవడం వల్ల పోస్ట్ గ్రాడ్యుయేట్‌లకు వసతి కొరత ఏర్పడుతుందని వివరించారు.

బ్యారేజీలకు మరమ్మతులపై కమిటీ

ఈఎన్‌సీ(జనరల్) నేతృత్వంలో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు వానాకాలం ప్రారంభానికి ముందే నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతులు, తదుపరి జరపాల్సిన పరీక్షలను సిఫారసు చేస్తూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమర్పించిన మధ్యంతర నివేదిక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్, సభ్యులుగా ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు, సీడీఓ చీఫ్ ఇంజనీర్, సభ్యులు/కన్వీనర్‌గా రామగుండం చీఫ్ ఇంజనీర్ వ్యవహరించనున్నారు. మరెవరైనా నిపుణులను కమిటీలోకి ఆహ్వానించేందుకు చైర్మన్‌కు ప్రభుత్వం అధికారమిచ్చింది. ఈ మేరకు కమిటీ ఏర్పాటు చేస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నారం బ్యారేజీలో మరమ్మతులు ప్రారంభం



కాళేశ్వరం (జయశంకర్ భూపాలపల్లి జిల్లా): మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీలో సీసీ బ్లాక్ మరమ్మతు పనులను మంగళవారం ప్రారంభించారు. బ్యారేజీ పనులను ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ సంస్థ చేపట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతోపాటు ఎన్డీఎస్ఏ సూచనలతో పనులను ప్రారంభించారు. గతేడాది అన్నారం బ్యారేజీలో బుంగలు ఏర్పడగా అత్యాధునిక టెక్నాలజీతోపాటు కెమికల్‌తో మరమ్మతులు చేశారు. వచ్చే వర్షాకాలం సీజన్ కోసం వరద తట్టుకునేందుకు సీసీ బ్లాక్‌లను నిర్మిస్తున్నారు.

మాటలతో మూటలు

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగించే ప్లేట్లు, రంగులు తదితరాలను కంపెనీల నుంచి ఖరీదు చేసి, ప్రింటింగ్ ప్రెస్ వారికి విక్రయించడం ఈ సంస్థ ప్రధాన వ్యాపారం. ఇంజినీరింగ్ పూర్తి చేసిన శ్రీహర్ష తన తండ్రి నిర్వహిస్తున్న శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్‌లోనే చేరారు. కొన్నాళ్లుగా ఈ సంస్థ వ్యాపారం తగ్గడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మెటీరియల్ సరఫరా చేసే కంపెనీల నుంచి దాదాపు రూ.6 కోట్ల మేర క్రెడిట్ తీసుకోవడంతోపాటు ఆయా కంపెనీల్లో పనిచేసే వారి వద్ద నుంచి వడ్డీకి భారీగా అప్పులు కూడా తీసుకున్నారు. ఈ సంస్థ ఏటా దాదాపు రూ.6 కోట్ల టర్నోవర్ చేస్తుండటంతో తమ నగదు ఎక్కడికీ పోదనే ఉద్దేశంతో పలువురు అప్పులు ఇచ్చారు.

వాణీబాల సలహాతోనే ఫైనాన్స్ సంస్థగా...

తన భర్త, కుమారుడు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల్ని చూసిన వాణీబాల తనకున్న పరిచయాలు, ఉద్యోగాన్ని అడ్డు పెట్టుకొని భారీ స్కామ్‌కు ప్లాన్ చేసింది. ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్‌ను ఫైనాన్స్ సంస్థలా మార్చేలా చేసింది. తొలినాళ్లలో తన సహోద్యోగులతో పాటు వారి బంధువుల నుంచి డిపాజిట్లు తీసుకుంది. వీరికి సాలీనా 18 నుంచి 24 శాతం చొప్పున వడ్డీ చెల్లించింది. దీంతో వారికి వాణీబాలపై నమ్మకం ఏర్పడి సహకరించడం ప్రారంభించారు. టెస్కాబ్‌లో డబ్బు డిపాజిట్ చేయడానికి వచ్చే వారితో వాణీబాల మాటలు కలిపేది. వారితో నమ్మకంగా మాట్లాడుతూ కష్టసుఖాలు తెలుసుకునేది. ఆపై తమకున్న ఫైనాన్స్ కంపెనీ విషయం చెప్పి..బ్యాంక్‌లో అయితే కేవలం 6 నుంచి 7 శాతం మాత్రమే వడ్డీ వస్తుందని చెప్పేది. ఆ మొత్తం ఈ రోజుల్లో ఏ ఖర్చులకూ సరిపోదని, తన భర్త, కుమారుడు నిర్వహిస్తున్న ప్రియాంక సంస్థలో డిపాజిట్ చేయాలని సూచించేది. తాము క్రమం తప్పకుండా 20 నుంచి 24 శాతం వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికింది. ఈ మాటలు నమ్మిన అనేక మంది పదవీవిరమణ చేసిన వారు తమ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను ప్రియాంక సంస్థలో పెట్టుబడులుగా పెట్టారు.

బ్యాంకు సిబ్బందినీ వినియోగించుకుంది

జనరల్ మేనేజర్ హోదాలో ఉన్న నిమ్మగడ్డ వాణీబాల తన భర్తకు చెందిన సంస్థలోకి టెస్కాబ్‌కు రావాల్సిన డిపాజిట్లను మళ్లించింది. దీని కోసం ఆ బ్యాంకులో పనిచేసే కొందరు ఉద్యోగుల సహకారం కూడా తీసుకున్నట్టు తెలిసింది. డిపాజిట్ల వ్యవహారాలు పర్యవేక్షించే వారికి కమీషన్ల ఆశ చూపి, వినియోగదారులు ప్రియాంక సంస్థలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించింది. ఇలా టెస్కాబ్‌కు రావాల్సిన డిపాజిట్లు ప్రైవేట్ సంస్థకు తరలి వెళ్లిపోతున్నా ఉన్నతాధికారులు గుర్తించలేకపోయారు. ఎట్టకేలకు సీసీఎస్‌లో కేసు నమోదైన తర్వాత వాణీబాలను సస్పెండ్ చేసి, విచారణ చేస్తున్నట్టు ప్రకటించారు. తమను సంప్రదించిన బాధితులతో ఆమెకు, బ్యాంకుకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారని తెలిసింది. మేక నేతాజీ, శ్రీహర్షలు తమ వద్ద పెట్టుబడులు పెట్టిన డిపాజిట్‌దారులకు ఇవ్వడానికి ప్రత్యేకంగా శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో తయారు చేయించారు. దీనిపై వివరాలు రాసి, రూ.1 విలువైన రెవెన్యూ స్టాంప్ అతికించి, సంతకాలు చేసి ఇచ్చారు. కరోనా తర్వాత కాస్త ఒడుదొడుకులు ఎదురైనా, గతేడాది నవంబరు, డిసెంబర్ నుంచి వడ్డీలు చెల్లింపులు దాదాపు పూర్తిగా ఆగిపోయాయి. ఈ నెల 3న ప్రియాంక సంస్థ నిర్వాహకులు సిటీ సివిల్ కోర్టులు దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి ఆ మరుసటి రోజు నుంచి వాణీబాల, నేతాజీ, శ్రీహర్ష అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.



మేక శ్రీహర్ష



నేతాజీ, వాణీబాల దంపతులు

3 రాష్ట్రాల్లో వ్యాపారాలంటూ బ్రోచర్లు

డిపాజిట్‌దారులకు ఇవ్వడానికి శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ ఎస్పీ లోగోతో బ్రోచర్లు ముద్రించింది. వాటిలో తమకు ఎస్పీ గ్రాఫిక్ సిస్టమ్స్, శ్రీ ప్రియాంక డిజిటల్స్, శ్రీ ప్రియాంక గ్రాఫిక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు కూడా ఉన్నట్టు పేర్కొంది. హైదరాబాద్‌లోని తిలక్‌రోడ్‌తో పాటు జీడిమెట్ల, బెంగళూరులోని రాజాజీనగర్, విజయవాడలోని గాంధీనగర్‌ల్లో వీటి బ్రాంచ్‌లు ఉన్నట్టు పేర్కొన్నారు. తమ వార్షిక టర్నోవర్ దాదాపు రూ.60 కోట్లు ఉన్నట్టు వాటిలో స్పష్టం చేసింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. మంగళవారం మరి కొందరు బాధితులు సీసీఎస్‌కు రాగా వారి నుంచి వాంగ్మూలాలు నమోదు చేశారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్న అధికారులు వీరితోపాటు సంబంధీకులు, ఆయా సంస్థల పేరుతో ఉన్న ఆస్తుల వివరాలు తెలుసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. దీనికోసం రెండు రాష్ట్రాల్లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్‌లకు లేఖలు రాస్తున్నారు. సిటీ సివిల్ కోర్టులో నిందితులు దాఖలు చేసిన ఇన్సాల్వెన్సీ పిటిషన్‌పై జూలై మూడోవారంలో హియరింగ్ జరగనుంది. ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారిలో వృద్ధులు, పదవీ విరమణ చేసిన వారే ఎక్కువగా ఉన్నారని తెలిసింది.

ఉద్యోగ జీవితంలో సంపాదించింది మొత్తం పెట్టేశా

మా బంధువు ఒకరు టెస్కాబ్ బ్యాంకులో పనిచేస్తున్నారు. ఆయనతోపాటు మరికొందరు దాదాపు రూ.60 లక్షల వరకు ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్‌లో పెట్టుబడి పెట్టారు. వారి ద్వారానే వాణీబాల నాకు పరిచయమైంది. మరో నెల రోజుల్లో పదవీ విరమణ చేయాల్సిన నేను నా ఉద్యోగ జీవితంలో సంపాదించిన రూ.20 లక్షలు వారి వద్ద పెట్టుబడిగా పెట్టాను. సైదాబాద్ మనోహర్‌కాలనీలోని వాణీబాల ఇంటికి తాళం వేసి ఉండగా.. బ్యాంకు అధికారులు అక్కడే ఆమె సస్పెన్షన్ నోటీసు అంటించారు. సీసీఎస్ పోలీసులు మాకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం.

– ఎం.శ్రీనివాసమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్, కోటి గవర్నమెంట్ ఆస్పత్రి

వైద్య,ఆరోగ్య శాఖ సూపరింటెండెంట్ సస్పెన్షన్

పీహెచ్‌సీలలో పనిచేసే మహిళా వైద్య అధికారులపై వెలుగులోకి వచ్చిన లైంగిక వేధింపులు

కామారెడ్డి టౌన్ (కామారెడ్డి జిల్లా): కామారెడ్డి వైద్య,ఆరోగ్యశాఖలోని పీహెచ్‌సీలలో విధులు నిర్వహించే మహిళా వైద్య అధికారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేపథ్యంలో సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు ప్రజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీహెచ్‌సీలలో విధులు నిర్వహించే మహిళా వైద్య అధికారులపై లైంగిక వేధింపుల నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌పై ఇటీవల పలు సెక్షన్ల కింద పోలీసు కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు కామారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ చంద్రశేఖర్ బాధ్యతలను స్వీకరించారు. లైంగిక వేధింపులకు గురైన జిల్లాలోని మహిళా వైద్యులు రెండు రోజుల క్రితం మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో డీఎంహెచ్‌వోపై కూడా వేటు పడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

సిరిసిల్లలో ఇసుక ట్రాక్టర్ల బీభత్సం

- ఓ వాహనం ఢీకొట్టడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు



సిరిసిల్ల సాయినగర్‌లో ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టగా నేలకొరిగిన విద్యుత్ లైన్

సిరిసిల్ల టౌన్: అతివేగంతో వచ్చిన ఇసుక ట్రాక్టర్లు సిరిసిల్లలో మంగళవారం బీభత్సం సృష్టించాయి. జిల్లా కేంద్రంలోని సాయినగర్ ఇసుక రీచ్ నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఒకేసారి రోడ్డుమీదకు రాగా.. ఓ ట్రాక్టర్ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వరుసగా ఉన్న నాలుగు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు వేలాడాయి. దీంతో ఆ ప్రాంతంలో దాదాపు పది గంటలపాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌పైన ఉన్న కూలీలు వెంటనే కిందకి దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు. స్తంభాలు విరిగిపోవడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌లైన్ పునరుద్ధరణకు ఇసుక ట్రాక్టర్ యజమానులు రూ.63 వేలు చెల్లించినట్లు సెస్ ఎండీ సురేందర్‌రావు తెలిపారు.

కాసుల కోసం కన్నతల్లిని కడతేర్చాడు

- భూమి డబ్బుల కోసం ఘాతుకం • మారేపల్లిలో ఉదంతం



ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొండాపూర్ (సంగారెడ్డి): భూమిని అమ్మగా వచ్చిన డబ్బుల కోసం ఓ కొడుకు కన్నతల్లినే కడతేర్చాడు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారేపల్లిలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంజాయి రత్నమ్మ (75)కు నలుగురు సంతానం. 20 ఏళ్ల క్రితం కూతురు, కుమారుడు చనిపోయాడు. మరో కూతురు, కుమారుడు ఉన్నారు. ఎనిమిది నెలల క్రితం తన పేరు మీద ఉన్న 20 గుంటల భూమిని అమ్మగా రూ. 32 లక్షలు వచ్చాయి. అందులో చనిపోయిన కుమారుడికి కూడా రత్నమ్మ వాటా వేసి సొమ్మంతా కూతురికి ఇచ్చేసింది. చనిపోయిన సోదరుడికి వాటా వేయడం ఏమిటి అని కొడుకు సామేలు రోజూ తల్లిని వేధింపులకు గురి చేసేవాడు. సోమవారం రాత్రి కూడా గొడవ పడి డబ్బులు కావాలని ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో తల్లిని ఇష్టం వచ్చినట్లుగా కొట్టడంతో కుడి దవడ కింది భాగంలో బలమైన గాయమై అక్కడికక్కడే రత్నమ్మ మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

అతి తక్కువ కాలంలోనే రేవంత్ అక్రమార్జన

- సీఎం కాగానే మామూళ్ల వసూళ్లు
- బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపణ



హనుమకొండ: అతి తక్కువ కాలంలో చట్టవిరుద్ధంగా అత్యంత ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించిన సీఎంగా రేవంత్ రెడ్డికి పేరు వచ్చిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. మంగళవారం హనుమకొండ, వరంగల్‌లో జరిగిన నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో ఈటల మాట్లాడుతూ సీఎం రేవంత్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో బిల్డింగ్ కట్టుకోవాలంటే చదరపు అడుగుకు రూ.75వేల లంచం ఇవ్వాలని డిసైడ్ చేసినట్టు ప్రచారం జరుగుతోందని నిందించారు. రేవంత్ సీఎం కాగానే మామూళ్ల వసూళ్లు మళ్లీ వచ్చాయని విమర్శించారు. ఏకంగా పీఎం మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలే డబుల్ ఆర్ టాక్స్ రేవంత్ వసూలు చేస్తున్నారని ఇక్కడకు వచ్చి చెప్పి పోయారంటే.. ఏం జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. నరేంద్ర మోదీని పెద్దన్న అని పొగిడిన మూడు రోజులకే హంతకుడని మాట్లాడిన రేవంత్ రెడ్డిది నాలుకనా.. తాటిమట్టనా అని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు నెలకి రూ.4వేల భృతి ఇస్తామని ప్రియాంకా గాంధీతో చెప్పించి ఆరునెలలైనా ఆ ఊసే లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అధికార పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వానికి వంత పాడుతారే తప్ప.. ప్రశ్నించలేరని, పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే బీజేపీ బలపరిచిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఈటల కోరారు.

రేవంత్‌కు ఈటల బహిరంగ క్షమాపణలు చెప్పాలి : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత ఈటల రాజేందర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. నిర్మాణ రంగంలో బీజేపీ నేతలే ఎక్కువగా ఉన్నారని, తాము చదరపు అడుగుకు పైసలు తీసుకుంటున్నామో లేదో వారిని అడగాలని సూచించారు. తాము ఎవరి దగ్గరైనా డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని సత్యం సవాలు విసిరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు ఓట్లు పడతాయనే కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని విమర్శించారు.

దేశానికి రాజీవ్ సేవలు చిరస్మరణీయం

- 33వ వర్ధంతి నాడు ఘన నివాళులు • గాంధీభవన్, ప్రజాభవన్, అమెరికాలో కార్యక్రమాలు



రాజీవ్ విగ్రహం వద్ద సీఎం రేవంత్, దీపాదాస్‌మున్షి, భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీనియర్ నేతలు ఎం.కోదండరెడ్డి, కుమార్‌రావు, జి. నిరంజన్, ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధి కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఇక, సీఎం రేవంత్‌రెడ్డి సోమాజిగూడలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి, మున్షీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాతబస్తీలోని చార్మినార్ వద్ద టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ నేతృత్వంలో పండ్లు పంపిణీ చేశారు.

న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్ వద్ద



అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్ వద్ద రాజీవ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తన కుటుంబ సభ్యులు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నేతలతో కలిసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.

ఆ తప్పులు కాంగ్రెస్ చేయొద్దు

- ఓటమి భయంతోనే బీజేపీ దాడులు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నియంతృత్వ పోకడలు, ఆ పార్టీ చేసిన పాపాల వల్లనే తెలంగాణలో బీజేపీ పెరిగిందని, ఇప్పుడు అవే తప్పులు కాంగ్రెస్ చేయవద్దని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు పోకుండా అందరినీ కలుపుకొని ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్ళాలని సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం, నిరాశ, నిస్పృహలతోనే బీజేపీ నాయకులు ప్రతిపక్ష నాయకులపై దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ఆప్‌లోని మహిళలను బెదిరించి వారి నేతలపైనే కేసులు పెట్టించే నీచమైన స్థాయికి బీజేపీ దిగజారిందని విమర్శించారు. కేజ్రీవాల్‌ను చంపేస్తామంటూ రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మెట్రోరైళ్లల్లో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు రాతలు రాయిస్తూ మానసికంగా బెదిరింపులకు గురిచేస్తున్నారని నారాయణ ఆరోపించారు. సీపీఐ నాయకులు పశ్య పద్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులు పండిస్తున్న అన్ని రకాల వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయించడం అన్యాయమన్నారు.

వడ్లు కొనండి మేడం

అదనపు కలెక్టర్ కాళ్లపై పడి రైతు వేడుకోలు



అడిషనల్ కలెక్టర్ కాళ్లపై పడిన రైతు వని సంగమేశ్వర్

వట్‌పల్లి(అందోల్): అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతోందని, వెంటనే కొనుగోళ్లు చేయాలని వేడుకుంటూ సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కన్సాన్‌పల్లికి చెందిన రైతు వని సంగమేశ్వర్ జిల్లా అదనపు కలెక్టర్ మాధురి కాళ్లపై పడి బోరుమని విలపించారు. కన్సాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించగా, రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. లారీలు రాక కొనుగోళ్లు వేగంగా జరగడం లేదనీ, టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని అదనపు కలెక్టర్ పరిశీలిస్తున్న సమయంలో రైతు సంగమేశ్వర్ ఒక్కసారిగా ఉద్వేగానికి గురై ఆమె కాళ్లపై పడి బోరున కన్నీరు పెట్టుకున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

మరమగ్గాలు, చేనేత ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నాం: మంత్రి తుమ్మల

సాక్షి,హైదరాబాద్: మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునీకరణ కు ప్రభుత్వం అన్ని చ ర్యలు తీసుకుంటోందని, వీటి కోసం బీసీ సంక్షేమశాఖ నుంచి రూ.400 కోట్లు వినియోగించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని మంత్రి నాగేశ్వరరావు తెలిపారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పరిధిలోని 23 ఎకరాల్లో ఏర్పా టు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లొమా,డిగ్రీలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శానిటరీ నాప్‌కిన్ల ఉత్పత్తి పరిశ్రమను పోచంపల్లిలో నెలకొల్పేందుకు సీఎం సానుకూలం ఉన్నారన్నారు.

దేవాలయ భూములపై పకడ్బందీగా ఉండాలి

అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఆక్రమణకు గురైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకునేందుకు న్యాయపరంగా పకడ్బందీగా వ్యవహరించాలని, మంచి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోవాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జియోట్యాగింగ్ పూర్తి చేసిన 15 వేల ఎకరాలు పోను, మిగతావాటిని కూడా ట్యాగ్ చేయాలని పేర్కొన్నారు. మంగళవారం ఆమె దేవాదాయశాఖ అధికారులతో సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. ధరణి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల్లో దేవాలయ భూముల వివరాలు వేర్వేరుగా ఉండటాన్ని ప్రశ్నించారు. అన్ని భూముల వివరాలు ధరణిలో నమోదు కావాల్సిందేనని, వాటికి దేవాలయాల పేరు మీద పాస్ పుస్తకాలు రావాల్సిందేనని ఆదేశించారు. ఆషాఢమాసం బోనాలకు ముందుగానే మౌలిక వసతులు కల్పించాలని, నదీతీరాల్లోని ఆలయాల్లో జలహారతి, శంఖనాదంలాంటి చేపట్టి ఆధ్యాత్మిక శోభ పెంచాలన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, బ్రాహ్మణ పరిషత్ అడ్మినిస్ట్రేటర్ నరసింహమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతోనే మానవాళికి మనుగడ

భూమిపై జీవ వైవిధ్యంతోనే మానవాళికి మనుగడ ఉంటుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం (మే 22) సందర్భంగా మంత్రి ఒక ప్రకటనలో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. జీవవైవిధ్యం సృష్టి లక్షణమని, ఈ భూమి కేవలం మనిషికి మాత్రమే సొంతం కాదన్నారు. సమస్త జీవరాశులకు ఈ భూమిపై హక్కులున్నాయని తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణను నైతిక బాధ్యతగా చేపట్టాలని ప్రజలు, ప్రకృతి ప్రేమికులకు మంత్రి సురేఖ పిలుపునిచ్చారు.



అలహాబాద్ టు అంబేడ్కర్‌నగర్...

యూపీలో రసవత్తర పోరు!

14 లోక్‌సభ స్థానాలకు 25న పోలింగ్

ఉత్తరప్రదేశ్ సుదీర్ఘ ఎన్నికల షెడ్యూల్‌లో ఇప్పటిదాకా ఐదు విడతలకు 53 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల జాతకాలు ఈవీఎంలలోకి చేరిపోయాయి. ఆరో విడతలో 14 స్థానాలకు ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. వీటిలో 9 బీజేపీ సిట్టింగ్ స్థానాలు కాగా బీఎస్పీ 4, ఒకటి ఎస్పీ ఖాతాలో ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎస్పీ–కాంగ్రెస్, బీజేపీ నడుమ హోరాహోరీ సాగుతోంది. బీఎస్పీ ఒంటరి పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆరో విడతలో కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

అలహాబాద్...
త్రివేణి సంగమంలో హోరాహోరీ

ఒకప్పుడు లాల్ బహదూర్ శాస్త్రి, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ వంటి ఉద్దండులైన ప్రధానులను దేశానికి అందించిన కాంగ్రెస్ కంచుకోట ఈ స్థానం. కానీ దాదాపు 4 దశాబ్దాలుగా పార్టీ ఇక్కడ గెలుపు ముఖం చూడలేదు. చివరిగా 1984లో బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ కాంగ్రెస్ నుంచి అలహాబాద్‌లో గెలుపొందారు. తర్వాత బీజేపీ అగ్రనేత మురళీ మనోహర్ జోషీ ఇక్కడ హ్యాట్రిక్ కొట్టారు. అనంతరం రెండుసార్లు సమాజ్‌వాదీ గెలిచినా తిరిగి కమలనాథులు పట్టుబిగించారు. 2016లో బీజేపీ గూటికి చేరిన యూపీసీసీ మాజీ చీఫ్ రీటా బహుగుణ జోషి గత ఎన్నికల్లో గెలిచారు. ఈసారి బీజేపీ ఆమెను పక్కనపెట్టి మాజీ గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠి కుమారుడు నీరజ్ త్రిపాఠికి టికెటిచ్చింది. ఇండియా కూటమి తరఫున ఎస్పీ సీనియర్ నేత కున్వర్ రియోతీ రమణ్ సింగ్ కుమారుడు ఉజ్వల్ రమణ్ సింగ్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఇక్కడ పూర్వ వైభవం కోసం ఎస్పీ దన్నుతో కాంగ్రెస్ తీవ్రంగా చెమటోడుస్తుండటంతో పోటీ రసవత్తరంగా మారింది.



ఉజ్వల్ రమణ్ సింగ్

సుల్తాన్‌పూర్... త్రిముఖ పోరు

గోమతి నది తీరంలో కొలువుదీరిన ఈ నియోజకవర్గం కూడా ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటే. తర్వాత కమలనాథులు పాగా వేశారు. బీజేపీ నుంచి 2014లో వరుణ్ గాంధీ గెలిచారు. 2019లో వరుణ్ పిలిభిత్‌కు మారగా ఇక్కడ ఆయన తల్లి మేనకా గాంధీ పోటీ చేశారు. కానీ బీఎస్పీ అభ్యర్థి చంద్రభద్ర సింగ్ ఆమెను ఓడించినంత పని చేశారు. కేవలం 14,500 ఓట్లతో మేనక గట్టెక్కారు. ఈసారి కూడా బీజేపీ నుంచి మేనకే రేసులో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున ఎస్పీ అభ్యర్థి రామ్ భువల్ నిషాద్ బరిలో ఉన్నారు. ఇక బీఎస్పీ బలమైన ఓటు బ్యాంకున్న ఉద్రజ్ వర్మకు టికెటిచ్చింది. బీఎస్పీ ఇక్కడ 1999, 2004ల్లో విజయం సాధించింది. బీజేపీ, ఎస్పీ, బీఎస్పీ మధ్య త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది.

అంబేడ్కర్‌నగర్...
బీఎస్పీకి ప్రతిష్టాత్మకం!

సోషలిస్ట్ దిగ్గజం రామ్ మనోహర్ లోహియా జన్మస్థలమిది. 2004 దాకా అక్బర్‌పూర్‌గా ఉండేది. బీఎస్పీ కంచుకోట అయిన ఈ స్థానం నుంచి పార్టీ చీఫ్ మాయవతి మూడుసార్లు గెలిచారు. 2008లో పునర్విభజన తర్వాత అంబేడ్కర్‌నగర్‌గా మారింది. గత ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి రితేశ్ పాండే గెలిచారు. ఇక్కడ దళిత, కుర్మి, బ్రాహ్మణ, ముస్లిం ఓటర్లు కీలకం. బీఎస్పీ సిట్టింగ్ ఎంపీ రితేశ్ పాండే ఈసారి బీజేపీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. దాంతో బీఎస్పీ కవార్ హయత్ అన్సారీకి టికెటిచ్చింది. ఎస్పీ నుంచి లాల్జీ వర్మ బరిలో ఉన్నారు. త్రిముఖ పోరులో బీఎస్పీ ఎలా నెగ్గుకొస్తుందో చూడాలి.

ప్రతాప్‌గఢ్.. కుర్మి, బ్రాహ్మణ ఓట్లు కీలకం

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంగమ్ లాల్ గుప్తా, ఇండియా కూటమి నుంచి ఎస్పీ అభ్యర్థి ఎస్.పి.సింగ్ పటేల్ బరిలో ఉన్నారు. ఇక్కడ కుర్మి, బ్రాహ్మణ ఓట్లది కీలక పాత్ర. కుర్మి ఓటర్లు 11%, బ్రాహ్మణ ఓటర్లు 16 శాతం ఉంటారు. వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యే అయిన మాజీ మంత్రి రఘురాజ్ ప్రతాప్ సింగ్ (రాజా భయ్యా), సీనియర్ కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ కూడా ప్రభావం చూపుతారు. జనసత్తా దళ్ లోక్‌తాంత్రిక్ పేరుతో కొత్త పార్టీ పెట్టి తనతో పాటు మరో ఎమ్మెల్యేనూ గెలిపించుకున్న రాజా భయ్యా మద్దతు ఈసారి ఎవరికన్నది ఆసక్తికరం.

ఆజంగఢ్... ఎస్పీకి సవాల్

యూపీలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఆజంగఢ్ ఒకటి. ఓటర్లలో 21 శాతం యాదవులు, 17 శాతం ముస్లింలు, 19 శాతం దళితులున్నారు. భూమిహార్, ఠాకూర్, బ్రాహ్మణ, కాయస్థ ఓటర్లూ ప్రభావం చూపుతారు. 2014లో ములాయం సింగ్ యాదవ్, 2019లో ఆయన తనయుడు అఖిలేశ్ యాదవ్ విక్టరీ కొట్టారు. గత ఎన్నికల్లో మోదీ వేవ్‌లో సైతం ఇక్కడ కాషాయ జెండా ఎగరలేదు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అఖిలేశ్ ఈ సీటును ఖాళీ చేయడంతో వచ్చిన ఉప ఎన్నికలో ప్రముఖ భోజ్‌పురీ నటుడు దినేశ్ లాల్ యాదవ్ నిరాహువా ఇక్కడ బీజేపీకి తొలి విజయం అందించారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఎస్పీ నుంచి ధర్మేంద్ర యాదవ్, బీఎస్పీ నుంచి భీమ్ రాజ్‌భర్ బరిలో ఉన్నారు.

ఫూల్పూర్.. నెహ్రూ కోట

ప్రయాగ్‌రాజ్ జిల్లాలో చరిత్రాత్మక నియోజకవర్గమిది. తొలి ప్రధాని నెహ్రూ తొలి ఎన్నికల్లో విజయం సాధించిన స్థానం. ఇక్కడి నుంచి హ్యాట్రిక్ కొట్టారాయన. 1962 ఎన్నికల్లో సోషలిస్టు దిగ్గజం రామ్ మనోహర్ లోహియా గట్టి పోటీ ఇచ్చినా విజయం నెహ్రూనే వరించింది. ఆయన మరణానంతరం సోదరి విజయలక్ష్మీ పండింట్ ఇక్కడ గెలిచారు. 1975 ఎమర్జెన్సీతో ఫూల్పూర్‌లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. 1971లో వీపీ సింగ్ చివరిసారిగా కాంగ్రెస్ నుంచి గెలిచారు. తర్వాత ఇప్పటిదాకా ఇక్కడ హస్తానికి చాన్సే లేకుండా పోయింది! ఏళ్లుగా ఇక్కడ సమాజ్‌వాదీ పాగా వేసింది. 2004లో మాఫియా డాన్ అతీఖ్ అహ్మద్ సమాజ్‌వాదీ తరఫున గెలుపొందడం విశేషం. 2014లో కేశవ్ ప్రసాద్ మౌర్య తొలిసారి ఇక్కడ కాషాయ జెండాను ఎగరేశారు. ఆయన రాష్ట్ర రాజకీయాల్లోకి మారడంతో వచ్చిన ఉప ఎన్నికలో మళ్లీ ఎస్పీ గెలిచింది. 2019లో బీజేపీ నేత కేసరీదేవి పటేల్ విజయం సాధించారు. ఈసారి బీజేపీ నుంచి ప్రవీణ్ పటేల్, ఎస్పీ నుంచి అమర్‌నాథ్ మౌర్య, బీఎస్పీ నుంచి జగన్నాథ్ పాల్ బరిలో ఉన్నారు. ముగ్గురూ తొలిసారి లోక్‌సభకు పోటీ చేస్తుండటం విశేషం!



అమర్‌నాథ్ మౌర్య

మోదీజీ.. ఇక చాలు

విద్వేష ప్రసంగాలతో విషం చిమ్ముతున్నారు

ప్రజా జీవితం నుంచి నిష్క్రమించండి

ఇంటర్వ్యూలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే హితవు

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాలతో హిందూ, ముస్లింల మధ్య విషం చిమ్ముతున్న మోదీ ప్రజాజీవితం నుంచి నిష్క్రమించడం మేలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే హితవు పలికారు. విపక్షాల కూటమి అధికారంలోకి వస్తే మీ దగ్గర ఉన్న పాడిఆవులు, గేదెలను లాక్కుంటారని, మీ రిజర్వేషన్ కోటా తగ్గించి ముస్లింలకు 15 శాతం ఇస్తారని మోదీ రోజూ అబద్దాలు ప్రచారం చేస్తూ సమాజంలో చీలిక తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పీటీఐ ఇంటర్వ్యూ సందర్భంగా ఖర్గే వెల్లడించిన అభిప్రాయాలు, ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఆయనే వైదొలగుతానన్నారు

'హిందూ, ముస్లింల మధ్య ఘర్షణకు కారణమయ్యేలా మాట్లాడితే క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఇటీవల ప్రధాని మోదీ స్వయంగా చెప్పారు. మళ్లీ ఆయనే రోజూ హిందూ, ముస్లిం విద్వేష ప్రసంగాలు ఇస్తున్నారు. ఆయన మాటలకు ఆయనే కట్టుబడట్లేరు. తప్పులు ఒప్పుకోరు. క్షమాపణలు చెప్పరు. ఆయన ఎంతగా అబద్దాలడుతున్నారో తెలియాలంటే సొంత ప్రసంగాలు ఆయన ఒకసారి వింటే, చూస్తే మంచిది. ఎన్నికల ర్యాలీల్లో విష ప్రచారాన్ని దట్టించారు. ఇలా మాట్లాడే ఆయన ప్రజాజీవితానికి స్వస్తి పలకడమే అత్యుత్తమం''

అందుకే రాహుల్ ప్రేమ దుకాణాలు తెరుస్తానన్నారు

'' బీజేపీ నేతలు రాజ్యాంగం, ముస్లింల వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తే మోదీ ఏనాడైనా ఖండించారా? గిరిజనులపై మూత్ర విసర్జన ఘటనలను ఒక్కసారైనా తప్పుబట్టారా? కనీసం బీజేపీ నేతలను మందలిస్తూ హెచ్చరిక వ్యాఖ్యలు చేశారా?. తానొక్కడినే నేత అన్నట్లు వన్‌మ్యాన్ షో చేస్తున్నారు. మొత్తం దేశాన్ని ఒక్కడినే పాలిస్తానని ప్రకటించుకుంటున్నారు. ప్రచారసభల్లో విద్వేష వ్యాఖ్యానాలే చేస్తున్నారు. అందుకే విద్వేషం సమసిపోయేలా ప్రేమ దుకాణాలు తెరుస్తానని రాహుల్ గాంధీ అన్నారు''

'400' గొడవ మొదలెట్టిందే మీరు

"పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ కావాలని, 400 సీట్లు గెలవాలని అన్నది ఎవరు?. రిజర్వేషన్లపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదా? అసలు 400 సీట్ల గొడవ మొదలెట్టిందే మీరు. అర్హతలేని ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో రాజ్యాంగబద్ధ సంస్థలను నింపేద్దామని బీజేపీ భావిస్తోంది. రిజర్వేషన్లు తెగ్గోసేందుకు రాజ్యాంగంలో మార్పులకు బీజేపీ సాహసిస్తోంది. రాజ్యాంగం ప్రకారం పాలించట్లేదు. అనైతికంగా గతంలో మధ్యప్రదేశ్, కర్ణాటక, మణిపూర్, ఉత్తరాఖండ్, గోవాల్లో ప్రభుత్వాలను కూల్చేశారు" అని ఖర్గే ఆరోపించారు.

అవి బుజ్జగింపు రాజకీయాలు కావు

''అన్యాయమైపోతున్న వారిని పట్టించుకుంటే దానిని బుజ్జగింపు రాజకీయాలు అనరు. మేమేం చేసినా బుజ్జగింపు రాజకీయాలు అంటే ఎలా? పేదలకు ఏదైనా ఇవ్వడం, స్కాలర్‌షిప్ అందించడం, ముస్లింలకు ప్రత్యేక పాఠశాలల ద్వారా విద్యనందిస్తే వాటిని బుజ్జగింపు రాజకీయాల గాటన కట్టొద్దు''

బీజేపీలో కూర్చున్న అవినీతి నేతల సంగతేంటి?

''అవినీతి నేతల్ని జూన్ 4 తర్వాత జైల్లో వేస్తామని మోదీ అన్నారు. మరి అవినీతి మరకలున్న చాలా మంది నేతలను బీజేపీ లాగేసుకుని ఒళ్లో కూర్చోబెట్టుకుంది. వారిలో కొందరిని ఎంపీలను చేసింది. మరి కొందరు ఏకంగా ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. మరి వారి సంగతేంటి?''.



బీజేపీ మెజారిటీని కచ్చితంగా అడ్డుకుంటాం

''కాంగ్రెస్, విపక్షాల 'ఇండియా' కూటమి పట్ల ప్రజల్లో సానుకూల స్పందన చాలా పెరిగింది. కూటమి అనుకూల పవనాలు బలంగా వీస్తున్నాయి. ఈ బలంతో బీజేపీ మెజారిటీని ఖచ్చితంగా నిలువరిస్తాం. మా కూటమి ఎక్కువ సీట్లు గెలుస్తుంది''.

ప్రధాని స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడొచ్చా?

''రామ మందిరం, హిందూ–ముస్లిం, ఇండియా–పాకిస్తాన్ అంశాలే దశాబ్దాలుగా చెబుతూ ప్రజల భావోద్వేగాలను ఓట్ల రూపంలో ఇన్నాళ్లూ ఒడిసిపట్టారు. ఇక ఆటలు సాగవని అర్థమైంది. అందుకే కొత్తగా కాంగ్రెస్ గెలిస్తే ఇంట్లో ఆవులు, గేదెలు తీసుకెళ్తుందని, ఆస్తులు స్వాధీనం చేసుకుంటుందని, మంగళసూత్రం తెంపుకుపోతుందని, భూములు లాక్కుంటారని ఇష్టమొచ్చినట్లు చెబుతున్నారు. అసలు ప్రధాని స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడొచ్చా?''

మోసగాళ్ల కూటమి

విపక్షాలపై ప్రధాని మోదీ విమర్శలు

మహారాజ్‌గంజ్/మోతిహారీ/ప్రయాగ్‌రాజ్: సార్వత్రిక సమరంలో విపక్షాల 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. మంగళవారం బిహార్‌లోని మహారాజ్‌గంజ్, పూర్వీ చంపారన్ నియోజకవర్గాల్లో, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఎన్నికల ప్రచారర్యాలీల్లో ప్రసంగించారు. ప్రసంగాల్లోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

విపక్షాల కూటమికి ఎదురుదెబ్బ తప్పదు

'' సనాతన ధర్మ వ్యతిరేక భావనలు ఆ కూటమిలో నిండిపోయాయి. అవినీతి, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయిన విపక్షాల కూటమికి జూన్ 4న ఫలితాల సందర్భంగా పెద్ద ఎదురుదెబ్బ తగులుతుంది. వారసత్వంపై నాకు నమ్మకం లేదు. నాకు వారసులు అంటూ ఒకవేళ ఉంటే అది ప్రజలే. గతంలో ఆర్జేడీ–కాంగ్రెస్ ప్రభుత్వం బిహార్‌ను అస్తవ్యస్తంగా పాలించి తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ పుట్టిన నేలకు అపకీర్తి తెచ్చారు. 1990లలో బిహార్‌లో బెదిరింపు పన్ను వ్యవస్థ రాజ్యమేలింది. దీంతో పరిశ్రమలు, ఉపాధిలేక వేలాదిగా బిహారీలు వలస బాటపట్టారు. ఎన్డీఏ ప్రభుత్వాలు వలస సంస్కృతికి చరమగీతం పాడేందుకు ఎంతో కృషిచేశాయి. పంజాబ్, తెలంగాణ, తమిళనాడులో బిహార్ కూలీలపై స్థానిక కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కాంగ్రెస్ రాజకుటుంబం మౌనంగా ఉండిపోయింది''

దశలు దాటే కొద్దీ దిగజారిపోయారు

''లోక్‌సభ ఎన్నికల తొలి దశలోనే విపక్షాల కూటమి డీలాపడింది. రెండో, మూడో, నాలుగో, ఐదో దశకొచ్చేసరికి మొత్తం నీరుగారిపోయారు. మిగిలిన రెండు దశల్లోనూ ఇదే వరస. జూన్ 4 వచ్చే ఫలితాలతో ఆ కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగలడం ఖాయం. అసలు ఆ కూటమికి ఒక రాజకీయ కూటమి లక్షణాలే ఉండవు. అందులోని అన్ని పార్టీల నేతలంతా కలిసి రూ.20 లక్షల కోట్ల కుంభకోణాలు చేశారు. వందశాతం మోసగాళ్ల కూటమి అది. కూటమికి మూడు పెద్ద అవలక్షణాలున్నాయి. అది మతతత్వ, కులతత్వ, వారసత్వ కూటమి''.



కోల్‌కతాలో బంగ్లాదేశ్ ఎంపీ అదృశ్యం

కోల్‌కతా: బంగ్లాదేశ్‌కు చెందిన అధికార అవామీ లీగ్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు అన్వరుల్ అజీం అనార్ కోల్‌కతాలో అదృశ్యమయ్యారు. చికిత్స కోసం ఈ నెల 12వ కోల్‌కతాకు వచ్చిన ఆయన నగరంలోని బారానగర్‌లోని తన స్నేహితుడి ఇంట్లో దిగారు. మే 13వ తేదీన బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. అయితే, ఎనిమిది రోజులుగా ఆయన ఫోన్ నుంచి కుటుంబసభ్యులకు మెసేజీలు మాత్రం వస్తున్నాయని, ఢిల్లీ వెళ్తున్నట్లుగా అందులో ఉందని కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆయన ఏమయ్యారో తెలియడం లేదన్నారు. అన్వరుల్ అజీం స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

దేశంలో కేపీ.1, కేపీ.2 కోవిడ్ వేరియంట్లు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ కేపీ.1 వేరియెంట్ కేసులు 34, కేపీ.2 వేరియంట్‌కు చెందిన 290 కేసులను గుర్తించినట్లు ఇండియన్ సార్స్‌కోవ్ 2 జెనోమిక్స్ కన్సార్టియం(ఇన్సాకాగ్) మంగళవారం తెలిపింది. ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇవి బయటపడ్డాయంది. మొత్తం 290 కేపీ.2 వేరియంట్‌కు సంబంధించిన కేసుల్లో మహారాష్ట్రలో అత్యధికంగా 148 నిర్ధారణ య్యాయని వివరించింది. మొత్తం 34 కేపీ.1 కేసులకుగాను పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 23 గుర్తించామని పేర్కొంది. ఇటీవల సింగపూర్‌లో వేగంగా పెద్ద సంఖ్యలో నమోదవుతున్న కోవిడ్ కేసులకు ఈ రెండు వేరియంట్లే కారణమని ఆ నివేదిక వివరించింది.

సిసోడియా బెయిల్‌కు హైకోర్టు 'నో'

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, సీబీఐలు దాఖలు చేసిన కేసుల్లో సిసోడియా బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. తీవ్ర అధికార దుర్వినియోగం, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించడం జరిగిందని పేర్కొంటూ జస్టిస్ స్వర్ణ కాంత శర్మ, ఆయనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించారు. కీలకమైన ఆధారాలను, ఎలక్ట్రానిక్ ఆధారాలను సిసోడియా ధ్వంసం చేసినట్లు ఆరోపణలున్నాయన్నారు.

సింగపూర్ విమానంలో భారీ కుదుపులు

ఒకరి మృతి • 30 మందికి గాయాలు

బ్యాంకాక్: లండన్ నుంచి సింగపూర్‌కు బయల్దేరిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో మార్గమధ్యంలో భారీ కుదుపులకు లోనైంది. దీంతో విమానంలోని ప్రయాణికులు ఒక్కసారిగా సీలింగ్ తగిలి, చెల్లాచెదురుగా పడి గాయాలపాలయ్యారు. ఊహించని పరిణామంతో హతాశుడైన ఒక 73 ఏళ్ల ప్రయాణికుడు అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు. 30 మంది గాయపడ్డారు. వీరందరినీ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. వీరిలో ఏడుగురికి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. బోయింగ్ 777 రకం ఎస్‌క్యూ321 విమానం మంగళవారం ఉదయం మయన్మార్ దగ్గర్లోని అండమాన్ సముద్ర జలాలపై ప్రయాణిస్తున్నపుడు ఈ ఘటన జరిగింది. విమానం బయల్దేరిన 10 గంటల తర్వాత జరిగిన ఈ ఘటన వివరాలను సింగపూర్ ఎయిర్‌లైన్స్, ప్రయాణికులు వెల్లడించారు. ఘటన తర్వాత విమానాన్ని దారి మళ్లించి దగ్గర్లోని బ్యాంకాక్‌లోని సువర్ణభూమి విమానాశ్రయంలో ల్యాండ్‌చేశారు. గాయపడని ప్రయాణికులను వేరే విమానాల్లో గమ్యస్థానమైన సింగపూర్‌కు పంపేశారు.

అసలేమైంది?

211 మంది ప్రయాణికులు, 18 సిబ్బందితో విమానం లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం నుంచి బయల్దేరింది. ఎయిర్‌హోస్టెస్ ప్రయాణికులకు అల్పాహారం అందిస్తున్న సమయంలో విమానం 37,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. హఠాత్తుగా విమానం కుదుపులకు లోనైంది. మూడు నిమిషాల వ్యవధిలో ఆరువేల అడుగులు అంటే 37వేల అడుగుల ఎత్తు నుంచి 31వేల అడుగుల స్థాయికి పడిపోయింది. దీంతో విమానంలో బెల్ట్ పెట్టుకోని ప్రయాణికులంతా ఒక్క ఉదుటున గాల్లోకి లేచి సీలింగ్‌కు ఢీకొన్నారు. మూడు నిమిషాల పాటు విమానం అటూఇటూ ఊగుతూ కిందకు పడిపోతుండటంతో లోపలున్న వారంతా చెల్లా చెదు రుగా పడిపోయారు. అసలేం జరుగుతుందోనన్న భయం, ఆందోళనతో అస్వస్థతకు గురై 73 ఏళ్ల బ్రిటిష్ జాతీయుడు అక్కడికక్కడే మరణించారు. గుండెపోటు కారణంగా ఆయన మరణించి ఉంటారని వైద్యులు భావిస్తున్నారు. 31 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్నాక విమానం మళ్లీ స్థిరత్వాన్ని సాధించింది. వెంటనే తేరుకున్న పైలట్లు 30 నిమిషాల్లోపే బ్యాంకాక్‌లోని సువర్ణభూమి ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ప్రయాణికుల్లో ఎక్కువ మంది బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేసియా, సింగపూర్, న్యూజిలాండ్ దేశస్తులున్నారు. ముగ్గురు భారతీయులు కూడా ఉన్నారు.



భారీ కుదుపులతో విమానం లోపల పరిస్థితి ఇదీ.. (ఇన్‌సెట్)బ్యాంకాక్ ఎయిర్ పోర్టులో ల్యాండయిన విమానం

నిరసనలతో కంగారెత్తిస్తున్నారు..!

పంజాబ్, హరియాణాల్లో బీజేపీ అభ్యర్థుల ప్రచారాలను పదేపదే అడ్డుకుంటున్న రైతు సంఘాలు

సాక్షి, న్యూఢిల్లీ: పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత, ఉద్యమ నేతలపై కేసుల కొట్టివేత వంటి డిమాండ్‌లతో గడిచిన ఫిబ్రవరిలో పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో చేపట్టిన ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన రైతు సంఘాలు, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. బీజేపీ అభ్యర్థులు ప్రచారం చేసే ప్రతీ ప్రాంతానికి వెళ్లి వారిని అడ్డుకుంటున్నాయి. నల్లజెండాలతో బీజేపీ అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. ఈ నెల 25న హరియాణాలో, జూన్ ఒకటిన పంజాబ్‌లో ఎన్నికలు జరుగన్న నేపథ్యంలో రైతు సంఘాల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత బీజేపీ నేతలను కంగారు పెట్టిస్తోంది.

అడుగడుగునా అడ్డంకులు..

పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో 67 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ఇందులో అధికంగా రైతులే ఉన్నారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో అకాలీదళ్‌తో పొత్తుతో బీజేపీ 13 సీట్లకు గానూ రెండు సీట్లలో గెలుపొందింది. ఆ పార్టీకి 9.7 శాతం ఓట్లు వచ్చాయి. అయితే రైతు ఉద్యమాల అనంతరం జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 117 సీట్లకు గానూ కేవలం రెండు సీట్లకు పరిమితమై 6.7 శాతం ఓట్లు మాత్రమే రాబట్టుకుంది. ఇక హరియాణాలో 2019 ఎన్నికల్లో పదికి పది సీట్లను గెలుచుకున్న బీజేపీ ప్రస్తుతం మాత్రం రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోంది. భారతీయ కిసాన్ యూనియన్ (చారిణి), కీర్తి కిసాన్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా వంటి రైతు సంఘాలు బీజేపీకి నిద్రపట్టనీయడం లేదు. బీజేపీ అభ్యర్థులు ఎక్కడ ప్రచారానికి వెళితే అక్కడ ఈ సంఘాలు వారిని అడ్డుకుంటున్నాయి. అశోక్ తన్వర్ (సిర్సా), రంజిత్ చౌతాలా (హిసార్), అరవింద్ శర్మ (రోహ్తక్), మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (కర్నాల్), మోహన్ లాల్ బడోలి (సోనిపట్), నవీన్ జిందాల్ (కురుక్షేత్ర)లకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వీరు ఎక్కడ ప్రచారం నిర్వహించినా రైతు సంఘాలు నల్లజెండాలు, నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. బీజేపీ అభ్యర్థుల ప్రచారాలకు ముందే ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిస్తున్నాయి. మరోవైపు రైతుల్లో ఎక్కువగా ఉన్న రాజ్‌పుత్ వర్గం సైతం బీజేపీకి వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొనడం కాషాయదళానికి తలనొప్పిగా మారింది.

మోదీకి నల్లజెండాలతో నిరసన: ఎస్‌కేఎం

చండీగఢ్: ఈనెల 23వ తేదీన పంజాబ్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నల్లజెండాలతో నిరసన తెలుపుతామని రైతు నేత బల్బీర్ సింగ్ రాజెవాల్ తెలిపారు. లూధియానాలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. తమ నిరసన ప్రశాంతంగానే సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయని రాజెవాల్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ మొదటిసారిగా ఈ నెల 23న పటియాలాలో, ఆ తర్వాత 24న గుర్దాస్‌పూర్, జలంధర్‌లలో జరిగే ర్యాలీల్లో పాల్గొంటారు.

విజయానికి చేరువలో 'ఇండియా' కూటమి

ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ/జంషెడ్‌పూర్: లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో దశ పోలింగ్ పూర్తవుతున్న కొద్దీ ప్రతిపక్ష ఇండియా కూటమి విజయానికి చేరువవుతోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. అదే సమయంలో, ప్రధాని మోదీ ప్రభుత్వం నిష్క్రమించడం ఖాయమని తేటతెల్లమవుతోందన్నారు. అనేక సర్వేలు ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయన్నారు. జూన్ 4 తర్వాత విజేతగా నిలిచే ఇండియా కూటమి సుస్థిర ప్రభుత్వాన్ని అందిస్తుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కేజ్రీవాల్ వర్చువల్‌గా మీడియాతో మాట్లాడారు. రాజధాని ఢిల్లీలో సోమవారం హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి పాల్గొన్న ఎన్నికల ర్యాలీకి కనీసం 500 మంది కూడా హాజరవ్వలేదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 'ఆప్ కార్యకర్తలను అమిత్ షా పాకిస్తానీలుగా పేర్కొన్నారు. ఢిల్లీ వాసులు 56 శాతం ఓట్లతో ఆప్‌ను 62 సీట్లలో గెలిపించారు. ఈ లెక్కన ఢిల్లీ ప్రజలంతా పాకిస్తానీలవుతారా? పంజాబ్ ప్రజలు అసెంబ్లీలోని 117 సీట్లకు గాను 92 సీట్లలో ఆప్‌ను గెలిపించారు. వాళ్లూ పాకిస్తానీలేనా? ఆప్ తరఫున అనేక మంది సర్పంచిలు, మేయర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. అంతమాత్రాన పాకిస్తానీలవుతారా?'అని కేజ్రీవాల్ నిలదీశారు.

ఎలక్షన్ బీట్

ఎన్డీయేకు 310 సీట్లు వచ్చాయి: షా

ఒడిశా: ఐదు దశల లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ఇప్పటికే 310 సీట్లను కైవసం చేసుకుందని, మిగిలిన రెండు దశల తరువాత 400కు పైగా సీట్లు సాధిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఒడిశా ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పోటీలో ఉన్న సంబల్‌పూర్‌లో జరిగిన రెండు ఎన్నికల ర్యాలీల్లో షా మాట్లాడారు. ఒడిశా రాష్ట్రాన్ని 'బాబు' పాలన నుంచి విముక్తి చేయాలని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఆయన ఒడిశా ప్రజలను కోరారు. ఈసారి ఒడిశాలో కమలం వికసిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని అత్యధిక గనులు, ఖనిజ నిల్వలు కియోంజర్ జిల్లాలోనే ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలోని గిరిజనులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. సీఎం నవీన్‌పట్నాయక్ రాష్ట్రంలోని ఖనిజ వనరులను దోచుకుంటున్నారని, రాష్ట్రంలో పుష్కలమైన ఖనిజ సంపదలున్నా వాటిని కాపాడే ముఖ్యమంత్రి లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

క్షమాపణలు కోరిన సంబిత్ పాత్ర

మూడు రోజుల ఉపవాస దీక్ష పాటిస్తానని ప్రకటన

భువనేశ్వర్: 'జగన్నాథ స్వామి ప్రధాని మోదీ భక్తుడు'అంటూ పొరపాటున వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్న పూరీ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి సంబిత్ పాత్ర క్షమాపణలు కోరారు. ఈ పాపానికి గాను మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఉపవాస దీక్ష పాటిస్తానని ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పూరీ జగన్నాథుడు ప్రధాని మోదీ భక్తుడు అంటూ చేసిన వ్యాఖ్య తీవ్ర విమర్శలకు కారణమైంది. ఆ వెంటనే సంబిత్ పాత్ర వివరణ ఇచ్చారు. ప్రధాని మోదీ జగన్నాథుని భక్తుడు అనబోయి పొరపాటున అలా అనేశానే తప్ప మరే ఉద్దేశం లేదని పేర్కొన్నారు. అనంతరం ఆయన 'ఎక్స్'లో.. ఈ తప్పునకు గాను శ్రీ జగన్నాథుని పాదాల వద్ద క్షమాపణలు కోరుతున్నాను. ఈ పాపానికి ప్రాయశ్చిత్తంగా మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఉపవాస దీక్ష పాటిస్తాను'అని ప్రకటించారు.

జస్టిస్ అభిజిత్ ప్రచారంపై ఒక్కరోజు నిషేధం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ అభ్యర్థి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయపై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 24 గంటల పాటు ఆయన ప్రచారం నిర్వహించకుండా నిషేధించింది. సీఎం మమతపై గంగోపాధ్యాయ చేసిన వ్యాఖ్యలను నీచమైన వ్యక్తిగత దాడిగా అభివర్ణించింది. అవి అనుచితంగా, అగౌరవ పరిచేవిధంగా ఉన్నాయని ఖండించింది. మహిళలను గౌరవించే సంప్రదాయం ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఆ వ్యాఖ్యలు అపఖ్యాతిని తెచ్చిపెట్టాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. తమ్లుక్ బీజేపీ అభ్యర్థి అయిన గంగోపాధ్యాయ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 17న హల్దియాలో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. 'బీజేపీ సందేశ్‌ఖాలీ అభ్యర్థి రేఖా పాత్రని రూ.2వేలకు కొనుగోలు చేశారని తృణమూల్ కాంగ్రెస్ చెబుతోంది. మరి సీఎం మమతా బెనర్జీ ఎంతకు అమ్ముడుపోయారు..? మీ రేటు రూ.10లక్షలా?'' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

మిథున్ చక్రవర్తి రోడ్ షోలో ఘర్షణలు

మిద్నపూర్(పశ్చిమబెంగాల్): సీనియర్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి మంగళవారం పశ్చిమబెంగాల్‌లోని మిద్నపూర్‌లో చేపట్టిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొందరు దుండగులు ర్యాలీపైకి రాళ్లు రువ్వారని, ఘర్షణలకు పాల్పడ్డారని, సకాలంలో జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగిందని పోలీసులు తెలిపారు. మిథున్‌తో పాటు బీజేపీ అభ్యర్థి అగ్నిమిత్ర పాల్ సురక్షితంగా బయటపడ్డారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 22 । మే । 2024



క్వింటాల్ పత్తి రూ.7,400

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్లో క్వింటాల్ పత్తి గరిష్ఠంగా రూ.7,400 పలికింది. మార్కెట్‌కు 22 వాహనాల్లో 270క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.7,250 పలికింది.



మేకపోతుల బండితో బోనం

చొప్పదండి: బీరయ్య ఉత్సవాల్లో భాగంగా చొప్పదండిలో రాజన్నల పరివారం సభ్యులు మేకపోతుల బండితో స్వామివారికి బోనాలు సమర్పించారు. కౌన్సిలర్ రాజన్నల ప్రణీత, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం

జిల్లాలో నేడు ఉక్కపోత ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్



సురేంద్రమోహన్

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ వీసీగా సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న వీసీ పదవీకాలం పూర్తి కావడంతో మంగళవారం బాధ్యతల నుంచి తప్పుకున్నారు. కొత్త వీసీ నియామకం అయ్యే వరకు ఇన్‌చార్జీల పాలనలో వర్సిటీ కార్యకలాపాలు సాగనున్నాయి. శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియామకమైన ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వానికి అటాచ్‌మెంట్‌లో ఉన్నారు.

సాంకేతిక విప్లవానికి రాజీవ్‌గాంధీ పునాది



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: దేశంలో సాంకేతిక విప్లవానికి మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్‌గాంధీ పునాది వేశారని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ కొనియాడారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజీవ్‌చౌక్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. నాయకులు పురుమల్ల శ్రీనివాస్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, కర్ర సత్యప్రసన్నరెడ్డి, పులి ఆంజనేయులుగౌడ్, శ్రావణ్ నాయక్, మడుపు మోహన్, సిరాజ్ హుస్సేన్, వెన్న రాజమల్లయ్య, బొబ్బిలి విక్టర్, కల్వల రామచందర్, ముస్తాక్ పాల్గొన్నారు.

ఆదాయపన్నుశాఖకు సహకరించండి



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్ఈ


కొత్తపల్లి(కరీంనగర్): ఉద్యోగులు ఆదాయపన్నుశాఖకు సహకరించాలని ఆదాయపన్ను శాఖ అదనపు కమిషనర్ డా.ఎస్.రాజకుమార్ కోరారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులకు ఆదాయపన్ను చెల్లింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. డా.ఎస్.రాజకుమార్, అసిస్టెంట్ కమిషనర్ డి.కిరణ్‌కుమార్, ఆదాయపు పన్నుశాఖ ఆఫీసర్ వార్డు హెచ్.లున్, శ్రీకాంత్, రాజేశం ఆదాయపు పన్ను ఫైలింగ్, ఫామ్–16 అప్డేట్, రిటర్న్స్, ప్రాసెసింగ్ లెటర్, ఇంటిమేషన్, నోటీసులు తదితర అంశాలపై వివరించారు. తప్పుడు సర్టిఫికెట్లు చూపించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి ఇబ్బందుల్లో పడొద్దని విద్యుత్ ఉద్యోగులకు సూచించారు. డీఈలు విజయేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజం, తిరుపతి, గోపికృష్ణ, కాళిదాసు, చంద్రమౌళి ఉన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేసిన మురళీధర్‌రావు


కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా క్రీడాకారులు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెలకువలతో అంతర్జాతీయస్థాయికి ఎదగాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.మురళీధర్‌రావు సూచించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. జిల్లాకేంద్రంలోని కేడీసీఏ ప్రధాన మైదానంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, కోచ్‌లకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. క్రికెట్లో శిక్షణ పొందిన క్రీడాకారులు రానున్న రోజుల్లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధస్థాయి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఉచిత శిబిరాలను సంవత్సరం మొత్తం నిర్వహించేలా కృషి చేస్తామన్నారు. త్వరలో అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కోచ్‌లు శ్రీనివాస్, శ్రావణ్, పూర్ణచందర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



కరీంనగర్‌లోని ఎలగందల్ ఖిల్లా




రాజన్న సిరిసిల్లలోని నాంపల్లి గుట్ట



పెద్దపల్లిలోని రామగిరి ఖిల్లా



జగిత్యాలలోని టవర్‌సర్కిల్



మారనున్న కన్నారం!

- ఉమ్మడి జిల్లాలో ఒకదానికి పీవీ పేరు
- ఇటీవల కేబినెట్‌లో ప్రస్తావన..
- కోడ్ తర్వాత హుస్నాబాద్ విలీన ప్రక్రియ మొదలు
- సిరిసిల్ల జిల్లా మనుగడపై త్వరలో స్పష్టత

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డ.. మంథని నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, హన్మకొండ నుంచి ఎంపీగా, దేశ ప్రధానిగా ఎదిగిన మహనీయుడు. పతనావస్థలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థకు సంస్కరణలతో ఊపిరి లూదిన దార్శనికుడు. దేశ పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించి, లక్షలాది మందికి ఉపాధి కల్పించిన విజనరీ. భూసంస్కరణలతో నిరుపేదల కు భూమి దక్కేలా చేసిన ఉదారవాది. ఆయనే పీవీ.. మన తీవీ. ఆయనకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రదానం చేసి గౌరవించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో అడుగులేస్తోంది. ఆయన పేరును నిత్యం తలచుకునే ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఒక జిల్లాకు పీవీ నరసింహారావు పేరుపెట్టే అంశాన్ని పరిశీలిస్తోంది.

కేబినెట్‌లోనూ పీవీపై చర్చ

1952లో మంథని ఎమ్మెల్యేగా తొలిసారి పీవీ నరసింహారావు విజయం సాధించారు. అది మొదలు వెనుదిరిగి చూడలేదు. మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిగా ఆ పదవులకే వన్నె తెచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాలకు పేర్లు మారుస్తామని ప్రకటించింది. అందుకోసం సర్దార్ సర్వాయి పాపన్న, పీవీ నరసింహారావు పేర్లను పరిశీలించినట్లు తెలిపింది. ఈక్రమంలో ఉమ్మడి కరీంనగర్‌లో ఓ జిల్లాకు పీవీ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ఈ విషయం ప్రస్తావనకొచ్చింది. పీవీ నరసింహారావు పుట్టింది ఉమ్మడి వరంగల్. దత్తత కారణంగా చిన్నతనంలో ఉమ్మడి కరీంనగర్‌లోని వంగరకు రావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పీవీ పేరును ఉమ్మడి కరీంనగర్ లేదా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక జిల్లాకు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. హుజూరాబాద్‌ను జిల్లాగా చేసి దానికి పీవీ నరసింహారావు పేరును పెట్టాలని చాలా కాలంగా ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్న విషయాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది.

హుస్నాబాద్ తిరిగి విలీనం

13 అసెంబ్లీ నియోజకవర్గాలతో ఉమ్మడి జిల్లా విశాలంగా ఉండేది. 2016లో కొత్త జిల్లాల ఏర్పాటుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కరీంనగర్ జిల్లాను నాలుగు జిల్లాలుగా, కొన్ని మండలాలను కలిపి మరో మూడు జిల్లాలుగా ఏర్పాటు చేసింది. అంటే కరీంనగర్ జిల్లా ఏడు భాగాలుగా విడిపోయింది. జిల్లాల ఏర్పాటును కొందరు స్వాగతించగా.. మరికొందరు వ్యతిరేకించారు. హుస్నాబాద్ మండలంలోనూ కొందరిలో ఈ అసంతృప్తి ఉంది. జిల్లాల విభజనతో తమకు కరీంనగర్‌తో ఉన్న అనుబంధం తెగిపోయిందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా తమ నియోజకవర్గం మూడు వేర్వేరు జిల్లాల్లో ఉండడంతో సర్టిఫికెట్లు, ధ్రువీకరణపత్రాలు, స్థానికత తదితర సాంకేతిక ఇబ్బందులు ఎదరవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుస్నాబాద్ మండలాన్ని కరీంనగర్‌లో విలీనం చేస్తానని పొన్నం ప్రభాకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. పొన్నం విజయం సాధించడం, మంత్రి కావడం చకచకా జరిగిపోయాయి. అనంతరం విలీన ప్రస్తావన వచ్చినా.. పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో వాయిదా పడింది. కోడ్ పూర్తయిన తర్వాత మండల విలీన ప్రక్రియ మొదలవుతుందని సమాచారం.

రాజన్న సిరిసిల్ల మనుగడ?

జిల్లాల విభజనలో శాస్త్రీయత లోపించినందునే తాము ఈ అంశాన్ని పరిశీలిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి చెబుతూ వస్తోంది. అందుకే, కొన్ని జిల్లాలను రద్దు చేయాలని ఆలోచనలో ఉందనే ప్రచారం సాగుతోంది. ఆ జాబితాలో రాజన్నసిరిసిల్ల జిల్లా కూడా ఉండడం గమనార్హం. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మాజీ సీఎం కేసీఆర్ కూడా ఇదే అంశాన్ని పలు వేదికలపై లేవనెత్తారు. జిల్లాల పునర్ విభజన కోసం ప్రభుత్వం త్వరలోనే కమిటీని ఏర్పాటు చేయనుందని సమాచారం. ఆ కమిటీ సిఫారసుల ఆధారంగా జిల్లాల రద్దుపై నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. దీంతో త్వరలోనే సిరిసిల్ల జిల్లాగా కొనసాగుతుందా? లేదా కరీంనగర్‌లో విలీనమవుతుందా? అన్న విషయంపై స్పష్టత రానుంది. అలా స్పష్టత వస్తే.. 2016 తర్వాత పాత కరీంనగర్ రూపురేఖలు, నామకరణాలు మరోసారి మారనున్నాయి.

తవ్వినకొద్దీ అక్రమాలే!

- శిఖం భూమిపై కబ్జాదారుల కన్ను
- 301 సర్వే నంబర్‌లో మరిన్ని అక్రమ పట్టాలు
- పట్టా చేసుకున్న వారిలో ప్రజా ప్రతినిధులు
- చొప్పదండిలో అక్రమ రిజిస్ట్రేషన్ల కలకలం



పట్టణ శివారులోని బ్రాహ్మణికుంట శిఖం

చొప్పదండి: చొప్పదండి పట్టణ శివారులోని బ్రాహ్మణికుంట శిఖంభూమిని కబ్జా చేసేందుకు అక్రమార్కులు తప్పుడు రిజిస్ట్రేషన్లు ఎంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నంబర్ 301లో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై వచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపిన పోలీసులు సోమవారం ఇద్దరిని రిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సర్వే నంబర్‌కు సమీపంలో ఉన్న బ్రాహ్మణికుంట శిఖం భూమిని ఆక్రమించేందుకు తప్పుడుహద్దులతో మరో పదికి పైగా రిజిస్ట్రేషన్‌లు జరిగాయని బాధితులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉండే లొసుగుల ఆధారం, అధికారుల అండతో పలువురు ప్రజాప్రతినిధులు సైతం శిఖం భూమిని కాజేసేందుకు తప్పుడు హద్దులు చూపిస్తూ రిజిస్ట్రేషన్లు చేసుకున్న విషయాలు వెలుగు చూడడంతో స్థానికులు నివ్వెరపోతున్నారు. స్థలం స్వాధీనం లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతో పాటు, ఒక ప్రముఖ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఈ తప్పుడు డాక్యుమెంట్లను కుదువబెట్టి రూ.లక్షల్లో రుణాలు తీసుకోవడం ఇప్పుడు చొప్పదండిలో హాట్‌టాపిక్‌గా మారింది.

ఒకటి, రెండు.. మూడోసారి

చొప్పదండిలోని సర్వే నంబర్ 301లో తమపేరుపై ఉన్న భూమిని సుద్దాల వెంకటస్వామి, కొత్తూరి అంజయ్య 2018 ఆగస్టులో కంకణాల అంజారెడ్డికి సేల్ కమ్ జీపీఏ చేశారు. ఆయన ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టాడు. ఈ సర్వే నంబర్‌లో తమకు మరో 32గుంటల భూమి ఉందని కరీంనగర్‌కు చెందిన వైద్యుల మహేందర్‌రెడ్డికి తప్పుడు పత్రాలతో వెంకటస్వామి, అంజయ్య రెండోసారి 2019 జనవరిలో రిజిస్ట్రేషన్ చేశారు. మోకా చూపించకపోవడంతో మహేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కాగా.. రెండోసారి తప్పుడు పత్రాలతో భూమిని అంటగట్టిన వీరు మూడోసారి కుటుంబ సభ్యులు, స్నేహితుల పేరుపై రెండు గుంటలు, ఆపై చొప్పున రిజిస్ట్రేషన్లు చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలకు మున్సిపల్ కార్యాలయంలో ఓ వ్యక్తిపై ఇంటి నంబర్‌ను కూడా కేటాయించగా, గతంలో 'సాక్షి' పత్రికలో ఈ ఉదంతం బయటకు రావడంతో ఇంటినంబర్‌ను రద్దు చేశారు. గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2018 నుంచి 2021వరకు ఉన్న అధికారులు వంతపాడటంతోనే తప్పుడు డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్ల తంతు కొనసాగిందని ఆరోపణలు వస్తున్నాయి. ఫిర్యాదు లేకపోవడంతో నిందితులు మూడోసారి చేసిన రిజిస్ట్రేషన్లపై అధికారులు దృష్టి సారించడం లేదు.

రద్దు చేయాలని డిమాండ్

వెంకటస్వామి, అంజయ్యలు తప్పుడు పత్రాలతో అక్రమంగా రూపొందించిన పదికి పైగా డాక్యుమెంట్లను గంగాధర సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రద్దు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మొదటి పట్టాదారులు కోరుతున్నారు. అధికారుల అండతోనే అక్రమాలకు బరితెగించారని, శిఖం భూమిని కాజేసేందుకు ప్రయత్నించిన అధికారులు, ప్రజా ప్రతినిధులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అద్దెకు ఫుట్‌పాత్!

- నగరంలో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- చిరువ్యాపారులకు అద్దెకిస్తున్న దుకాణదారులు?
- మార్కెట్లో జోరుగా సాగుతున్న దందా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు

సాక్షి ఫోటో



నగరంలోని జిల్లా పోస్టాఫీసు ఎదుట ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్

విద్యానగర్(కరీంనగర్): స్మార్ట్‌సిటీలో భాగంగా కరీంనగర్ సుందరంగా ముస్తాబవుతోంది. అద్దంలా మెరిసే రోడ్లు, పాదచారులకు ఇబ్బంది ఏర్పడకుండా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. రూ.కోట్లు వెచ్చించి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని కొత్తలో అధికారులు హెచ్చరించారు. ప్రత్యేకడ్రైవ్‌లు సైతం నిర్వహించారు. కాలక్రమేణ చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో నగరంలోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. నగరం నడిఒడ్డున వ్యాపార, వాణిజ్యకేంద్రమైన మార్కెట్ ప్రాంతం, టవర్‌సర్కిల్, శాస్త్రీరోడ్ ప్రాంతాల్లో కొందరు దుకాణదారులు ఫుట్‌పాత్‌లను చిరువ్యాపారులకు అద్దెకిస్తున్నట్లు సమాచారం. మరికొందరు తమ వ్యాపారాన్ని ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా నిర్వహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

నగరంలోని వ్యాపారసముదాయాల ప్రాంతాల్లో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నారు. కొందరు దుకాణదారులు తమ వ్యాపారాలను ఫుట్‌పాత్‌లపై నిర్వహించడమే కాకుండా దుకాణం ఎదుట ఉన్న ప్రాంతాన్ని సైతం చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తున్నట్లు సమాచారం. చిరువ్యాపారుల నుంచి రోజువారీగా అద్దెను వసూలు చేస్తూ.. నెలకు రూ.వేలల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. పలువురు చిరువ్యాపారులు తోపుడుబండ్లు, రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా సందర్భాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. మున్సిపల్ కాంప్లెక్స్, మార్కెట్ ప్రాంతం నుంచి శాస్త్రీరోడ్డు, టవర్‌సర్కిల్, పోస్టాఫీస్ రోడ్డులో ఈ దందా యథేచ్ఛగా సాగుతుండగా.. ప్రశ్నించే అధికారే కనిపించకపోవడం విడ్డూరం.

స్కూల్‌కు, పోస్టాఫీసుకు వెళ్లడం కష్టమే..

టవర్ సర్కిల్ ప్రాంతంలో జిల్లా పోస్టాఫీసు ఉంటుంది. నిత్యం వందలాది మంది వినియోగదారులు, అధికారులు, ఉద్యోగులు వస్తుంటారు. కార్యాలయం ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌పై పలువురు యథేచ్ఛగా చిరువ్యాపారాలు నిర్వహించుకుంటారు. కనీసం కార్యాలయంలోకి వెళ్లేందుకు దారికూడా లేకుండా ఆక్రమించుకోవడంతో పోస్టాఫీసుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయం ఎదుట వాహనం పార్క్‌చేసేందుకు అవకాశం లేకపోవడంతో అన్నపూర్ణకాంప్లెక్, ఇతర ప్రాంతాల్లో వాహనాలు నిలిపి పోస్టాఫీసుకు వస్తున్నారు. దీంతో పాటు గంజ్ హైస్కూల్‌చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌తో పాటు, రోడ్డును చిరువ్యాపారులు ఆక్రమించుకోవడంతో పాఠశాల సమయంలో వెళ్లివచ్చేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఈ దారుల్లో నిరంతర ట్రాఫిక్‌జామ్ అవుతుండగా ఆక్రమణలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నగరంలోని మార్కెట్ ప్రాంతమే కాదు.. శనివారం మార్కెట్, గాంధీరోడ్డు, శాస్త్రీరోడ్డు, జ్యోతినగర్, విద్యానగర్, మంకమ్మతోట, బస్టాండ్ ఏరియా కమాన్ ఏరియా, కోతిరాంపూర్ తదితర ప్రాంతాల్లో చాలామంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారులు నిర్వహిస్తున్నారు. దీంతో నగర ప్రజలతో పాటు సిటీకి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ప్రధానాసుపత్రి చుట్టూ, చైతన్యపురి, బస్టాండ్ వెనక చిరువ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



కూరగాయల మార్కెట్ రోడ్డులో వ్యాపార సామగ్రితో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారులు



టవర్‌సర్కిల్ ప్రాంతంలో రోడ్డుపైనే వ్యాపారాలు

లక్ష్యసాధన కోసం శ్రమించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాక్‌టెస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్: లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కఠోరంగా శ్రమించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సందర్శించారు. వారధి సొసైటీ ఆధ్వర్యంలో గ్రూప్–1 అభ్యర్థులకు ఏర్పాటు చేసిన మాక్‌టెస్ట్‌ను పరిశీలించారు. 270మంది గ్రూప్–1 మాక్‌టెస్ట్ రాస్తున్నారని, ఐదు టెస్టులు ఏర్పాటు చేశామని అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి ప్రిపేర్ కావచ్చని తెలిపారు. జూన్ 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు అభ్యర్థులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అనంతరం గ్రంథాలయంలో చేపట్టిన పనులను పరిశీలించారు. వారధి సొసైటీ సెక్రటరీ జి.ఆంజనేయులు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తికావాలి

కరీంనగర్ అర్బన్: ఈ నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులకు నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. వర్షానికి మొలకెత్తిన, తడిసిన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజినీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎరుపెక్కిన నింగీనేల

భగభగ మండే సూరీడు మంగళవారం ఉదయించగానే ఆకాశం, నేల ఎరుపు వర్ణం సంతరించుకుంది. పచ్చని పొలాలు, చెరువు గట్టు, చెరువులోని నీళ్లు, చెట్లు, నివాసాలు.. ఇలా ఒక్కటేమిటీ.. ఆ ప్రాంతంలోని ప్రకృతి మొత్తం ఎరుపు తివాచీ పరుచుకున్నట్లు కనిపించింది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామ చెరువుకట్టపై మంగళవారం వేకువజామున కనిపించిన సుందర దృశ్యం ఇది..

– పాలకుర్తి(రామగుండం)

క్లుప్తంగా

ఎండ తీవ్రతతో వృద్ధుడి మృతి


నర్సింగరావు(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): బొంతకుంటపల్లి గ్రామానికి చెందిన పోలాడి నర్సింగరావు(70) ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నర్సింగరావు భార్య గతంలోనే మృతి చెందింది. అతడు ఒంటరిగానే ఉంటూ రెండెకరాలు కౌలుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం అందులో పెసరు విత్తనాలు చల్లేందుకు వెళ్లాడు. ఎండలో పనిచేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి వచ్చాక రాత్రి మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఇరుగుపొరుగువారు చూసి బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి సంతానం లేకపోవడంతో సమీపం బంధువులు అంత్యక్రియలు పూర్తిచేశారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

పాలకుర్తి(రామగుండం): వేంనూర్ గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన దీకొండ మహేందర్(43) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన మహేందర్.. తన అత్తగారిల్లు పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూర్‌కు వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యంలో వేంనూర్ గ్రామ శివారు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. దీంతో మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి సోదరుడు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై స్వామి వివరించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు..

పాలకుర్తి(రామగుండం): స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో జంగ శంకర్(40) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. జయ్యారం గ్రామానికి చెందిన శంకర్ కన్నాల బోడగుట్ట సమీపంలోని శ్రీలక్ష్మి స్టోన్ క్రషర్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలు దేరాడు. తహసీల్దార్ కార్యాలయం వద్దకు రాగానే కొత్తపల్లికి చెందిన పోతు నరేశ్ స్కూటీపై బసంత్‌నగర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో శంకర్ తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. నరేశ్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది.. శంకర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. నరేశ్‌ను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బసంత్‌నగర్ ఎస్సై శివాణిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మండలంలో వరుసగా రెండు రోజులు బైక్ ప్రమాదాలు కావడం, ఇద్దరు మృతిచెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

మూడేళ్లకే నూరేళ్లు..


విన్మయి మృతదేహం

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన నిమ్మల శిరీష–రాజు దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. మంగళవారం ఉదయం శిరీష బంధువుల ఇంట్లో ఎల్లమ్మ పట్నాలలో పాల్గొందుకు తన కూతురు విన్మయి (3)తో కలిసి స్కూటీపై జగిత్యాల పట్టణ శివారులోని లింగంపేటకు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తుండగా లింగంపేట శివారులో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వెనుక నుంచి స్కూటీని ఢీకొనడంతో కిందపడిన విన్మయికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నరేశ్ తెలిపారు. కాగా, విన్మయి తండ్రి రాజు దుబాయ్‌లో ఉండటంతో ఆ కుటుంబం జగిత్యాల ఆస్పత్రిలో పాప మృతదేహం వద్ద తీవ్రంగా రోదించారు.

బీ-థర్మల్‌పై నీలినీడలు

- పునరుద్ధరించినంత సమయం కూడా నిలువని వైనం
- తాత్కాలిక పునరుద్ధరణ పనులతో దక్కని ఫలితం
- నిత్యం ఇంజినీర్లకు అగ్నిపరీక్షగా మారుతున్న సమస్యలు


బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: రామగుండం పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం కీలక విభాగాల్లో తరచూ ఎదురవుతున్న సాంకేతిక సమస్యలతో ఇంజినీర్లు సతమతమవుతున్నారు. ప్రధానంగా బాయిలర్ ట్యూబ్స్, మిల్స్, టర్బయిన్ తదితర విభాగాల్లో సాంకేతిక సమస్యలు వస్తుండడంతో తరచూ విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ అవుతోంది. దీని పునరుద్ధరణకు సుమారు రూ.25 లక్షల విలువ చేసే ఆయిల్‌ను మండించి విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకువస్తున్నారు. పునరుద్ధరించిన తర్వాత మళ్లీ ఏ క్షణంలో ఎక్కడ సమస్య వస్తుందో అనే భయం ఇంజినీర్లను వెంటాడుతుంది.

కాలం చెల్లిన జాబితాలో..

రామగుండం బీ–థర్మల్ కేంద్రాన్ని 1965 జూలై 19న అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రస్తుతం థర్మల్ విద్యుత్ కేంద్రాల జీవితకాలం 25 ఏళ్ల మాత్రమే. గతేడాది అక్టోబర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో బాయిలర్‌లో మంటలు చెలరేగిన సమయంలో జెన్‌కో డైరెక్టర్ల బృందం సందర్శించింది. అప్పుడు స్థానిక కార్పొరేటర్లు డైరెక్టర్లను కలిసిన సమయంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. కాగా బీ–థర్మల్ సుమారు ఆరు దశాబ్దాలకు చేరువైంది. గత ఆరునెలలుగా విపరీతమైన సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నా.. గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో ఉన్న ఆధునిక విద్యుత్ కేంద్రాలకు దీటుగా విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డులు సొంతం చేసుకోవడం గమనార్హం.

ఆర్‌అండ్‌ఎంతోనే మరో పదేళ్లు..

దశాబ్దం క్రితం రూ.60 కోట్లతో రెనోవేషన్ అండ్ మోడ్రనైజేషన్ (ఆర్‌అండ్‌ఎం)తో పాటు ఈఎస్‌పీ (ఎలక్ట్రో స్టాటిక్ ప్రిసిపిరేటర్)ని వినియోగంలోకి తీసుకువచ్చారు. ఆర్‌అండ్‌ఎం కాలపరిమితి సైతం పదేళ్లు ఉంటుంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలకు లోబడి విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే కాలుష్యాన్ని అదుపు చేసేందుకు ఈఎస్‌పీని బాయిలర్‌కు అనుసంధానించారు. కాగా 25 ఏళ్లు పైబడిన విద్యుత్ కేంద్రాలను మూసివేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఆదేశించగా.. సీఈఏ నివేదికలో పేర్కొన్న అంశాలకు లోబడి ఉండడంతో విద్యుత్ కేంద్రాన్ని 2029వరకు కొనసాగించుకునే అవకాశం కల్పించారు.

నిధులు కేటాయిస్తేనే..

ఇటీవల కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను అప్పటికప్పుడు రూ.లక్షలాది నిధులు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులతో పునరుద్ధరిస్తున్నా.. రెండు మూడు రోజుల వ్యవధిలోనే కేంద్రం షట్‌డౌన్ అవుతుంది. ప్రభుత్వం స్పందించి రూ.10 కోట్లు కేటాయిస్తే కనీసం ఐదేళ్లు ఎలాంటి సమస్యలు ఎదురవకుండా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఇంజినీర్లు పేర్కొంటున్నారు. ఫలితంగా స్థానిక వనరుల వినియోగంతో నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు పంపిణీ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలి.


పదేళ్ల క్రితం బాయిలర్‌కు అనుసంధానించిన ఈఎస్‌పీ

మూడురోజుల్లో ఉత్పత్తి దశలోకి..

బాయిలర్ ట్యూబ్స్ పగిలిపోవడంతో విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ అయింది. పునరుద్ధరణ పనుల్లో ఇంజినీర్ల బృందం నిమగ్నమైంది. మూడురోజుల వ్యవధిలో కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. – పి.విజేందర్, బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్

గోపాల్‌రావుపల్లెలో విషాదం

- వడదెబ్బతో ఒకరు మృతి
- అంత్యక్రియల్లో ఇంకొకరు..
- అపస్మారక స్థితిలో మరో ఇద్దరు



అంతయ్య (ఫైల్) శంకరయ్య (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో మంగళవారం విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఒకరు వడదెబ్బతో మరణించగా అంత్యక్రియలకు తరలిస్తుండగా ఇంకొకరు మరణించారు. అదే సమయంలో మరో ఇద్దరు వడదెబ్బకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లడం కలకలం రేపింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన ములిగె అంతయ్య(50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం పనికివెళ్లి వడదెబ్బకు గురై మృతిచెందాడు. మంగళవారం అంతయ్య అంత్యక్రియలు నిర్వహిస్తుండగా డప్పు కొడుతున్న ఎడ్ల శ ంకరయ్య(55) గుండెపోటుకు గురై కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్ సీపీఆర్ చేసేందుకు ప్రయత్నిస్తూ వడదెబ్బకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని ఆస్పత్రికి తరలించగా ఆ వెంటనే ములిగె మహేశ్ వడదెబ్బకు గురికావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మృతుడు ములిగె అంతయ్య(55)కు భార్య లత, కొడుకు రంజిత్, కూతురు ఆకాంక్ష ఉన్నారు. మరో మృతుడు ఎడ్ల శంకరయ్య(55)కు భార్య వసంత, కొడుకులు అనిల్, వెంకటేశ్, కూతురు వందన ఉన్నారు. ఒకరి తరువాత మరొకరు మరణించడంతో గోపాల్‌రావుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మట్టిపెళ్లలు కూలి ఉపాధి కూలీ మృతి

- మరో ఆరుగురికి గాయాలు


రాజవ్వ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో మంగళవారం మట్టిపెళ్లలు కూలి ఉపాధిహామీ కూలీ ఒకరు మృతిచెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులు సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలోని కేశవరావుకుంటలో కొన్నిరోజులుగా ఉపాధిహామీలో భాగంగా మట్టి తవ్వకం పనులు జరుగుతున్నాయి. మంగళవారం 190 మంది కూలీలు పనులకు వెళ్లారు. ట్రాక్టర్‌లో మట్టిని నింపి పంపించి, మరో ట్రాక్టర్ రావడానికి ఐదు నిమిషాల సమయం పడుతుందని భావించి ఎండ నుంచి రక్షణకు కట్టకిందకు వెళ్లి నిల్చున్నారు. ఒక్కసారిగా మట్టిపెళ్లలు కూలిపడ్డాయి. అక్కడే పనిచేస్తున్న తోటి కూలీలు హుటాహుటిన పరుగెత్తుకొని వచ్చి మట్టిపెళ్లల్లో చిక్కుకున్న కూలీలను బయటకు లాగి ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో కర్నాల లహరి, కర్నాల శ్యామల, మారుపాక రాజవ్వ తీవ్రంగా గాయపడగా, పల్లం దేవవ్వ, ఎడ్ల రామవ్వ, వద్నాల అమృత, సందు చంద్రయ్య స్వల్పంగా గాయపడ్డారు. వీరిని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రికి చేరేలోపే మారుపాక రాజవ్వ మృతిచెందింది.

బావిలోపడి గొర్రెలకాపరి..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నారాయణపూర్ గ్రామానికి చెందిన గొర్రెలకాపరి వెల్పుల అంజయ్య(55) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మంగళవారం మృతి చెందాడని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. గొర్రెలను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లగా బావిలో కాలుజారి పడిమృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి భార్య కేతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

రియల్టర్ ఆత్మహత్య


ఆనందం(ఫైల్)

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన రియల్టర్ బైరగోని ఆనందం(47) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం.. ఆనందం తన కున్న భూమి అమ్మేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించాడు. ఆరు నెలలుగా వ్యాపారం నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వాటిని తీర్చే దారి కనిపించకపోవడంతో మంగళవారం వేకువజామున ఇంటి ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రమ, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిరిసిల్లలో విద్యార్థి..


చందు(ఫైల్)

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని వెంకంపేటకు చెందిన గోతం చందు(17) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చందు స్నేహితులు తెలిపిన వివరాలు.. ఇటీవల పదో తరగతి పాసైన చందు ఇంటర్ చదివేందుకు కరీంనగర్‌లోని ఓ కాలేజీలో చేరేందుకు సిద్ధమయ్యాడు. కానీ సదరు కాలేజీలో చేరేందుకు తనకు ఇష్టంలేదని స్నేహితులతో చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన గంగవ్వ

మల్లాపూర్(కోరుట్ల): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలో మంగళవారం పిచ్చికుక్క ఇద్దరిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు వాకిటి గంగవ్వ ఇంట్లో పడుకొని ఉండగా పిచ్చికుక్క ఒక్కసారిగా ఆమెపైకి దూకి ముఖంపై కరవడంతో తీవ్రంగా గాయపడింది. వృద్ధురాలి అరుపులకు సమీప ఇళ్లలోనివారు రావడంతో అక్కడి నుంచి పిచ్చికుక్క పరిగెడుతూ అడ్డుగా వచ్చిన మరో మహిళ రాజశ్రీని కరిచింది. తీవ్రంగా గాయపడిన గంగవ్వను మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పిచ్చి కుక్కలను పట్టుకోవాలని స్థానికులు కోరారు.

గుర్తు తెలియని మృతదేహం



ధర్మపురి: మండలంలోని రాయపట్నం గోదావరిలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు 40–45 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని జగిత్యాల మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాయికల్‌లో 40 తులాల బంగారం చోరీ


- రూ. లక్ష అపహరణ


వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన బుడికె విజయలక్ష్మి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడి సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష దొంగిలించారు. విజయలక్ష్మి కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల క్రితం సారంగాపూర్ మండలం పెంబట్ల, కోనాపూర్ దైవదర్శనానికి వెళ్లింది. మంగళవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. బీరువా తెరిచి ఉంది. అందులో బంగారంతోపాటు డబ్బులు కనిపించలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ఎస్సై అజయ్‌కుమార్ చేరుకుని పరిసరాలు పరిశీలించారు. విజయలక్ష్మి కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో పట్టణంలో దుకాణ నిర్మాణం కోసం వచ్చి వెళ్తున్నాడు. తల్లి వద్ద బంగారం, నగదు దాచిపెట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాగ్‌స్క్వాడ్స్, క్లూస్‌ం సభ్యులు ఫింగర్‌ప్రింట్స్ సేకరించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్ పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జడ ప్రకృతిని చైతన్య పర్చేది కవి

- పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్


పుస్తకం ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

సాక్షి, పెద్దపల్లి: మానవుల్లోని సహజ ఉద్వేగాలను పూలు ఆర్తి.. చందమామతో జరిపిన సంభాషణల్లో కవిత్వీకరించిన గంప ఉమాపతి దీర్ఘకవిత 'అలరుల.. అల్లరులు' ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగడం కవి భావన ప్రతిభకు నిదర్శనమని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన కవి గంప ఉమాపతి రచించిన 'అలరుల.. అల్లరులు' దీర్ఘ కవితా పుస్తకాన్ని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. జడ ప్రకృతికి చైతన్యం ఆపాదించి చెప్పగల సామర్థ్యం ప్రతిభగల కవులకే ఉంటుందన్నారు. గంప ఉమాపతి అదే కోవకు చెందిన వారని ప్రశంసించారు. కరీంనగర్‌లోని భవాని సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ యాత్రాచరిత్ర పరిశోధకుడు మచ్చ హరిదాసు మాట్లాడుతూ కొండ మీది నుంచి దూకే సెలయేరులాగా చైతన్యం తొణికిసలాడే అంతరంగం గంప ఉమాపతిదన్నారు. ఒక భక్తుడు భగవంతునిలో లీనమవడానికి పెట్టుకొన్న నివేదనగా 'అలరుల.. అల్లరులు' భాషిల్లుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రెండు సంస్థలతో 'జ్యోతిష్మతి' ఎంవోయూ


ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు

తిమ్మాపూర్: తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కాలేజీ యాజమాన్యం మంగళవారం హైదరాబాద్‌లోని టీహబ్, టాలెంట్ ఫామ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు తెలిపారు. టీహబ్, టాలెంట్ ఫామ్ సీఈవో రాహుల్‌పైత్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్లోబల్ ఏఐ అకాడమిక్స్ అలయన్స్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, పరిశోధన రంగంలో నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. ప్రతిభగల విద్యార్థులకు కళాశాల తరఫున ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఉన్నత ప్రమాణాలుగల కంపెనీలతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ ఏఐ అకడమిక్ అలయన్స్ ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. దీంతో నూతన ఆవిష్కరణలు పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని కళాశాలు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు కోరారు.

3 నుంచి ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కరీంనగర్: జూలై 3 నుంచి 12 వరకు నిర్వహించే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీలో భాగంగా 3 ఏఎస్‌సీ ఎయిర్‌ఫోర్స్ సంస్థ కాన్పూర్, 7 ఏఎస్‌సీ 1 కబ్బన్ రోడ్, బెంగళూరు (కర్ణాటక)లో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో క్లరికల్/టెక్నికల్ కేడర్‌లో ఉద్యోగ అవకాశం ఇప్పుడు 4 సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, అభ్యర్థుల్లో 25 శాతం మందికి శాశ్వత ప్రవేశం కల్పించబడునని పేర్కొన్నారు. అభ్యర్థులు (పురుషులు, మహిళలు) అవివాహితులై, 02 జనవరి 2004 నుంచి 02 జూలై 2007 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో మెట్రిక్యులేషన్/10వ తరగతి ఉత్తీర్ణత లేదా సమాన విద్య కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని, ఒక ప్రిపరేటరీ ట్యూన్, స్టాఫ్ నొటేషన్ /టాబ్లేచర్/టానిక్ సోల్ఫా/ హిందుస్తానీ, కర్నాటిక్ మ్యూజిక్ మొదలైన వాటిని ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 22 ఉదయం 11 గంటల నుంచి జూన్ 5 రాత్రి 11 గంటల వరకు వెబ్ పోర్టల్ https:// agnipathvayu. cdac. inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి పూర్తి వివరాలకు సదరు వెబ్‌సైట్‌లో సందర్శించాలని జిల్లా ఉపాధి అధికారి పేర్కొన్నారు.

సత్తాచాటిన సీవోఈ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దేవేందర్

తిమ్మాపూర్(మానకొండూర్): ఐఐటీ, జేఈఈ–2024 బీఆర్క్, బీప్లానింగ్ ఫలితాలు సోమవారం విడుదల కాగా అల్గునూర్‌లోని సీవోఈ (తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల ప్రతిభా కేంద్రం) విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ జి.దేవేందర్ మంగళవారం తెలిపారు. బీఆర్క్‌లో కె.అశ్రిత ఆల్ ఇండియా 86వ ర్యాంకు, బీప్లానింగ్‌లో బి.సన్నీ ఆల్ ఇండియా 94వ ర్యాంకు, ఎం.ఆదిత్య 111వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం


మమత (ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల): భర్తతో విడాకులు తీసుకున్న ఓ మహిళ మరో యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. చివరకు అతడి చేతిలోనే బలైన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్ర కారం.. సింగం మమత (38) మెట్‌పల్లి పట్టణంలో ని 20వ వార్డులో కూతురుతో కలిసి ఉంటోంది. భర్తతో విడాకులు తీసుకున్న ఆమె కొంతకాలంగా అ బ్దుల్ అఫ్సర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత మమత ఇంటికి అఫ్సర్ వెళ్లాడు. అనంతరం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అ క్కడే ఉన్న కత్తితో ఆమె కడుపులో పొడవగా, తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. డీఎస్పీ ఉమామహేశ్వర్, సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి మంగళవారం ఉదయం ఘటన స్థలాన్ని ప రిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యా దుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు జరిమానా

సాక్షి,పెద్దపల్లి: మానేరులో డిసిల్టేషన్ పేరిట ఇసుక తవ్వకాలు జరపడం చట్ట విరుద్ధమని ఎన్జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్), చెన్నై బెంచ్ మంగళవారం తీర్పు వెలువరించింది. గతంలో మానేరు నుంచి ఇసుక తరలింపును నిలిపివేయాలని ఎన్జీటీ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినా.. అమలు చేయడంలో రాష్ట్రయంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవరించిందని, అందుకుగాను ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు రూ.25కోట్ల చొప్పున జరిమానా విధించింది. ఈ జరిమానాను మూడు నెలల్లోగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెల్లించాలని ఆదేశించింది. అలాగే మానేరులో ఇసుక తవ్వకాలను నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీచేసింది. అమలు నివేదికను సమర్పించేందుకు ఈకేసు విచారణను సెప్టెంబర్ 23కు వాయిదా వేసింది. ఎన్జీటీ తీర్పుతో మానేరులో ఇసుక తరలింపునకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడినట్లయింది.





పవనసుత.. రామదూత

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధికి మంగళవారం వేలాది మంది తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. కాగా, స్వామివారి దర్శనం కాకముందే గర్భగుడి నుంచి భక్తులను సిబ్బంది నెట్టివేయడంపై అసహనం వ్యక్తం చేశారు. తాగునీరు లేక, ఉక్కపోతతో చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ సునీల్, అధికారులు ధర్మేందర్, జమున శ్రీనివాస్ తదితరులు అందుబాటులో ఉన్నారు.

గతేడాది



నేడు



జలకళ.. వెలవెల

కొత్తపల్లి మండల కేంద్రంలోని చెరువు ఏనాడూ ఇంతగా ఎండిపోలేదు. ఈ వేసవిలో మండుతున్న ఎండలకు ఒక్కసారిగా చెరువులోని నీరు తగ్గిపోవడంతో గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూలైలో కురిసిన వర్షాలకు మత్తడి దూకిన చెరువు ఈ ఏడాది మత్తడి దూకుతుందో లేదోనని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



పూజలు చేస్తున్న దీక్షాపరులు

యువతరం.. భక్తిమార్గం

- సనాతన ధర్మం వైపు అడుగులు
- హనుమాన్ మాలధారణతో ప్రశాంతత

కరీంనగర్‌కల్చరల్: ఆధునిక యుగంలో స్మార్ట్ ఫోన్, కంప్యూటర్, ఫేస్‌బుక్, ట్విట్టర్, నిత్యం పార్టీలలో గడిపే యువతలో మార్పు వచ్చింది. వారిలో ఆధ్యాత్మకత రోజురోజుకూ పెరుగుతోంది. సనాతన ధర్మం వైపు అడుగులు వేస్తున్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హనుమాన్ జయంతులకు మాల ధారణ చేస్తున్నారు. ఇటీవల స్వామి వారి సేవలో యువత ఎక్కువగా కనిపిస్తున్నారు. మండలం, అర్థ మండలం, ఏకాదశం దీక్షలు చేపడుతున్నారు. భజనలు సంకీర్తనలతో తమ వ్యవహారశైలిని చక్కదిద్దుకుంటున్నారు. దీక్ష నియమాలతో ఆరోగ్యం చేకూరుతుందని పేర్కొన్నారు.

కోరికలు నెరవేరాయి



కోరిన కోరికలు నెరవేరడంతో హనుమాన్ దీక్ష తీసుకున్న. నేను మూడో సారి మాలధారణ చేసుకున్నా. స్వామి వారి జన్మజన్మలకు హనుమాన్ మాలధారణ తీసుకుంటా. ఏకాగ్రతతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. - చిట్కూరి హరీశ్, కరీంనగర్

మనోవికాసానికి మాలధారణ



మనోవికాసానికి మాలధారణ ఎంతో దోహదపడుతుంది. హనుమాన్ మాల వేసుకొని నిత్యం ఆ స్వామి సేవలో తరించడం ఎంతో సంతోషనిస్తుంది. ఆరో సారి మాలధారణ చేసుకున్నా. మాలధారణలో ఉన్న రోజులు మనస్సు, శరీరం ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. - రాజ్‌కుమార్, కరీంనగర్

ప్రశాంతత లభిస్తుంది



దీక్షతో నాలో మానసికంగా ప్రశాంతతతో పాటు ఏకాగ్రత కూడా పెరిగింది. మూడో సారి హనుమాన్ మాల వేసుకున్నా. ఉదయం చన్నీటి స్నానం ఆచరించి స్వామివారిని భక్తి భావంతో కొలుస్తుంటా. అందరితో కలిసి పూజలు చేయడం, చాలీసా పారాయణంతో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. - తిరుమలేశ్, చామన్‌పల్లి

దీక్షతో ఆరోగ్యం



ఆంజనేయుడి మీద భక్తితో మాలధారణ వేసుకున్నా. స్వామిని కొలిస్తే ఏదైనా సాధించవచ్చనే నమ్మకం కలిగింది. అనుకున్న కోరికలు నెరవేరాయి. అందుకే ఆరోసారి మాలధారణ చేపట్టా. దీక్షతో ఆరోగ్యం బాగుంటుంది. - మామిడాల సుమంత్, కరీంనగర్

క్లుప్తంగా

62 సార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న బేతి మహేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్: ప్రమాదకర పరిస్థితుల్లో అత్యంత అరుదైన 'ఓ' నెగటివ్ గ్రూప్ రక్తాన్ని దానం చేస్తూ ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడడంతో పాటు నేటివరకు 62 సార్లు రక్తదానం చేశారు కరీంనగర్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బేతి మహేందర్ రెడ్డి. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌కి చెందిన పంజాల జలజ నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో డెలివరీ కోసం చికిత్స తీసుకుంటున్న సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా అత్యవసరంగా ఓ నెగటివ్ రక్తం కోసం మహేందర్‌రెడ్డికి తెలపగా వెంటనే వెళ్లి రక్తదానం చేశారు. 62 సార్లు రక్తదానం చేసిన మహేందర్ రెడ్డిని పలువురు అభినందించారు.

రేపు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6 గంటలకు 133వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రేకుర్తి లయోలా, ప్యారడైజ్ విద్యాసంస్థల ప్రాంతంలోని పుష్పవల్లి ఫంక్షన్ హాల్ ఎదురుగా వీధిలోని వేంకటేశ్వరనగర్ ఎస్సారార్ కళాశాల హిందీ విభాగం సహాయాచార్యుడు వాసాల వరప్రసాద్ ఇంటి మిద్దెపై నిర్వహించే ఎన్నీల ముచ్చట్లులో కవులు, రచయితలు తమ స్వీయ రచనలతో సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

బాధితుడికి పరామర్శ



అంజయ్యను పరామర్శిస్తున్న శంకర్‌గౌడ్

కరీంనగర్‌రూరల్: గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన గీత కార్మికుడు గుర్రం అంజయ్య గౌడ్ ఈనెల 16న ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయపడటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం బాధితుడు అంజయ్యను సర్దార్ సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వెన్నుపూస, పక్కటెముకలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన గీత కార్మికులకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కొన్ని నెలల నుంచి ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడంతో గీతకార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎక్సైజ్ అధికారులు విచారణ చేసి కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఒకే ఒక్కడు

- ఆహార తనిఖీ తూచ్
- ఒక జూనియర్ అసిస్టెంటే.. సదరు విభాగం ఖాళీ
- తనిఖీలు అరకొరే.. గాలిలో ప్రజల ప్రాణాలు
- విజృంభిస్తున్న కల్తీ మాఫియా



ఫుడ్ సేఫ్టీ కార్యాయలం

కార్యాలయంలో మంజూరు పోస్టులు

గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్	1
ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్	2
జూనియర్ అసిస్టెంట్	1
క్లర్క్	1
అటెండర్లు	2

విధులు నిర్వహించేది:
గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్: సునీత (ఇన్‌చార్జి)
జూనియర్ అసిస్టెంట్: శ్రీశైలం(రెగ్యులర్)

కరీంనగర్ అర్బన్: ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలేనా..? కల్తీ మాఫియా వలలో చిక్కాల్సిందేనా...అంటే పరిస్థితులను చూస్తే అదే బోధపడుతోంది. మానవ మనుగడకు ఆహారమే కీలకం. కానీ ప్రజల ప్రాణాలకు భరోసాగా ఆహార ఉత్పత్తుల విక్రయాలు జరగాల్సి ఉండగా కల్తీ రాజ్యమేలుతోంది. అలంకారప్రాయంగా కార్యాలయం మిగలడంతో కల్తీరాయుళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. తనిఖీలతో అక్రమార్కులను నిలువరించాల్సిన యంత్రాంగానికే చికిత్స చేయాల్సి రావడం దారుణ పరిణామం. కార్యాలయంలోనే ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉండగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఇన్‌చార్జి మాత్రమే. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందాల్సి ఉండగా ఏనాడో విలువలకు శిలువేశారు వ్యాపారులు. జిల్లా కేంద్ర జనాభా 3లక్షలకు పైమాటే. జిల్లా జనాభా 10లక్షలు కాగా ఒక్క అధికారి కూడా శాశ్వతంగా లేరు.

ఖాళీలతో సతమతం.. అక్రమార్కుల రాజ్యం

ఆహార తనిఖీ విభాగం ప్రతీనెలలో తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు ఒక్కొక్కరికీ నిర్ణీత లక్ష్యముంటుంది. కానీ గత నాలుగేళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక కార్యాలయం వెలవెలబోతుంది. జూనియర్ అసిస్టెంట్ శ్రీశైలం రెగ్యులర్ ఉద్యోగి కాగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా కామారెడ్డి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సునీత ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక క్లర్క్, ఇద్దరు అటెండర్లు కార్యాలయంలో విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే 1985లో అప్పటి జనాభా ప్రతిపాదికన పోస్టులను మంజూరు చేయగా నేడు జనాభా పదింతలు పెరిగినప్పటికీ అదే విధానం కొనసాగడం విడ్డూరం. అప్పటి మంజూరు పోస్టుల ప్రకారం అధికారులున్నారా.. అంటే అదీ లేదు. దీంతో ఆహార తనిఖీ ప్రక్రియ అటకెక్కడంతో కల్తీ మాఫియా ప్రజల ప్రాణాలతో ఆటలాడుతోంది. ఇన్‌చార్జి అధికారి సునీత ఇతర జిల్లా బాధ్యతలను నిర్వహిస్తుండటంతో ఎప్పుడొస్తారో.. ఎప్పుడుంటారో తెలియని పరిస్థితి. ఇక జిల్లాలో తనిఖీలు కలే.

అనుమతుల్లోనూ మతలబు

ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించిన అనుమతుల జారీలో ఆహార తనిఖీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం కమర్షియల్ టాక్స్ లైసెన్స్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, రూ.100 చాలన్, వ్యాపార పరిణామానికి సంబంధించిన స్వీయ నిర్ణయం, అఫిడవిట్, దుకాణ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెలరోజుల్లోగా అనుమతి జారీ చేయాలి. అయితే దరఖాస్తును నెలరోజుల పాటు తిరస్కరించకుండా ఉంచితే దానిని ఆమోదించినట్లే. కానీ అనుమతుల జారీలో మామూళ్లదే పైచేయిగా మారిందని తెలుస్తోంది. ఏవీ పరిశీలించకుండానే అనుమతులను జారీ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక దుకాణాలవారీగా వారి వారి విక్రయాలను బట్టి విశ్రాంత ఉద్యోగి మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక వీటికి సంబంధించిన శాఖల్లో కేవలం ఆహార తనిఖీ మినహా మిగతావేవీ కన్నెత్తిచూడటం లేదు.

సేకరించిన నమూనాల్లో గరిష్టం అన్‌సేఫ్

2019లో 120 నమూనాలు సేకరించారు. ఇందులో కార్పొరేట్ సూపర్ బజార్లలోనూ కల్తీ వ్యాపారం జరుగుతోందని తేలింది. సదరు నమూనాల్లో 40 ఆరోగ్యానికి హానికరమని ఫలితాలొచ్చాయ్. ముఖ్యంగా పండ్లు, నూనె, తినుబండరాల్లో హానికరమన్న ఫలితాలు రావడం దిగ్భ్రాంతికరం. నాణ్యత ప్రమాణాలు లేకపోవడం, మిస్‌బ్రాండ్ కేసులు నమోదవడం జిల్లాలో జరుగుతున్న కల్తీ, అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. నగరంలోని గంజ్, భాగ్యనగర్, శాస్త్రి రోడ్డు, గణేశ్‌నగర్, రాంపూర్ తదితర ప్రాంతాల్లో 6 నమూనాలు తీసుకోగా అన్నింటా ఆరోగ్యకరం కాదని తేలింది. జిల్లాకేంద్రంలో సుమారుగా 500లకు పైగా నూనె దుకాణాలున్నాయి. ఇందులో అనుమతి లేనివి కోకొల్లలు కాగా ఏనాడు వీటిపై దాడులు చేసిన దాఖలాలు లేవు.

రైతుల సమస్యలపై బీజేపీ నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ టౌన్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మంగళవారం బీజేపీ రణభేరి పేరిట పార్టీ జిల్లా కార్యాలయంలో నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల కాలం గడిచిన రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మండిపడ్డారు. ఇటీవల అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నం చేయడం లేద అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో పార్టీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, బాస సత్యనారాయణ రావు, వాసాల రమేశ్, రాజేంద్ర ప్రసాద్, శివకుమార్ నరహరి లక్ష్మారెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, దుర్శెట్టి సంపత్, దుర్శేడ్ అనూప్ కుమార్, బండ రమణారెడ్డి, కొలిపాక శ్రీనివాస్, సుధాకర్ పటేల్, బండారి గాయత్రి, రాగి సత్యనారాయణ, జానపట్ల స్వామి, తిరుమల్‌రెడ్డి మాడిశెట్టి సంతోష్ కుమార్ చిట్టిబాబు, దూడం శ్రీనివాస్, అడిచెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

'యువకుడిపై దాడి ఘటనలో ప్రమేయం లేదు'



మాట్లాడుతున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ప్రేమ వ్యవహారంలో దళిత యువకుడిపై దాడి ఘటనలో ఎంఐఎం నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ ప్రమేయం లేదని ఎంఐఎం పార్టీ దళిత నాయకులు బెజ్జంకి సుధాకర్, బాలరాజు, సురేశ్, రాజు, నితీశ్, రజని, లహరి, చంద్రయ్య, మధు, వెంకన్న, శ్యాం, గోపీ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ ముస్లింల మధ్య వైషమ్యాలను సృష్టించేందుకే కొంతమంది అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అబ్బాస్ సమీ ఇంటిలో ఎలాంటి దాడి జరగలేదని, ఏదైన సమస్య వస్తే ఇరువర్గాలను కూర్చోబెట్టి పరిష్కరించే వ్యక్తి అన్నారు. ఈ సంఘటనపై మరోసారి విచారణ జరిపి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దాడికి సంబంధం లేని అబ్బాస్ సమీపై పెట్టిన కేసును ఎత్తేయాలని పోలీసు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు, ఏబీ స్విచ్‌ల మరమ్మతు, కొత్త లైన్ల పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ గాంధీ, వరలక్ష్మీ ఫీడర్ల పరిధిలోని గాంధీరోడ్, హుస్సేనిపుర, శర్మనగర్, అశోక్‌నగర్, సీతారాంపూర్, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ -1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లాల విభజన పునర్ సమీక్షించాలి



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో గడీల పాలన సాగించిన కేసీఆర్ తన ఇష్టారాజ్య పాలనతో నిబద్ధత లేకుండా చేసిన జిల్లాల విభజనపై కమిషన్ ఏర్పాటు చేసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను సరిచేయాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ జిల్లాను లెక్కపత్రం లేకుండా ఎనిమిది ముక్కలు చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లాల విభజనతో చరిత్రాత్మక ఉద్యమాల ఖిల్లా కరీంనగర్ జిల్లా తన ఉనికిని కోల్పోయి రెక్కలు తెగిన పక్షిలా అయిందన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలనే జిల్లాలుగా మారిస్తే సరిపోయేదన్నారు. కేసీఆర్ సొంత తెలివితో చేసిన జిల్లాల విభజనపై కమిషన్ ఏర్పాటు చేసి సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గజ్జల ఆనందరావు, బోయినపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, గజ్జల రవీందర్, బాపురెడ్డి చంద్రశేఖర్, రామ్మూర్తి రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు మార్కెటింగ్‌పై సమావేశం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలోని రైతు సంక్షేమ సంఘం భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు అధిక ఉత్పత్తి, మార్కెటింగ్ మెలకువలపై రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వాహకులు, ప్రగతిశీల రైతులకు సమావేశం నిర్వహిస్తున్న కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి.సుగుణాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం నాగులమల్యాలలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం హోమం, పుణ్యాహవచనం అంకురార్పణ, అభిషేకం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టనున్నారు. 23న హోమం, ఎదుర్కోళ్లు చేపట్టిన అనంతరం ఉదయం 11.57లకు అభిజిత్ లగ్న సుముహూర్తన శ్రీలక్ష్మీనరసిహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అనంతరం ఒడిబియ్యం, మంగళహారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడతారు. సాయంత్రం స్వామి గిరిప్రదక్షణ నిర్వహిస్తారు. 24న సాయంత్రం 5 గంటలకు బండ్ల తిరుగుట (శకటోత్సవం) నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ మహాకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నగదు, వస్తు రూపేణా పాలు పంచుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

'యాత్ర'కు తరలిన నాయకులు



యాత్రకు బయలుదేరిన నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఆర్యవైశ్య చైతన్య పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు బొద్దుకూరి కిరణ్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో చేపట్టిన నరేంద్రమోదీ విజయసంకల్ప యాత్రలో పాల్గొనేందుకు కరీంనగర్ నుంచి పలువురు వైశ్య సంఘాల నాయకులు బయలుదేరినట్లు బీజేపీ కరీంనగర్ నార్త్ జోన్ ఉపాధ్యక్షుడు, వైశ్య సేవా కేంద్రం కమిటీ సభ్యుడు కైలాస నవీన్ తెలిపారు. మంచిర్యాలలో ప్రారంభమైన యాత్ర జూన్ 4న కేదార్‌నాథ్‌లో ముగుస్తుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా నరేంద్రమోదీ, దేశవ్యాప్త పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 21 పుణ్యక్షేత్రాల్లో పూజలు జరిపించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ నుంచి సిద్ది సురేశ్, వెల్దండి వినోద్, ఐనంపూరి వేణు యాత్రలో పాల్గొననున్నట్లు వివరించారు.

నేడు వేదభవనంలో నమ్మాళ్వారుల తిరునక్షత్రం

కరీంనగర్‌కల్చరల్: నగర శివారులోని వేదభవనంలో బుధవారం 12 మంది ఆళ్వారులలో ఒకరైన నమ్మాళ్వార్ తిరునక్షత్రం (జయంతి) నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె.గౌతమ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సేవాకాలం, కోయిల్ తిరువాయిమొజి పారాయణం, నమ్మాళ్వారులకు అభిషేకం, పెద్దల ద్వారా నమ్మాళ్వారులు వాగ్వైభవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

సప్తగిరికాలనీ: పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జాలి మహేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పీఆర్టీయూటీఎస్ సంఘం కృషి మేరకు పట్టభద్రుల ఎన్నికల కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉద్యోగ విరమణ వయస్సు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంపుదల చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనమండలి ఉపఎన్నికల్లో పీఆర్టీయూ సంఘం గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించవల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయించేలా కృషి చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ప్రభుత్వం సమస్యలన్నీ పరిష్కరిస్తే సంతోషంగా పట్టభద్రులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని బలుపరుస్తారని పేర్కొన్నారు.

ఎన్‌జీటీ తీర్పు చెంపపెట్టు

కరీంనగర్: మానేరు నదిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లు పర్యావరణ చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయని జాతీయ హరిత న్యాయస్థానం(ఎన్‌జీటీ) ఇచ్చిన తీర్పు ఇసుక అక్రమ దందా చేసే వారికి చెంపపెట్టు అని మానేరు పరిరక్షణ సమితి సభ్యుడు నంది సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందుకు బాధ్యత వహిస్తూ వారంతా రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్, టీఎస్ఎండీసీ విభాగాలకు చెరో రూ.25 కోట్ల చొప్పున మొత్తంగా రూ.50 కోట్లు చెల్లించాలని ఆదేశించిందని వెల్లడించారు.



హనుమాన్ చాలీసా పారాయణం

కొత్తపల్లి: కమాన్‌పూర్ గ్రామ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో గల శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ దీక్షాపరులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ప్రత్యేక పూజలు, హవనం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పట్టెం గంగయ్య, జినుక సంపత్, కొడిమ్యాల మహిపాల్, మేడి శ్రీనివాస్, బోండ్ల శ్యామ్, బోనాల సంపత్, రుద్రసాయి, బోండ్ల భార్గవ్, జిట్టవేని సంపత్, తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన సమ్మర్ క్యాంప్

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని భగవతి, అర్విన్‌ట్రీ పాఠశాలలో నెల రోజులుగా నిర్వహించిన సమ్మర్ డ్యాన్స్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. హాజరైన చిన్నారులకు క్లాసికల్, వెస్ట్రన్, హిప్‌హప్, జుంబాడాన్స్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన జానపద నృత్యాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బి రమణారావు, కరస్పాండెంట్ విజయలక్ష్మీ, డ్యాన్స్ మాస్టర్లు గోవింద్‌తో పాటు తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుడిగా సీఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నందుకు జైలు శిక్ష అనుభవించారు. ఏడేళ్ల తరువాత ఆయన మీదే పోటీ చేస్తున్నారు. ఆ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ కాగా నాటి విద్యార్థి దివ్యాంశు బుధిరాజా. వీరిద్దరి ఆసక్తికర పోరుకు హరియాణాలోని కర్నాల్ లోక్‌సభ స్థానం వేదికగా మారింది. మాజీ సీఎం ఖట్టర్ బీజేపీ నుంచి, బుధిరాజా కాంగ్రెస్ టికెట్‌పై అమీతుమీ తేల్చుకోనున్నారు. ఆరితేరిన నాయకుడు, విద్యార్థి ఉద్యమ కెరటం.. వీరిలో గెలుపెవరిదన్నది ఆసక్తిగా మారింది. కర్నాల్‌లో 25న ఆరో విడతలో పోలింగ్ జరగనుంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

కర్నాల్ లోక్‌సభ స్థానంలో 1952 నుంచి 2009 దాకా కాంగ్రెస్ ఏకంగా 11 సార్లు గెలుపొందింది. 1996, 99 మాత్రమే మినహాయింపు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో 9 అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్నాల్‌లో 68.31 శాతం ఓటింగ్ నమోదైంది. బీజేపీ అభ్యర్థి సంజయ్ భాటియా ఏకంగా ఆరు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



నాడు అడ్డుకుని అరెస్టయ్యాడు.. నేడు ప్రత్యర్థిగా తొడగొడుతున్నాడు!

మాజీ సీఎం వర్సెస్ మాజీ ఖైదీ

- కర్నాల్ లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు
- అభివృద్ధి ధీమాతో మనోహర్‌లాల్ ఖట్టర్
- పోరాటాలు గెలిపిస్తాయంటున్న దివ్యాంశు
- బీజేపీకి తాకుతున్న రైతు ఉద్యమ సెగ

వివాదాల సీఎం...

ఆరెస్సెస్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దాకా ఎదిగిన ఖట్టర్‌కు ఇవి తొలి లోక్‌సభ ఎన్నికలు. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాల్ నుంచే గెలిచారాయన. తొమ్మిదేళ్లు సీఎంగా చేశారు. అత్యాచారాలు, మహిళల సమస్యలపై ఖట్టర్ వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ''మహిళలపై అత్యాచారాలు, ఈవ్ టీజింగ్‌గా చెబుతున్న ఉదంతాల్లో 90 శాతం వారి సమ్మతితో జరుగుతున్నవే. విభేదాలొచ్చి విడిపోయాక అమ్మాయిలు కేసులు పెడుతున్నారు. ఈ ధోరణికి కోర్టులే అడ్డుకట్ట వేయాలి'' అనే వ్యాఖ్యలతో 2018లో వివాదాస్పదమయ్యారు. 2014 ఎన్నికలప్పుడూ మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శలకు గురయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికలకు ముందు సీట్ల పంపకంపై విభేదాలతో బీజేపీకి జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) గుడ్‌బై చెప్పింది. అధికార సంకీర్ణం నుంచీ బయటికొచ్చింది. దాంతో మార్చిలో ఖట్టర్ రాజీనామా చేశారు. 2014, 2019లో ఉన్న సానుకూలత ఆయనకు ఇప్పుడు కనిపించడం లేదు.

పోరాటాల పిడికిలి...

30 ఏళ్ల బుధిరాజా సోనిపట్ జిల్లా గోహనాలో పంజాబీ కుటుంబంలో జన్మించారు. తండ్రి క్లర్క్. తల్లి స్కూల్ టీచర్. 2017లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షునిగా ఉండగా పంచకుల ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల బృంద సారథిగా ఖట్టర్ కాన్వాయ్‌ను అడ్డుకుని అరెస్టయ్యారు. అంతకుముందు 2014లో పంజాబ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ కౌన్సిల్ అధ్యక్షునిగా ఉన్నారు. 2021లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ చీఫ్ అయ్యారు. ఎనిమిదేళ్లుగా విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఉద్యమిస్తున్నారు. కాంగ్రెస్ అనూహ్యంగా కర్నాల్ టికెటివ్వడంతో ఖట్టర్‌ను ఢీకొంటున్నారు. ''మా కుటుంబంలో ఎవరూ ఇంతవరకు కనీసం సర్పంచ్ ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. ఒక సాధారణ యువకుడికి ఇలాంటి అవకాశం లభించినందుకు యువత సంతోషంగా ఉంది'' అంటున్నారు. కర్నాల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయవాదులూ బుధిరాజాకు మద్దతు తెలిపారు. మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా, ఎంపీ దీపేందర్ హుడా ఆశీర్వాదం, ఓటు బ్యాంకు మరింత కలిసొచ్చేవే. మోదీ సర్కారుపై రైతుల ఆగ్రహం తనను విజయతీరాలకు చేరుస్తుందని బుధిరాజా చెబుతున్నారు.

కీలకం

ఇవీ సమస్యలు...!

కర్నాల్, పానిపట్ జిల్లాలు జాతీయ రాజధాని ప్రాంత పరిధిలో ఉన్నాయి. దాంతో వాటిపై వాయు నాణ్యత ఆంక్షలున్నాయి. ఇది అభివృద్ధికి ఆటంకంగా ఉందని, రెండు జిల్లాలను ఎన్‌సీఆర్ పరిధి నుంచి తప్పించాలని స్థానిక పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. స్టార్టప్ ప్రాజెక్టులు, స్మార్ట్ సిటీ వంటి పలు సమస్యలూ ముందున్నాయి.

పంజాబ్ ప్రచారంలో... కనిపించని దిగ్గజాలు

సాక్షి, న్యూఢిల్లీ: పంజాబ్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నా పలువురు ప్రముఖ నాయకులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పోటీకి కూడా దూరంగానే ఉన్నారు. మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్, పీసీసీ మాజీ చీఫ్, స్టార్ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ వంటివారు ఈ జాబితాలో ముఖ్యులు. అమరీందర్ సింగ్ 2021లో సీఎం పదవి వీడాక పంజాబ్ రాజకీయాల్లో పెద్దగా చురుగ్గా లేరు. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అయినా ప్రచారానికి మాత్రం దూరంగా ఉన్నారు. ఆయన భార్య ప్రణీత్ కౌర్ పటియాలా నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఆమె తరఫున కూడా ప్రచారం చేయడం లేదు. ప్రణీత్ నామినేషన్ దాఖలు రోజు కూడా కనిపించలేదు. అమృత్‌సర్ ఎంపీ సిద్ధూ కూడా ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో వ్యాఖ్యాతగా బిజీగా ఉన్నారు. భార్య నవజోత్ కౌర్ క్యాన్సర్‌తో పోరాడుతుండటంతో సమయమంతా ఆమెకే కేటాయిస్తున్నారు. అకాలీదళ్‌ను వీడి ఇటీవల మళ్లీ అదే పార్టీలో చేరిన అగ్ర నేత సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా కూడా అలకబూని ప్రచారానికి దూరంగానే ఉన్నారు. కుమారుడు పర్మీందర్‌కు పార్టీ టికెటివ్వకపోవడమే ఇందుకు కారణం. ప్రముఖ నటుడు, ఆప్ నాయకుడు గురుప్రీత్ సింగ్ ఘుగ్గీ కూడా రాజకీయ జీవితానికి దూరం జరిగి మళ్లీ తెర‌పై కనిపిస్తున్నారు. బీజేపీలో చేరిన మాజీ మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ కూడా ఆపరేషన్ నేపథ్యంలో ప్రచారానికి దూరంగానే ఉన్నారు. ఒకప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలకనేత అయిన జగ్మీత్ సింగ్ బ్రార్ కూడా ప్రచారంలో ఎక్కడా కన్పించడం లేదు.



అమరీందర్, సిద్ధూ

హస్తినలో తెలుగు ఓటర్ల చుట్టూ నేతల ప్రదక్షిణం

ఢిల్లీలో 5.5 శాతం తెలుగు ఓటర్లు

- పలుచోట్ల గెలుపోటములపై ప్రభావం
- దాంతో తెలుగు నేతల ముమ్మర ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తెలుగు ఓటర్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఢిల్లీలో తెలుగు ఓటర్లు ఐదున్నర శాతం దాకా ఉన్నారు. కనీసం 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్నారు. దాంతో తెలుగు ప్రజలను ఆకర్షించి వారి ఓట్లను రాబట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి. ఒకవైపు అభ్యర్థులు తెలుగు ప్రజలతో ముఖాముఖి మాట్లాడుతుంటే మరోవైపు తెలుగు రాష్ట్రాల నేతలు కూడా హస్తినలో తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలకు మే 25న ఆరో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

1.46 కోట్ల మంది

ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాల పరిధిలో 1.46 కోట్ల మంది ఓటర్లున్నారు. వారిలో తెలుగు ఓటర్లు 5.5 శాతం దాకా (సుమారు 8 లక్షలు) ఉంటారు. కేంద్ర ప్రభుత్వోద్యోగాలతో పాటు ఇతర ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ పలు రంగాల్లో స్థిరపడ్డారు. మయూర్ విహార్ (మూడు ఫేజ్‌లు), దిల్షాద్ గార్డెన్, ఆర్కేపురం, మెహ్రౌలీ, షాహదరా, లజ్‌పత్‌నగర్, సరితా విహార్, ద్వారక, వికాస్‌పురి, కేశవపురం, రోహిణి, కాల్కాజీ, మునిర్కా, ఉత్తమ్‌నగర్, వికాస్‌పురి, వసంత్ విహార్ తదితర ప్రాంతాల్లో తెలుగు వారి జనాభా ఎక్కువ. ఈ నేపథ్యంలో తెలంగాణ మంత్రి సీతక్క ఈశాన్య ఢిల్లీలో కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్‌కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను ఓటర్లకు వివరించారు.

త్వరలో మరికొందరు నేతలు

ఢిల్లీలో మూడు రోజుల్లో లోక్‌సభ ఎన్నికలుండటంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నేతలు ప్రచారానికి రానున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే.



తెలుగువారితో బాసురీ మీట్ అండ్ గ్రీట్

బీజేపీ దివంగత నేత సుష్మాస్వరాజ్ కూతురు బాసురీ స్వరాజ్ ఇటీవల తెలుగు ప్రజలతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. తనను గెలిపిస్తే పార్లమెంటులో తెలుగు ప్రజల గొంతుక అవుతానన్నారు. తెలుగు వంటకాలంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. తన తల్లిని ఆదరించినట్టుగానే తనను కూడా ఆదరించి ఆశీర్వదించాలని తెలుగు ప్రజలను కోరారు. కార్యక్రమంలో పలువురు తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాసురీ న్యూఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా సోమవారం ఢిల్లీలో తెలుగు ప్రాబల్య ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంపై కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్న విషయాన్ని గమనించాలని వారికి సూచించారు. ఈ కేసులో కవిత అరెస్టును సమర్థించిన కాంగ్రెస్ ఢిల్లీలో మాత్రం కేజ్రీవాల్ పార్టీకి మద్దతిస్తోందని విమర్శించారు.

పేరు మరిచిన మహిళలు!

తొలి సార్వత్రిక ఎన్నికల్లో వింత

- ఓటర్ల జాబితాలో పేర్లు లేని వైనం
- వైఫాఫ్, డాటరాఫ్ అంటూ నమోదు

ఈగ ఇల్లలుకుతూ తన పేరు మరిచిపోయిన కథ అందరికీ తెలుసు. 1951-52లో మన దేశంలో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లోనూ మహిళల విషయంలో ఇలాంటి 'ఈగ' తరహా కథే జరిగింది...

మొదటి సార్వత్రిక ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో పడ్డ కేంద్ర ఎన్నికల సంఘానికి చిత్రమైన సమస్య ఎదురైంది. చాలా రాష్ట్రాల్లో మహిళా ఓటర్లు తమ సొంత పేర్లు నమోదు చేసుకోలేదు! బదులుగా తమ కుటుంబంలోని పురుష సభ్యులతో తమ సంబంధాన్ని బట్టి ఫలానా వారి భార్యను, ఫలానా ఆయన కూతురును అని నమోదు చేసుకున్నారు. ఒకరూ ఇద్దరూ కాదు.. నాడు దేశవ్యాప్తంగా నమోదైన 8 కోట్ల మంది మహిళా ఓటర్లలో ఏకంగా 2.8 కోట్ల మంది ఇలా వైఫాఫ్, డాటరాఫ్ అని మాత్రమే నమోదు చేసుకున్నారు. ఇలాంటి కేసులు ఎక్కువగా బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యభారత్, రాజస్తాన్, వింధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చాయి. దాంతో ఎన్నికల సంఘానికి పెద్ద చిక్కు వచ్చిపడింది. అలాంటి మహిళా ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. సొంత పేర్లతో తిరిగి నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించారు. పురుష ఓటర్లతో ఉన్న సంబంధపరంగా కాకుండా విధిగా మహిళా ఓటర్ల పేరుతోనే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పేరు చెప్పడానికి నిరాకరించిన మహిళను ఓటరుగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. ఇందుకోసం బిహార్‌కు ఒక నెల ప్రత్యేక గడువిచ్చారు. ఈ పొడిగింపు బాగా ఉపయోగపడింది. ఆ గడువులో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. రాజస్తాన్‌లో మాత్రం పొడిగింపు ఇచ్చినా అంతంత స్పందనే వచ్చింది. దాంతో అక్కడ చాలామంది మహిళా ఓటర్లను తొలగించాల్సి వచ్చింది!

తొలి ఎన్నికల్లో 17.3 కోట్ల పై చిలుకు ఓటర్లలో మహిళలు దాదాపు 45 శాతమున్నారు. వారికోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 27,527 పింక్ బూత్‌లను మహిళా ఓటర్లకు రిజర్వ్ చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచడానికి దేశ తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ రేడియోలో వరుస ప్రసంగాలు, చర్చలు చేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితాలో మొత్తం 47.1 కోట్ల మంది మహిళలున్నారు. 12 రాష్ట్రాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆంధ్రప్రదేశ్

అంతకు మించి అరాచకం!

ఓట్ల లెక్కింపు రోజు విధ్వంసానికి పచ్చ ముఠాల ప్లాన్

పోలింగ్ రోజు హింసకు మించి భయోత్పాతం సృష్టించే పన్నాగం

సాక్షి, అమరావతి: ఎన్నికల హింసకు తెగబడ్డ పచ్చ ముఠాలు ఈ కుట్రలకు పదును పెడుతుండటం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. పోలింగ్ సందర్భంగా యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన టీడీపీ రౌడీ మూకలు ఓట్ల లెక్కింపు రోజు మరింత బరి తెగించేందుకు పథకం రూపొందించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేసిన వారితోపాటు అదుపులోకి తీసుకున్న వారిలో 75 శాతం మంది టీడీపీకి చెందినవారే కావడం ఆ పార్టీ అధినేత చంద్రబాబు కుట్రలకు అద్దంపడుతోంది. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అలజడులు రేకెత్తించడం, జూన్ 4న ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బీభత్సం సృష్టించేందుకు భారీ కుట్రలకు తెర తీశాయి. పచ్చ ముఠాలు, అల్లరి మూకలు విసురుతున్న సవాల్‌ను సమర్థంగా తిప్పికొట్టేందుకు పోలీసు శాఖ అప్రమత్తమైంది. పోలింగ్ సందర్భంగా పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో టీడీపీ గూండాలు అరాచకాలకు తెగబడి భయానక వాతావరణాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ మూడు జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆయా చోట్ల విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు కార్డన్ – సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ పటిష్ట నిఘా ఏర్పాట్లు చేశారు.

బదిలీలతో అల్లరి మూకల అరాచకం..

రాష్ట్రంలో పోలింగ్ రోజు, అనంతరం టీడీపీ రౌడీమూకలు యథేచ్ఛగా విధ్వంస కాండకు తెగబడ్డాయి. చంద్రబాబు, పురందేశ్వరిఈసీపై ఒత్తిడి తెచ్చి పల్నాడు, ప్రకాశం, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పోలీసు అధికారులను బదిలీ చేయించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుని పన్నాగాన్ని అమలు చేశారు.



ప్రధానంగా పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో టీడీపీ రౌడీమూకలు కర్రలు, కత్తులు, రాడ్లతో విరుచుకుపడటంతోపాటు బాంబు దాడులకు కూడా తెగబడి బీభత్సం సృష్టించాయి.

గూండాగిరీ అంతా పచ్చముఠాదే

పోలింగ్‌కు ముందు, అనంతరం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినవారిని గుర్తించి పోలీసు శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. ఎన్నికల ముందు నమోదైన కేసులతో ప్రమేయం ఉన్న 1,522 మందిని గుర్తించి కొందరిని అరెస్ట్ చేసింది. మిగిలిన వారికి 41 సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేసింది. వీరితో దాదాపు 1,300 మంది టీడీపీ వర్గీయులే కావడం గమనార్హం. ఇక పోలింగ్ రోజు దాడులు, ఘర్షణల కేసుల్లో ప్రమేయం ఉన్న 2,790 మందిని గుర్తించగా కొందరిని అరెస్టు చేశారు. మిగిలిన వారికి 41 సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చారు. పోలింగ్ రోజుల అరాచకాలకు తెగబడ్డ వారిలో దాదాపు 2,400 మంది టీడీపీకి చెందిన వారే కావడం ఆ పార్టీ కుట్రలను బట్టబయలు చేస్తోంది. పోలీసుశాఖ గత మూడు రోజులుగా 301 సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ – సెర్చ్ ఆపరేషన్ల ద్వారా విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఎటువంటి పత్రాలు లేని 1,104 వాహనాలను జప్తు చేసింది.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద టీడీపీ మూకలు అరాచకాలకు తెగబడే ప్రమాదం ఉన్నందున పటిష్ట బందోబస్తు కల్పించారు. 350 స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన ఈవీఎంలకు కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు 24/7 మూడంచెల భద్రతతో పహరా కాస్తున్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలను సమకూర్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద వెయ్యికి పైగా అధునాతన ఫేస్ రికగ్నిజేషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. అన్ని స్ట్రాంగ్‌రూమ్‌లను అనుసంధానిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రదేశానికి 2 కి.మీ. పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించి డ్రోన్లు, బెలూన్లను ఎగురవేయడాన్ని నిషేధించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టం

ఓట్ల లెక్కింపు చేపట్టే కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్ని కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అంశంపై ఈసీ ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. రాష్ట్రంలో 33 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. లెక్కింపు త్వరగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాలను పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈసీకి ప్రతిపాదించారు. పోలింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు జరిగిన పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఓట్ల లెక్కింపు రోజు విజయోత్సవ ర్యాలీలను నిషేధించారు.

అమలులో నిషేధాజ్ఞలు

స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలున్న నగరాలు, పట్టణాల్లో ఓట్ల లెక్కింపు ముగిసేవరకూ వరకూ పోలీసు శాఖ నిషేధాజ్ఞలను విధించింది. 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 144 అమలులో ఉంటాయని ప్రకటించింది.

ప్రజలు సహకరించాలి: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అసాంఘిక శక్తులను కఠినంగా అణచివేస్తాం. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. అందుకు ప్రజలు కూడా సహకరించాలి. ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దు. సంయమనం పాటించాలి. చట్టవ్యతిరేక, అసాంఘిక శక్తుల కదలికల గురించి టోల్ ఫ్రీ నంబర్లు 100, 112లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమివ్వాలి.

ఏపీలో మరో ఐదు మెడికల్ కాలేజీలు

750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా మరో ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు 2024–25 విద్యా సంవత్సరంలో ప్రారంభం కానున్నాయి. ఈ దిశగా సీఎం జగన్ ప్రభుత్వం చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకుంది. పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లెలో కొత్తగా వైద్య కళాశాలలను ప్రారంభించి ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రాబట్టేలా వైద్య శాఖ కసరత్తు చేస్తోంది. ఈమేరకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) త్వరలో ఐదు చోట్ల ఇన్‌స్పెక్షన్ నిర్వహించే అవకాశం ఉన్నట్లు వైద్య శాఖ వర్గాలు తెలిపాయి. తనిఖీలు పూర్తయిన అనంతరం ఆయా కళాశాలలకు అనుమతులు మంజూరు కానున్నాయి. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా చేయడంతో పాటు అన్ని జిల్లాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను పేదలకు అందుబాటులోకి తెస్తూ 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు సీఎం జగన్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2023–24లో నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, విజయనగరం వైద్య కళాశాలలను ఇప్పటికే ప్రారంభించారు. ఒక్కో చోట 150 చొప్పున మొత్తం 750 ఎంబీబీఎస్ సీట్లను అదనంగా అందుబాటులోకి తెచ్చారు.

మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కన్నుమూత

స్వగ్రామం దొమ్మేరులో నేడు అంత్యక్రియలు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (71) మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో ఎన్టీ రామారావుపై అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చారు. వరుసగా 1983, 1985 (మధ్యంతర ఎన్నికలు), 1989, 1994, 2004లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీలు వేరైనప్పటికీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో కృష్ణబాబుకు అత్యంత సాన్నిహిత్యం ఉండేది. దీంతో ఆయన మరణానంతరం 2012లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ సీపీలో చేరారు. కృష్ణబాబు భార్య నాగమణి గతంలోనే మృతి చెందారు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు, కుమార్తె. కాగా, కృష్ణబాబు స్వగ్రామమైన దొమ్మేరులో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు)

చంద్రబాబు ఎక్కడ!?

ఆయన ఏ దేశంలో ఉన్నాడో ఎల్లో మీడియాలోనైనా చెప్పొచ్చు కదా?: బొత్స



సాక్షి, అమరావతి: ఏపీ ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎక్కడున్నారో ఎవరికీ తెలీడంలేదని.. ఆయన కంటే ముందే ఆయన కొడుకు లోకేశ్ మాయమైపోయాడని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ప్రజా జీవితంలో ఉన్నవారు ఇలా రహస్యంగా వెళ్లిపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. వచ్చేనెల 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 స్థానాల్లోను ఘన విజయం సాధిస్తుందని బొత్స ధీమా వ్యక్తంచేశారు. 9న తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని స్పష్టంచేశారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి బొత్స మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఎవరికీ చెప్పకుండా బాబు ఎక్కడికి వెళ్లారు?

ఇక ఎన్నికలు ముగిసి, ఫలితాల వెల్లడికి సమయం ఉన్నందున అన్ని పార్టీల అధినేతల్లాగే మా అధినేత వైఎస్ జగన్ కూడా కుటుంబ సమేతంగా లండన్ వెళ్లారు. కానీ, ఆయన్ను ఎయిర్‌పోర్టులో అడ్డుకోవాలని టీడీపీ ఎన్ఆర్ఐ లోకేశ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో మెసేజ్‌లు పంపి.. అక్కడ హడావిడి చేయడమేంటో ఎవరికీ అర్థంకాని విషయం. పైగా, జగన్ టూర్ మీద రకరకాల ట్రోలింగ్‌లు నడిపారు. మా నేత అందరికీ తెలిసేలా లండన్‌కు వెళ్లారు. మరి, చంద్రబాబు ఎక్కడికెళ్లారు? ఆయన విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి తీసుకుని వెళ్లాలి కదా? ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్లడమేంటి? అసలింతకు ఆయన ఏ దేశం వెళ్లాడో ఎవరికీ తెలీడంలేదు. ఇలా ఉంటే.. ఆయన కొడుకు లోకేశ్ తండ్రి కంటే మూ్డ్రోజులు ముందే విదేశాల కెళ్లాడంట. ఎన్నికలయ్యాక ఇప్పుడు ఓటమి భయంతో చంద్రబాబు శాశ్వతంగా ఆంధ్రాను వదిలి అమెరికానో.. మరే దేశానికో పారిపోయాడని వాళ్ల మాదిరిగా మేం అనలేం.

పీకే ఏమీ బ్రహ్మకాదు..

ప్రశాంత్ కిశోర్ ఏమీ సృష్టికర్త బ్రహ్మ కాదు. ఆయనది వ్యాపార ధోరణి. మేం చేస్తున్న ప్రజాభివృద్ధి విధానాలకు విరుద్ధంగా ఉండడంతో ఆయన్ను దూరం పెట్టాం. మాకెలాంటి ఎన్నికల వ్యూహకర్తలతో పనిలేదు. ఇలాంటివన్నీ ఎన్నికలకు చిట్కాలే తప్ప శాశ్వతం కాదు. మా అధినేత ప్రజలకు ఏం చేయాలో అదే చేశారు. ఇలాంటి ప్రగతి మాత్రమే శాశ్వతం.

అమెరికాలో తెలుగు మహిళకు అరుదైన గౌరవం


- కాలిఫోర్నియాలో శాక్రమెంటో సుపీరియర్ కోర్టు జడ్జిగా జయ నియామకం
- స్వస్థలం కృష్ణాజిల్లా మచిలీపట్నం



చిలకలపూడి (మచిలీపట్నం): అమెరికాలో తెలుగు మహిళకు అరుదైన గౌరవం దక్కింది. కాలిఫోర్నియాలోని శాక్రమెంటో సుపీరియర్ కోర్టు జడ్జిగా కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన జయ బాడిగ నియమితులయ్యారు. 2022 నుంచి ఆమె కోర్టు కమిషనర్‌గా పనిచేసి ఫ్యామిలీ లా నిపుణురాలిగా పేరొందారు. కుటుంబ న్యాయ సలహాల రంగంలో పలువురికి మార్గదర్శకురాలిగా వ్యవహరించారు. ఏపీలోని విజయవాడలో ఆమె జన్మించారు. 1991–94 మధ్య ఆమె హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలో సైకాలజీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులతో బీఏ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని బోస్టన్ విశ్వ విద్యాలయంలో రిలేషన్స్ అండ్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. శాంటాక్లారా వర్సిటీ నుంచి లా పట్టాను పొందారు. కాలిఫోర్నియాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ కేర్ సర్వీసెస్ అటార్నీగా, గవర్నర్ కార్యాలయం అత్యవసర సేవల విభాగంలో పనిచేశారు. జయ బాడిగ మంగళవారం న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె తండ్రి బాడిగ రామకృష్ణ 2004–09 వరకు మచిలీపట్నం ఎంపీ (కాంగ్రెస్)గా పనిచేశారు.

దారి మళ్లనున్న తుపాను!

ఆంధ్రప్రదేశ్‌కు ముప్పు లేనట్టే



సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను దారిమళ్లి, ఏపీ నుంచి దూరంగా వెళ్లనుంది. ఈ తుపాను ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం చూపుతుందని తొలుత భావించారు. అయితే తాజా వాతావరణ పరిస్థితులనుబట్టి అది బంగ్లాదేశ్ వైపు వెళ్తుందని తేలింది. దీంతో ఏపీకి తుపాను ముప్పు తప్పనుంది. ఈనెల 22న (బుధవారం) నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అది 24 నాటికి వాయుగుండంగా, ఆపై తుపానుగాను బలపడుతుందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. తొలుత వాయుగుండం వాయవ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ తుపానుగా మారితే దాని ప్రభావం కోస్తాంధ్ర, ముఖ్యంగా ఉత్తరాంధ్ర పైన ఉంటుందని పేర్కొన్నాయి. అయితే ఐఎండీ తాజా అంచనాల ప్రకారం .. అల్పపీడనం దిశ మార్చుకుని ఈశాన్య దిశగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుంది. ఆ తర్వాత మరింత బలపడి అదే దిశలో బంగ్లాదేశ్ వైపు వెళ్తుంది. దీని ఫలితంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి.

మూడు రోజులు తేలికపాటి వానలు

ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతం మీదుగా సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. బుధవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గంటకు 30 – 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.



బకుళాబెన్

స్ఫూర్తి

డేరింగ్ దాది

బకుళాబెన్ పటేల్‌ను సూరత్‌లో అందరూ 'డేరింగ్ దాదీ' అని పిలుస్తారు. 80 ఏళ్ల వయసులో నదుల్లో, సముద్రంలో ఆమె చేపలా ఈదడమే కాదు ఈత పోటీల్లో వందల మెడల్స్ సాధించడమే కారణం. 57 ఏళ్ల వయసులో మొదలెట్టిన ఈత తనకు ఆరోగ్యాన్ని, ఉత్సాహాన్ని ఇస్తున్నాయని అంటోంది బకుళాబెన్. పెద్ద వయసు వారికి పెద్ద స్ఫూర్తి ఆమె.

సూరత్‌లోని తాపి నది ఒడ్డున ఏ ఉదయాన ఐదు, ఆరు గంటల మధ్యన వెళ్లినా డేరింగ్ దాది అని ఆ ఊళ్లో పిలుచుకునే బకుళా బెన్ కనిపిస్తుంది. 80 ఏళ్ల వయసులో ఆమె దినచర్య గమనించదగ్గది. తెల్లవారు జామున 4 గంటలకు లేస్తుంది. ఒక గంటసేపు ఇంట్లో తేలికపాటి యోగా చేస్తుంది. ఆ తర్వాత జాగింగ్‌కు వీలైన దుస్తుల్లోకి మారి సూరత్ దారుల గుండా కనీసం గంటసేపు జాగింగ్ చేస్తుంది. ఆ తర్వాత తాపి ఒడ్డున ఈత దుస్తుల్లోకి మారి నదిలోకి దూరి దాదాపు రెండు గంటల సేపు ఈత కొడుతుంది. ఆ తర్వాతే ఆమె ఇంటికి చేరుతుంది. 'నేను రోజులో ఒక పూట భోజనం అయినా లేకుండా ఉంటాను కాని ఏ రోజూ ఈత కొట్టకుండా ఉండలేను' అంటుంది బకుళా బెన్.

కొత్త జీవితం

బకుళా బెన్‌ది అందరు సగటు ఆడవాళ్ల జీవితం వంటిదే. పెళ్లి, పిల్లలు... ఆమెకు నలుగురు సంతానం. వారిని పెంచి పెద్ద చేయడంలో జీవితం గడిచిపోయింది. ఆమెకు 50 ఏళ్లు ఉండగా భర్త మరణించాడు. కొన్నాళ్లకు ఆమెకు జీవితం బోరు కొట్టింది. 'ఏదో ఒకటి చేయాలి' అని క్రీడల వైపు ఆసక్తి కనపరిచింది. 'నాకు చిన్నప్పుడు నీళ్లంటే భయం. ఈత నేర్చుకోలేదు. కాని ఎన్నాళ్లు నీళ్లకు దూరంగా జరుగుతాను. ఈత నేర్చుకుందాం అనుకున్నాను. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు నా వయసు 58' అని తెలిపింది బకుళా బెన్. కాని ఆమె ఈత నేర్చుకోవడం అంత సులువు కాలేదు. బంధువులు, ఇరుగు పొరుగు వారు 'హవ్వ' అని నోరు నొక్కుకున్నారు. హేళన చేస్తూ వెనుక మాట్లాడుకున్నారు.

'అవన్నీ నా చెవిన పడుతున్నా ఈత నేర్చుకోవడం మానలేదు' అంటుంది బకుళ. ఇలా నవ్విన వారే తాపీనదిలో చేపలా ఈదుతున్న బకుళను చూసి ఆశ్చర్యపోయారు. హేళన స్థానంలో గౌరవం వచ్చింది.



500 మెడల్స్

'నన్ను చూసి అందరూ స్ఫూర్తి పొందాలని ఇన్ని పనులు చేస్తున్నాను. సమాజంలో మహిళల పట్ల వివక్ష ఉంది. ఆ వివక్షను ఎదిరించాలంటే ఇలాంటి కృషి చేయాలి. నేను జాతీయ అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ ఈత పోటీల్లో ఇప్పటివరకు 500 మెడల్స్ గెలుచుకున్నాను. అట్లాంటిక్, పసిఫిక్, బంగాళాఖాతాల్లో ఈత కొట్టాను. అమెరికా, ఆస్ట్రేలియా, కెనెడా, మలేసియా దేశాల్లో ఈతపోటీల్లో పాల్గొన్నాను. ఇంగ్లిష్ చానల్ ఈది గిన్నెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేరాలని నా కోరిక. ఇప్పటికి 400 మందికి ఈత నేర్పాను. ఈతలో ఉన్న ఆరోగ్యం, ఆనందం అంతా ఇంతా కాదు' అంటుంది బకుళా బెన్.

అన్నీ భిన్నమే

పిల్లలు సెటిల్ కావడం వల్ల దొరికిన తీరుబడిని బకుళ సంపూర్ణంగా జీవించదలుచుకుంది. 'నేను నా 60వ ఏట బి.ఏ. కట్టాను. పాఠాలు చదవడం గుర్తు పెట్టుకోవడం కష్టమైంది. రోజుకు 10 గంటలు చదివేదాన్ని. అలాగే ఎప్పుడో వదిలేసిన రాత కూడా ప్రాక్టీసు చేసి పరీక్షలు రాసి డిగ్రీ పొందాను. అలాగే యోగా నేర్చుకున్నాను. 80 ఏళ్ల వయసులో శీర్షాసనం వేయగలను. 75 ఏళ్ల వయసులో నాకు భరతనాట్యం నేర్చుకోవాలనిపించింది. మన దేశంలో ఆ వయసులో భరతనాట్యం చేసి అరంగేట్రం చేసింది నేనొక్కదాన్నే. ఆ అరంగేట్రం చూసి చాలామంది మెచ్చుకున్నారు' అంటుంది బకుళ.

నేడు చాలా మంది యువత చేస్తున్న ఉద్యోగాలను వదిలిపెట్టి సొంతంగా వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. అనుకున్న రంగంలో విజయం సాధించాలని కలలు కంటున్నారు. అయితే తమ కలల లక్ష్య సాధనలో అడుగులు వేయడం కోసం ఏదైనా ఒక స్ఫూర్తి ఉండాలి కదా... పుణేలో ఉంటున్న 33 ఏళ్ల అక్షాలీ షా సాధిస్తున్న విజయం నవతరానికి స్ఫూర్తిదాయకం. . ఎంబీయే చేసి, పద్నాలుగేళ్ల క్రితం తండ్రి ప్రారంభించిన చిన్న డెయిరీ యూనిట్‌లో ట్రైనీగా చేరింది అక్షాలీ షా. మిల్క్ ప్రొడక్ట్స్ వ్యాపారంలో కీలక పాత్ర పోషిస్తూ నేడు కంపెనీ రూ.2,556 కోట్ల మార్కెట్‌ని సాధించేంతగా కృషి చేసింది. బిజినెస్‌లో రాణించాలనుకునేవారికి పరాగ్ మిల్క్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆమె చేసిన ప్రయాణం ఓ పాఠం అవుతుంది.


* అక్షాలీ షా

ట్రైనీ నుంచి డైరెక్టర్ దాకా...

''నేను ఎంబీయేలో చేరేనాటికి మా నాన్న దేవేంద్ర షా పుణే సమీపంలోని మంచార్‌లో ఒక చిన్న డెయిరీ యూనిట్‌ను ప్రారంభించాడు. ఎంబీయే పూర్తవుతూనే ఏదైనా బిజినెస్ ప్రారంభించాలనుకున్నప్పుడు మా నాన్న తన యూనిట్ లోనే జాబ్‌లో చేరి, వ్యాపారాన్ని డెవలప్ చేయమన్నాడు. దానిని సవాల్‌గా తీసుకున్నాను. పరాగ్ పేరుతో రకరకాల పాల ఉత్పత్తులను తయారుచేయడం మొదలుపెట్టాను. ముందుగా దేశవ్యాప్తంగా ఉన్న మిల్క్ ప్రొడక్ట్స్‌కు సంబంధించిన అధ్యయనంతో మొదలుపెట్టాను. ఏ బిజినెస్ అయినా అంచెలంచెలుగా ఎదగాలంటే ముందు మార్కెట్‌ను అర్థం చేసుకోవాలి. నాణ్యత పైన దృష్టి పెట్టాలి. పుణే ప్రాంతంలో సహకార సంఘాల వాళ్లు మిల్క్ లీవ్ ప్రకటించినప్పుడు మా నాన్న రైతుల నుండి పాలను సేకరించి, మిల్క్ ఫుడ్స్ తయారీకి పునాది వేశారు. అక్కణ్నుంచి కంపెనీ పాడి పరిశ్రమలో ఇదొక విప్లవాత్మకమైన ప్రయాణానికి నాంది పలికినట్లయింది. ఆ విధంగా నాన్న ఆలోచనలనూ అందుకుంటూ నా ప్రయత్నాలు మొదలుపెట్టాను.

శ్రేష్ఠమైన ఉత్పత్తులు..

చాలారకాల ఆహారపదార్థాల నుంచి ప్రొటీన్స్ లభిస్తాయన్నది తెలిసిందే. పాలలో ప్రొటీన్ మోతాదు ఎక్కువ. అందుకే వినియోగదారుల అవసరాల మేరకు ప్రొటీన్ మిల్క్ ప్రొడక్ట్‌లను తయారుచేసి విక్రయిస్తున్నాం. 'పరాగ్' అని ప్రారంభించిన మా సంస్థ నుంచి నెయ్యి, చీజ్, ఫ్లేవర్డ్ మిల్క్, పెరుగు.. ఈ అన్ని ఉత్పత్తుల్లో మంచి అమ్మకాలు సాధిస్తుంది. ఇప్పుడు చీజ్ తయారీ, అమ్మకంలో దేశంలోనే మా సంస్థ రెండవదిగా నిలిచింది. ఫార్మ్ టు హోమ్ బిజినెస్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ బ్రాండ్, పానీయాల వృద్ధి.. వంటి ఉత్పత్తిలో నా మార్క్‌ను చూపించగలిగాను.


తండ్రి దేవేంద్ర షాతో అక్షాలి షా

గడపగడపకూ..

ఆవు పాల శ్రేష్ఠత గురించి తెలిసిందే. అందుకే, మన దేశంలో వీటి వాడకమూ ఎక్కువే ఉంటుంది. ఖరీదు ఎక్కువైనా శ్రేష్ఠమైన ఆవుపాల గురించి చాలా మంది అన్వేషిస్తారు. మొదట్లో ఆవుపాలు పితికి, అవి అవసరం ఉన్న కొద్దిమంది ఖాతాదారులకే అందించే వాళ్లం. ఆ తర్వాత ఆవు పాల గురించి దేశీయంగా ఉన్న మార్కెటింగ్ వైపు దృష్టి పెట్టాను. శ్రేష్ఠమైన ఆవుపాల కోసం దేశంలో కోట్లమంది ఖాతాదారులు ప్రయత్నిస్తున్నారని అర్థం చేసుకున్నాను. దీంతో 'ప్రైడ్ ఆఫ్ కౌస్' పేరుతో దేశవ్యాప్తంగా ఆవుపాలను కోరుకున్న ఖాతాదారుల గడప దగ్గరకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించాం. ఢిల్లీ, ముంబై, పుణే, సూరత్‌లలో ఆవుపాలు విశేషంగా అమ్ముడుపోతున్నాయి.

వ్యాపారవేత్తగా ఎన్నో అవార్డులను పొందుతూనే ఉన్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిల్క్ ప్రొడక్ట్స్ మార్కెట్ పై ఒక అంచనాతో అడుగులు వేస్తున్నాం'' అని వివరిస్తుంది అక్షాలీ.

అమ్మమ్మ చేతి వంట


జానకి పాటి

నిన్నటి తరం పిల్లలకు అమ్మమ్మ నాన్నమ్మ వంటకాల రుచి గురించి చెబితే చాలు నగర వాసపు జీవితాల్లో ఆ రుచిని మిస్ అవుతున్న విధానాన్ని తలుచుకొని మరీ బాధపడిపోతారు. ఆనంద్ భరద్వాజ్ అతని భార్య నళిని పార్థిబన్‌లు చెన్నైలో ఉంటున్న తమ అమ్మమ్మ జానకి పాటి వంటకాలను పండగల సమయాల్లో ఎంతగా కోల్పోతున్నామో గ్రహించారు. చేస్తున్న ఉద్యోగాలను వదిలేసి, అమ్మమ్మ వద్దకు పరిగెత్తుకు వెళ్లారు. 82 ఏళ్ల అమ్మమ్మ చేత వ్యాపారాన్ని ప్రారంభించారు. నేడు 32 దేశాలకు ఆ రుచులను అందిస్తూ ఈ వయసులో అమ్మమ్మను వ్యాపారవేత్తగా మార్చేశారు.

దేశంలో దక్షిణ భారతీయ వంటకాలకు ప్రత్యేకమైన రుచి ఉంటుంది. ముఖ్యంగా పండగల సమయాల్లో బామ్మలు వండే పిండివంటల రుచి మనుమలను నగరవాసం నుంచి లాక్కుని వచ్చేలా చేస్తుంది. అచ్చం ఇదే విధంగా 2015లో దీపావళి సమయంలో కుటుంబ సభ్యులు బామ్మ జానకి పాటి స్పెషల్ వంటకాలను మిస్ అయ్యారు. బామ్మ చేతి వంట రుచి గొప్పతనాన్ని ఆమె మనవడు ఆనంద్ భరద్వాజ్ అతని భార్య నళిని పార్థిబన్ మరీ మరీ గుర్తు చేసుకున్నారు. 'దీపావళికి మా అమ్మమ్మ జాంగ్రీలు, మురుకులు, మైసూర్ పాక్‌లను చాలా జాగ్రత్తగా తయారు చేసేది. ఆమె వంట చేస్తున్నప్పుడు మనవళ్లైన మాకు కథలు కూడా చెబుతుండేది. ఆ జ్ఞాపకం నేడు ఎస్‌కెసీ (స్వీట్ కారం కేఫ్)ను ప్రారంభించేలా చేసింది' అని చెబుతుంది నళిని పార్థిబన్.

రూ.2000 ల పెట్టుబడి

ఆనంద్, నళిని తమ అమ్మమ్మ చేతి వంట రుచిని ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నారు. సంప్రదాయ దక్షిణ భారత స్నాక్స్‌కు ఆధునిక ట్విస్ట్ ఇవ్వడానికి వారు చాలా ప్రయత్నాలే చేశారు. అయితే, ఈ ప్రయాణం కష్టమైందని త్వరలోనే గ్రహించారు. చాలా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో ఇంటిలోని ఒక చిన్న గదిలో రూ.2000 పెట్టుబడితో ప్రారంభించారు. మొదట కస్టమర్లను సంపాదించడానికి వార్తాపత్రికల మధ్యలో కరపత్రాలను ఉంచి, పంపిణీ చేసింది. దీంతో ఆర్డర్లు వెల్లువెత్తడం ప్రారంభించాయి. జనం కొద్ది రోజుల్లోనే అమ్మమ్మ స్నాక్స్‌ని బాగా ఇష్టపడ్డారు.



ప్రతి దశలోనూ కొత్త ఉత్సాహం

'వంటకాలన్నీ అమ్మమ్మవే. ఆమె చెప్పినట్టే చేస్తాం. కానీ, వంటను దగ్గరగా ఉండి పర్యవేక్షిస్తుంటాం. ఎక్కడా రాజీ పడకుండా చూసుకుంటాం' అని నళిని చెబితే, 'నాణ్యమైన దినుసులతో పాటు ప్రేమ, శ్రద్ధతో మా కుటుంబం కోసం చేసే విధంగా తయారుచేస్తాం' అని జానకి పాటి చెబుతుంది.

పాటీ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కూడా తయారుచేస్తుంది. తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఈ బామ్మ ఉత్సాహాన్ని ఎవరైనా పొందవచ్చు. క్రికెటర్ ఎంఎస్ ధోని పట్ల తన ప్రేమను సోషల్‌మీడియా ద్వారా పంచుకొని ఆనందిస్తుంటుంది. జీవితంలోని ఈ దశనూ ఆనందంగా గడపడం కోసం ఉత్సాహంగా పనిచేస్తుంది. 'ఇది నాకు పునర్జన్మ లాంటిది. మీరు ప్రయత్నించేవరకు మీకూ తెలియదు మీలోని శక్తి ఎంతో' అని అందరికీ చెబుతుంది. 'మా బామ్మలోని శక్తి మాకూ ప్రేరణగా పనిచేస్తుంది. ఆమె తన అభిమాన క్రికెటర్‌నీ ఉత్సాహపరుస్తుంది. అలాగే, సరికొత్త మొబైల్ యాప్స్ గురించి నేర్చుకుంటుంది. ఆమెకు జీవితం పట్ల ఉన్న అభిరుచి అసమానమైనది' అంటూ తమ అమ్మమ్మ గురించి ఆనందంగా వివరిస్తుంది నళిని.

నేడు ఎస్‌కెసి (స్వీట్ కారమ్ కేఫ్) స్టార్టప్ భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 32 దేశాలకు విస్తరించి, అమ్మమ్మ చేతి వంట సూపర్ అంటోంది.

యువతరం ఎకో-యాంగ్జయిటీ



యూత్ పల్స్

'ఈ నెట్‌ఫ్లిక్స్, ఐపీఎల్ మ్యాచ్‌ల కాలంలో వాతావరణ మార్పులపై యూత్ దృష్టి పెడుతుందా?' అనే ప్రశ్నకు 'అవును' అని చెబుతుంది డెలాయిట్ తాజా నివేదిక. 'డెలాయిట్ 2024 జెన్ జెడ్, మిలీనియల్స్ సర్వే' ప్రకారం వీరిలో ఎక్కువమంది 'క్లైమెట్ ఛేంజ్'పై ఆందోళన చెందుతున్నారు. పర్యావరణ సంరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత మాట ఎలా ఉన్నా ఎకో-యాంగ్జయిటీ అనేది వారిలో కనిపించే మరో కోణం.

దిల్లీలో ఒకరోజు...

'ఇల్లుదాటి బయటికి వెళ్లవద్దు అని పేరెంట్స్ చాలా స్ట్రిక్ట్‌గా చెప్పారు. అయినా సరే వారి కనుగప్పి ఇంటి నుంచి బయటికి వచ్చి అనుకున్నట్లుగానే అక్కడికి వెళ్లాను' అంటుంది యశ్న ధ్యురియా. ఇంతకీ ఇరవై సంవత్సరాల యశ్న వెళ్లింది ఎక్కడికి?

ఆరోజే విడుదలైన సినిమాకు కాదు. క్రికెట్ మ్యాచ్ చూడడానికి కాదు. మహానగరంలో జరుగుతున్న గ్లోబల్ క్లైమెట్ స్ట్రైక్‌లో పాల్గొనడానికి. 'వాట్స్ గోయింగ్ టు హ్యాపెన్' అంటూ పర్యావరణ సంక్షోభం గురించి యశ్న కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులకు ఆశ్చర్యంగా అనిపించింది. 'పరీక్షల్లో ఫెయిలైనట్లు ఏడుస్తున్నావేమిటి?' అని అడిగారు ఒకరు.

కానీ ఆ ఒకరికి తెలియనిదేమిటంటే వాతావరణానికి సంబంధించిన కీలకమైన పరీక్షను మనం నిర్లక్ష్యం చేస్తున్నాం. ఈ సంక్షోభ నేపథ్యంలో యశ్నలాంటి వాళ్లు ఆశాదీపాలై వెలుగుతున్నారు. తాము వెలుగు దారిలో పయనిస్తూ ఎంతోమందిని తమతోపాటు తీసుకువెళుతున్నారు.

'తెలిసో తెలియకో, ఏమీ చేయలేకో పర్యావరణ సంక్షోభంలో భాగం అవుతున్నాం' అనే బాధ, పశ్చాత్తాపం బెంగళూరుకు చెందిన శ్రీరంజనిలో కనిపిస్తుంది. గ్లోబల్ స్ట్రైక్ మూమెంట్ 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్(ఎఫ్ఎఫ్ఎఫ్) ఇండియా'లో భాగంగా ఎన్నో కార్యక్రమాల్లో శ్రీరంజని పాల్గొంది.

పర్యావరణ సంక్షోభం తాలూకు ఆందోళన తట్టుకోలేక యూత్ క్లైమెట్ యాక్టివిస్ట్‌లలో కొందరు ట్రీట్‌మెంట్‌కు కూడా వెళుతున్నారు. ఎన్విరాన్‌మెంట్ యాక్షన్ గ్రూప్ 'దేర్ ఈజ్ నో ఎర్త్ బి'తో కలిసి పనిచేసిన దిల్లీకి చెందిన సైకోథెరపిస్ట్ అగ్రిమ ఛటర్జీ పర్యావరణ సంక్షోభంపై యూత్ ఆందోళనను దగ్గరి నుంచి గమనించింది.

'తమ పరిధిలో వారు చేయగలిగింది చేస్తున్నారు. మరోవైపు సమస్య పెద్దగా ఉంది. కొన్నిసార్లు తాము చేస్తున్న ప్రయత్నం అర్థరహితంగా అనిపించి ఆందోళనకు గురవుతున్నారు. నిస్సహాయ స్థితిలోకి వెళుతున్నారు' అంటుంది అగ్రిమ.

బెంగళూరుకు చెందిన సైకోథెరపిస్ట్ మోహినీ సింగ్ ఎంతోమంది యువ క్లైమెట్ యాక్టివిస్ట్‌లతో కలిసి పనిచేసింది. 'పరీక్షల్లో ఫెయిల్ కావడం, లవ్ ఫెయిల్యూర్స్, బ్రేకప్స్ సందర్భంగా ఇతరుల నుంచి సానుభూతి, ఓదార్పు దొరికినట్లు క్లైమెట్ యాంగ్జయిటీ విషయంలో దొరకదు. ఎందుకంటే అది చాలామందికి అనుభవం లేని విషయం' అంటుంది మోహిని.

శివానీ గోయల్ తన స్వరాష్ట్రం అస్సాంలో వాతావరణ విధ్వంసంపై పరిశోధన చేస్తోంది. పత్రికలకు వ్యాసాలు రాస్తుంది. సోషల్ మీడియాలో కంటెంట్‌ను క్రియేట్ చేస్తుంటుంది. 'నా ప్రయత్నం ఏ కొంచమైనా ఫలితాన్ని ఇస్తుందా?' అనేది తనకు తరచుగా వచ్చే సందేహం.

'చేయాల్సింది చాలా ఉంది' అంటున్న గోయల్ 'ఇక ఏమీ చేయలేం' అనే నిస్సహాయ స్థితిలోకి వెళ్లి ఆందోళన బారిన పడి ఉండవచ్చుగానీ దాని నుంచి బయటపడడానికి క్లైమెట్ యాక్టివిస్ట్‌గా తిరిగి క్రియాశీలం కావడానికి ఎంతో సమయం పట్టదు.

అలా తొందరగా ఆందోళన నుంచి బయటపడడమే వారి బలం. సమాజానికి వరం.


నయన ప్రేమ్‌నాథ్

ఐడియాలు ఉండగా ఆందోళన ఏలనోయి!

'పర్యావరణంపై మన ప్రేమ ఇంటి నుంచే మొదలు కావాలి' అంటున్న నయన ప్రేమ్‌నాథ్ డే-టు-డే సస్టెయినబుల్ లైఫ్‌స్టైల్ ప్రాక్టీసెస్‌కు సంబంధించిన వీడియోలు, రీల్స్‌ను యువతరం ఇష్టపడుతోంది. ఆచరిస్తోంది. 'ధరించకుండా మీరు మూలకు పడేసిన దుస్తులతో ఏంచేయాలి?' 'పీసీఆర్ ప్లాస్టిక్ గురించి తెలుసుకుందాం' 'జీరో-వేస్ట్ లైఫ్ స్టైల్'... మొదలైన వాటి గురించి బెంగళూరు చెందిన నయన ప్రేమ్‌నాథ్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో పాపులరయ్యాయి. 'పర్యావరణ పరిరక్షణకు నా వంతుగా కొంత' అనే భావనకు మద్దతును, బలాన్నీ ఇస్తున్నాయి.

పశ్చిమ కనుమల పరిమళం



నా మూలాలు పశ్చిమ కనుమలలో ఉన్నాయి. ఇల్లు బెంగళూరులో ఉంది. ప్రకృతి అంటే ఇష్టం. 'ఇండియన్ యూత్ క్లైమెట్ మూవ్‌మెంట్'లో కమ్యూనిటీ ఆర్గనైజర్‌ని. 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్‌'తో నా ప్రయాణం మొదలైంది. 'నేచర్ అండ్ ఫ్లూరివర్సిటీ'కి ఫౌండర్‌ని. అధిక జీతం, పెద్ద సంస్థ అనే దృష్టితో కాకుండా విలువలతో కూడిన ఉద్యోగాలు చేయడం వల్ల ఎకో యాంగ్జయిటీ తగ్గుతుంది. ఎక్కువ జీతం వచ్చే సంస్థలో పనిచేయడం కంటే, పర్యావరణ సంరక్షణకు ఉపయోగపడే సంస్థలో పనిచేస్తున్నందుకు నాకు తృప్తిగా ఉంది.

పర్యావరణ సంక్షోభాన్ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే... తుఫాను ఒక్కటే. అయితే మనం వేరు వేరు పడవల్లో ఉన్నాం. పర్యావరణ సంక్షోభాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ తమవంతుగా చేయాల్సింది ఎంతో ఉంది.

– శ్రీరంజని రమణ్, క్లైమెట్ యాక్టివిస్ట్



నిష్క్రమించేదెవరో..? నేడు ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరుతో రాజస్తాన్ 'ఢీ'

ఐపీఎల్ టైటిల్ రేసులో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో... నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రాజస్తాన్ రాయల్స్ జట్లు ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. అహ్మదాబాద్‌లో రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుకు ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉంటాయి. ఓడిపోయిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేత జట్టు క్వాలిఫయర్-1లో ఓడిపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో శుక్రవారం చెన్నైలో జరిగే క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో ఫైనల్ బెర్త్ కోసం పోటీపడుతుంది. తాజా సీజన్‌లో బెంగళూరు లీగ్ దశలోనే నిష్క్రమించే దశ నుంచి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించి అబ్బురపరిచింది. డు ప్లెసిస్ నాయకత్వంలోని బెంగళూరు జట్టు తమ చివరి 6 లీగ్ మ్యాచ్‌ల్లో నెగ్గి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు సంజూ సామ్సన్ సారథ్యంలోని రాజస్తాన్ రాయల్స్ జట్టు తమ చివరి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోగా, ఐదో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ జోడీగా...

సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఘనత



న్యూఢిల్లీ: నెల రోజుల తర్వాత భారత బ్యాడ్మింటన్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మళ్లీ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం రెండు స్థానాలు మెరుగు పర్చుకొని మూడో ర్యాంక్ నుంచి టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. గత ఆదివారం థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో సాత్విక్-చిరాగ్ జంట విజేతగా నిలవడంతో వారి ర్యాంక్‌లో మార్పు వచ్చింది. గత ఏడాది అక్టోబర్‌లో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న భారత జోడీ రెండు వారాలపాటు అగ్రస్థానంలో కొనసాగి ఆ తర్వాత ఐదో ర్యాంక్‌కు పడిపోయింది. మళ్లీ ఈ ఏడాది జనవరి 23న నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకొని ఏప్రిల్ 15వ తేదీ వరకు టాప్ ర్యాంక్‌లో కొనసాగి మూడో ర్యాంక్‌కు పడిపోయింది.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-14, 21-10తో హువాంగ్ యు సున్-లియాంగ్ టింగ్ యు (చైనీస్ తైపీ) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో నలుగురు భారత ప్లేయర్లు సతీశ్ కుమార్, ఆయూశ్ శెట్టి, శంకర్ ముత్తుస్వామి, కార్తికేయ గుల్షన్ కుమార్ పోటీపడ్డా ఒక్కరు కూడా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. నేడు జరిగే మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌లో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)తో పీవీ సింధు తలపడుతుంది.

కోల్‌కతాకే 'ఫైనల్' సత్తా



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టార్క్

క్వాలిఫయర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘనవిజయం

- నాలుగోసారి ఐపీఎల్ టైటిల్ పోరుకు అర్హత
- 160 పరుగుల లక్ష్యాన్ని 13.4 ఓవర్లలోనే ఛేదించిన కోల్‌కతా నైట్‌రైడర్స్
- బంతితో హడలెత్తించిన స్టార్క్
- దంచేసిన వెంకటేశ్, శ్రేయస్ అయ్యర్
- ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్-2లో తలపడనున్న సన్‌రైజర్స్

ఈ సీజన్‌లో 7 సార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నాలుగు సార్లు 200 పైచిలుకు స్కోర్లను అవలీలగా చేసింది. ఎనిమిదోసారి మాత్రం 'సన్' బృందం రైజింగ్ కాలేదు. కీలకమైన ప్లే ఆఫ్స్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ పూర్తి ఓవర్లు ఆడకుండానే 159 పరుగులకే కుప్పకూలింది. రెండో క్వాలిఫయర్ ఉందన్న ధీమానో లేదంటే ఓడినా పోయేదేం లేదన్న అలసత్వమో గానీ హైదరాబాద్ బ్యాటర్లు పేలవ ప్రదర్శనతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు సులువుగా ఫైనల్ దారి చూపారు. ఆద్యంతం పక్కా ప్రణాళికతో ఆడిన కోల్‌కతా ముందుగా బంతితో సన్‌రైజర్స్‌ను కట్టడి చేసి... ఆ తర్వాత బ్యాట్‌తో మెరిపించి 160 పరుగుల లక్ష్యాన్ని 13.4 ఓవర్లలోనే ఛేదించేసి దర్జాగా నాలుగోసారి ఐపీఎల్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది.


అహ్మదాబాద్: 'ప్లే ఆఫ్స్' దశ వరకు తగిన ప్రదర్శన చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఇంకో అవకాశం కోసం ఎదురుచూడకుండా ఐపీఎల్ 17వ సీజన్‌లో నేరుగా ఫైనల్‌కు అర్హత సంపాదించింది. మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుగా ఓడించింది. లీగ్ దశలో భీకరమైన ఫామ్ కనబరిచిన సన్‌రైజర్స్ మాత్రం కీలకమైన దశలో నిర్లక్ష్యంగా ఆడి ఓడింది. ఫైనల్ బెర్త్ కోసం ఆ జట్టు రెండో క్వాలిఫయర్ కోసం నిరీక్షించనుంది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 19.3 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. రాహుల్ త్రిపాఠి (35 బంతుల్లో 55; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, హెన్రిచ్ క్లాసెన్ (21 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ స్టార్క్ 3 వికెట్లు, వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు తీశారు. అనంతరం కోల్‌కతా 13.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (24 బంతుల్లో 58 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 51 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) సన్‌రైజర్స్ బౌలర్ల భరతం పట్టి మూడో వికెట్‌కు కేవలం 44 బంతుల్లో 97 పరుగుల భాగస్వామ్యం జోడించడం విశేషం. గతంలో కోల్‌కతా జట్టు 2012, 2014లలో టైటిల్ సాధించి, 2021లో రన్నరప్‌గా నిలిచింది.

ఆది నుంచే కష్టాల్లో...

అసలైన మ్యాచ్‌లో స్టార్క్ బంతితో నిప్పులు చెరిగాడు. రెండో బంతికే ట్రవిస్ హెడ్ (0)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అభిషేక్ శర్మ (3)ను కూడా సింగిల్ డిజిట్‌కే వైభవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత ఫామ్‌లో ఉన్న నితీశ్ కుమార్ రెడ్డి (9), షహబాజ్ (0)లను స్టార్క్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. దాంతో సన్‌రైజర్స్ 39 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఏడో ఓవర్లో జట్టు స్కోరు 50కి చేరింది. మెల్లిగా ఈ కష్టాల నుంచి గట్టెక్కుతున్న సమయంలో 8, 9, 10 ఓవర్లు సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌కు ఊరటనిచ్చాయి. హర్షిత్ వేసిన 8వ ఓవర్లో రాహుల్ త్రిపాఠి సిక్సర్‌తో 12 పరుగులొచ్చాయి. నరైన్ తొమ్మిదో ఓవర్లో త్రిపాఠి బౌండరీ బాదితే... క్లాసెన్ 6, 4 కొట్టడంతో 18 పరుగుల్ని రాబట్టుకుంది. రసెల్ పదో ఓవర్లో ఇద్దరు చెరో ఫోర్ కొట్టడంతో మరో 12 పరుగులు రావడంతో సగం ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ 92/4 స్కోరు చేసింది.



హెడ్ బౌల్డ్



రాహుల్ త్రిపాఠి

వరుణ్ దెబ్బతో....

ఇంకేం ఓవర్‌కు 9.2 రన్‌రేట్‌తో గాడిలో పడుతోందనుకుంటున్న తరుణంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి దెబ్బకొట్టాడు. అతను వేసిన 11వ ఓవర్లో త్రిపాఠి బౌండరీతో జట్టు స్కోరు 100కు చేరింది. కానీ ఆఖరి బంతికి క్లాసెన్ అవుటయ్యాడు. దీంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల విలువైన భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత కాసేపటికే 5 పరుగుల వ్యవధిలోనే త్రిపాఠి, సన్వీర్ (0), సమద్ (16), భువనేశ్వర్ (0) ఇలా నాలుగు వికెట్లను కోల్పోయిన సన్‌రైజర్స్ 126/9 స్కోరు వద్ద ఆలౌట్‌కు సిద్ధమైపోయింది. ఈ దశలో కెప్టెన్ కమిన్స్ (24 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

అదరగొట్టిన 'అయ్యర్'లు

బౌలింగ్‌లోనూ హైదరాబాద్ తేలిపోవడం, ఫీల్డర్లు క్యాచ్‌లు నేలపాలు చేయడంతో నైట్‌రైడర్స్‌కు లక్ష్యఛేదన మరింత సులువైంది. ఓపెనర్లు గుర్బాజ్ (14 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సునీల్ నరైన్ (16 బంతుల్లో 21; 4 ఫోర్లు) వేగంగా ఆడే క్రమంలో అవుటయ్యారు. 67 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఒక్క వికెట్టు పడలేదు. వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్ వచ్చిన లైఫ్‌లను సద్వినియోగం చేసుకొని హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దీంతో 9.4 ఓవర్లలోనే కోల్‌కతా స్కోరు వందకు చేరింది. లక్ష్యంవైపు చకచకా పరుగులు తీసింది. వెంకటేశ్ 28 బంతుల్లో, శ్రేయస్ 23 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. వెంకటేశ్, శ్రేయస్ ధాటికి కోల్‌కతా 38 బంతులు మిగిలుండగానే విజయతీరానికి చేరింది.



వెంకటేశ్, శ్రేయస్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) స్టార్క్ 0; అభిషేక్ శర్మ (సి) రసెల్ (బి) వైభవ్ 3; త్రిపాఠి (రనౌట్) 55; నితీశ్ కుమార్ రెడ్డి (సి) గుర్బాజ్ (బి) స్టార్క్ 9; షహబాజ్ (బి) స్టార్క్ 0; క్లాసెన్ (సి) రింకూ సింగ్ (బి) వరుణ్ 32; సమద్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ 16; సన్వీర్ (బి) నరైన్ 0; కమిన్స్ (సి) గుర్బాజ్ (బి) రసెల్ 30; భువనేశ్వర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వరుణ్ 0; విజయకాంత్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 159. వికెట్ల పతనం:** 1-0, 2-13, 3-39, 4-39, 5-101, 6-121, 7-121, 8-125, 9-126, 10-159. **బౌలింగ్:** స్టార్క్ 4-0-34-3, వైభవ్ 2-0-17-1, హర్షిత్ 4-0-27-1, నరైన్ 4-0-40-1, రసెల్ 1.3-0-15-1, వరుణ్ చక్రవర్తి 4-0-26-2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) విజయకాంత్ (బి) నటరాజన్ 23; నరైన్ (సి) విజయకాంత్ (బి) కమిన్స్ 21; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 51; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 58; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (13.4 ఓవర్లలో 2 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1-44, 2-67. **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-28-0, కమిన్స్ 3-0-38-1, నటరాజన్ 3-0-22-1, విజయకాంత్ 2-0-22-0, హెడ్ 1.4-0-32-0, నితీశ్ రెడ్డి 1-0-13-0.

సినిమా



డి. రామానాయుడు

షష్టి పూర్తి

తెలుగు అగ్ర నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ షష్టి పూర్తి (60 ఏళ్ల) ప్రయాణం పూర్తి చేసుకుంది. పద్మభూషణ్, దివంగత నిర్మాత డా. డి. రామానాయుడు 1964లో స్థాపించిన సురేష్ ప్రొడక్షన్స్ భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నిర్మాణ సంస్థగా పేరు పొందడంతో పాటు ప్రేక్షకుల మన్ననలను పొందింది. ప్రకాశం జిల్లా కారంచేడులో రైతు కుటుంబంలో పుట్టారు రామానాయుడు. రైసు మిల్లు వ్యాపారం చేస్తున్న సమయంలో ఆయన మద్రాసు వెళ్లారు. అక్కడ కొందరు సినీ ప్రముఖుల పరిచయం ఆయన్ను సినిమాల్లోకి వచ్చేలా చేసింది. భాగస్వామ్యంతో 'అనురాగం' చిత్రం నిర్మించారు రామానాయుడు. ఆ చిత్రం విజయవంతం అయింది. ఆ తర్వాత తన పెద్ద కుమారుడు సురేష్‌బాబు పేరుతో సురేష్ ప్రొడక్షన్స్ స్థాపించి, ఎన్టీఆర్‌తో 'రాముడు-భీముడు' (1964) సినిమా నిర్మించారు. ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. అప్పట్నుంచి పలు భాషల్లో సినిమాలు నిర్మిస్తూ వస్తోంది సురేష్ ప్రొడక్షన్స్. శతాధిక చిత్రాల నిర్మాతగా రామానాయుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించుకున్నారు. అలాగే అన్ని భారతీయ భాషల్లో సినిమాలు నిర్మించాలన్న తన సంకల్పాన్ని నెరవేర్చుకుని, చరిత్ర సృష్టించారు రామానాయుడు. 2015 ఫిబ్రవరి 18న ఈ మూవీ మొఘల్ తుది శ్వాస విడిచారు. అప్పటికే తమ నిర్మాణ సంస్థ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సురేష్‌బాబు తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. రెండో కుమారుడు వెంకటేశ్ హీరోగా కొనసాగుతున్నారు. మనవడు రానా నటుడిగా, నిర్మాతగా కొనసాగుతున్నారు. రానా సోదరుడు అభిరామ్ కూడా హీరో ('అహింస' చిత్రంతో హీరోగా పరిచయం అయ్యారు)గా చేసిన విషయం తెలిసిందే. ఇక సురేష్ ప్రొడక్షన్స్ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రయాణంలో భాగమైన అందరికీ నిర్మాణ సంస్థ కృతజ్ఞతలు తెలియజేసింది.

ఖురేషీగా ఎందుకు మారాడు?



మోహన్‌లాల్

ఖురేషి అబ్రమ్‌గా స్టీఫెన్ నెడుంపల్లి ఎందుకు మారాడు? 'లూసిఫర్' సినిమా చూసిన ప్రేక్షకులకు ఈ సందేహం కలగడం సహజం. ఈ సందేహానికి 'లూసిఫర్ 2'లో సమాధానం దొరకనుంది. స్టీఫెన్ నెడుంపల్లి అలియాస్ ఖురేషి అబ్రమ్‌గా మోహన్‌లాల్ హీరోగా రూపొందిన బ్లాక్ బస్టర్ మూవీ 'లూసిఫర్' (2019). హీరో, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఈ కాంబినేషన్‌లోనే 'లూసిఫర్'కి సీక్వెల్‌గా 'ఎల్2 ఎంపురాన్' రూపొందుతోంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్, ఆశీర్వాద్ సినిమాస్ ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. మంగళవారం (మే 21) మోహన్‌లాల్ బర్త్ డే సందర్భంగా 'ఎల్ 2 ఎంపురాన్'లో ఖురేషి అబ్రమ్‌గా మోహన్‌లాల్ లుక్‌ను విడుదల చేశారు. స్టీఫెన్ నెడుంపల్లి అసలు ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడు? అనే విషయాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. 2025లో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

జూన్‌లో హరోం హర



సుధీర్ బాబు

సుధీర్‌బాబు హీరోగా నటించిన 'హరోం హర' సినిమా విడుదల తేదీ మారింది. ముందుగా ఈ నెల 31న సినిమా విడుదలకు యూనిట్ ప్లాన్ చేసింది. అయితే జూన్ 14న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, సుధీర్ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన 'హరోం హర'లో మాళవికా శర్మ కథానాయిక. సుమంత్ జి. నాయుడు నిర్మించారు. ''ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'హరోం హర'. చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగే పీరియాడికల్ ఫిల్మ్ ఇది'' అన్నారు మేకర్స్.

ఆనందం.. ఉద్వేగం...

- కాన్స్‌లో 'కన్నప్ప' టీజర్ ప్రదర్శన
- 35 ఏళ్లుగా నిర్మాణంలో 'హరిజన్: యాన్ అమెరికన్ సాగ'



విష్ణు మంచు, ముఖేష్ కుమార్, మోహన్‌బాబు, ప్రభుదేవా

30న హైదరాబాద్‌లో 'కన్నప్ప' టీజర్... శివభక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో ముఖేష్ కుమార్ దర్శకత్వంలో మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. కాన్స్ చిత్రోత్సవాల్లో 'కన్నప్ప' ప్రీమియర్ టీజర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విష్ణు మంచు, మోహన్‌బాబు, ప్రభుదేవా పాల్గొన్నారు. ''కన్నప్ప' టీజర్‌ను కాన్స్‌లో చూపించాం. అందరూ ప్రశంసించారు. అంతర్జాతీయ డిస్ట్రిబ్యూటర్స్ కూడా 'కన్నప్ప' టీజర్ చూసి ముగ్ధులయ్యారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో తెలుగు వెర్షన్ 'కన్నప్ప' టీజర్‌ను ప్రదర్శించనున్నాం. జూన్ 13న ఈ టీజర్‌ను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నాం'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు విష్ణు మంచు.



సంధ్యా సూరి, సునీతా రజ్వార్, సహానా గోస్వామి, సంజయ్ బిష్ణోయ్

కాన్స్‌లో తొలిసారి... కాన్స్ చిత్రోత్సవాల్లో ప్రతిష్టాత్మక 'పామ్ డి ఓర్' అవార్డు సినీ పరిశ్రమకు సుదీర్ఘ కాలంగా సేవలు అందించినవారికి ఇస్తుంటారు. ఈ ఏడాది 77వ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని 'పామ్ డి ఓర్' అవార్డుకు మెరిల్ స్ట్రీప్, జార్జ్ లూకాస్‌లను ఎంపిక చేశారు. కాగా కాన్స్ చరిత్రలోనే తొలిసారి ఓ స్టూడియోకు ఈ అవార్డు దక్కింది. జపాన్‌లోని యానిమేటెడ్ స్టూడియో 'ఘిబ్లీ'కి ఫామ్ డి ఓర్ అవార్డును ప్రదానం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ స్టూడియో యానిమేషన్ రంగంలో ఉంది. ఇక హాలీవుడ్ నటి మెరిల్ స్ట్రీప్ ఆల్రెడీ ఈ అవార్డు స్వీకరించారు. హాలీవుడ్ దర్శక-నిర్మాత జార్జ్ లూకాస్ చిత్రోత్సవాల చివరి రోజున ఈ అవార్డు అందుకోనున్నారు.

కన్నీళ్లు పెట్టుకున్న కెవిన్... కెవిన్ కాస్ట్నర్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హరిజన్: యాన్ అమెరికన్ సాగ'. అమెరికన్ సివిల్ వార్‌కు ముందు ఉన్న పరిస్థితులు, వార్ తర్వాత ఏర్పడ్డ పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. మూడు చాప్టర్స్‌గా ఈ చిత్రం విడుదల కానుంది. తొలి చాప్టర్ 'హరిజన్: యాన్ అమెరికన్ సాగ'ను కాన్స్ చిత్రోత్సవాల్లో ప్రీమియర్‌గా ప్రదర్శించగా, మంచి స్పందన లభించింది. దాదాపు పది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కడంతో కెవిన్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సినిమా నిర్మాణానికి 35 ఏళ్లుగా కెవిన్ కష్టపడుతున్నారని హాలీవుడ్ టాక్.

ట్రంప్ బయోపిక్... అమెరికా మాజీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త డోనాల్డ్ ట్రంప్ జీవితం ఆధారంగా 'ది అప్రెంటిస్' సినిమా తీశారు దర్శకుడు అలీ అబ్బాసి. ఈ సినిమాను తొలిసారిగా కాన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా, స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. సెబాస్టియన్ స్టాన్ ఈ చిత్రంలో డోనాల్డ్ ట్రంప్ పాత్ర పోషించారు. ఫిల్మ్ మేకర్స్ పొలిటికల్ మూవీస్ మరిన్ని చేయాలని కాన్స్ వేదికగా అలీ అబ్బాసి పేర్కొన్నారు.



కెవిన్



మరియ, అలీ అబ్బాస్

శునకం సందడి... లాటిటియా డెస్చ్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'డాగ్ ఆన్ ట్రయిల్'. ఫ్రాన్స్‌లో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఓ కుక్క కొంతమందిని కరుస్తుంది. అప్పుడు ఆ శునకాన్ని ఓ లాయర్ ఏ విధంగా కోర్టు కేసు నుంచి రక్షించారు? అన్నదే ఈ చిత్రకథ. ఈ సినిమాను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. లాటిటియాతో పాటు ఈ సినిమాలో నటించిన శునకం చిత్రోత్సవాలకు హాజరైంది.



శునకంతో లాటిటియా సందడి

కాన్స్‌లో భారతీయం... కాన్స్‌లో ఈ ఏడాది మన దేశీ తారలు ఐశ్వర్యా రాయ్, ఊర్వశీ రౌతేలా, కియారా అద్వానీ, శోభితా ధూళిపాళ వంటి వారు సందడి చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అదితీ రావ్ హైదరి ఈ చిత్రోత్సవాల్లో సందడి చేయడానికి ఫ్రాన్స్ వెళ్లారు. ఇక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో దాదాపు 35 ఏళ్ల తర్వాత పామ్ డి ఓర్ విభాగంలో పోటీకి భారతీయ చిత్రం 'అల్ వీ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' నిలిచిన సంగతి తెలిసిందే. భారతీయ ఫిల్మ్ మేకర్ పాయల్ కపాడియా ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ప్రస్తుతం కపాడియా ఫ్రాన్స్‌లోనే ఉన్నారు. అలాగే 'అన్ సర్టైన్ రిగార్డ్' విభాగంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఫిల్మ్‌మేకర్ సంధ్యా సూరి తీసిన 'సంతోష్' చిత్రం ఉంది. ఈ చిత్రంలో నటించిన సహానా గోస్వామి, సంజయ్ బిష్ణోయ్‌లతో పాటు సంధ్యా సూరి ఫ్రాన్స్ చేరుకున్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



హరీష్, మాన్య

హరీష్ బొంపెల్లి, మాన్య సలాడి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఓసీ'. విష్ణు బొంపెల్లి దర్శకత్వంలో కౌండిన్య ప్రొడక్షన్స్‌పై బీవీఎస్ నిర్మించారు. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'ఓసీ'. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ కథ ఉంటుంది. మంచి నిర్మాణ విలువలతో, భారీ బడ్జెట్‌తో రాజీపడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. శరవేగంగా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రోయల్ శ్రీ, లక్ష్మీ కిరణ్ నటించిన ఈ చిత్రానికి కెమెరా: సాయిరాం తుమ్మలపల్లి, సంగీతం: భోలే షావలి.

డాన్ వస్తున్నాడు



దీపిక, శాంతి చంద్ర, నికిష, సిమ్రితి

ఇండియన్ నేవీలో పని చేసిన సోల్జర్ శాంతి చంద్ర హీరోగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితీ బతీజా, నికిషా రంగ్‌వాలా హీరోయిన్లు. గుడూరు భద్రకాళీ సమర్పణలో జి. శాంతి బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్, హీరో సంపూర్ణేష్ బాబు అతిథులుగా పాల్గొని, సినిమా హిట్టవ్వా లన్నారు. ''ఒకప్పుడు మన సినిమాలకు శతదినోత్సవాలు జరుపుకునేవాళ్లం. ఇప్పుడు రెండు రోజులకే సినిమా లైఫ్ ఫినిష్ అవుతూ జత దినోత్సవాలు జరుపుకునే పరిస్థితి వచ్చింది. ఎవరికి వారు ఇంటినే హోమ్ థియేటర్‌లా భావిస్తున్నారు. సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న చిత్రాలను బతికించండి'' అన్నారు మూర్తి సాయి. ''డర్టీ ఫెలో' డాన్ మూవీ. అయితే మా సినిమాలో ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్, యాక్షన్, రొమాన్స్.. ఇలా అన్నీ ఉంటాయి'' అన్నారు శాంతి చంద్ర.

సాక్షి బిజినెస్
బుధవారం
22-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	53	73,953
నిఫ్టీ △	27	22,529

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,805	△	10
డోజోన్స్	39,840	△	32
ఎఫ్‌టీఎస్ఈ 100	8,416	▽	8
డాక్స్	18,727	▽	42
షాంఘై	3,158	▽	13
నికాయ్	38,947	▽	123

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	72,640
బంగారం (22 క్యారెట్)	69,180
వెండి (కేజీ)	99,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.57	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.06	54.23
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.76	56.70
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.08	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.48

ట్రిలియన్ డాలర్లకు డిజిటల్ ఎకానమీ

2027–28 నాటికి కార్యరూపం ● కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



న్యూఢిల్లీ: భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏటా 2.8 శాతం వృద్ధి చెందుతోంది. 2027–28 నాటికి ఇది ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అధికారిక నివాసంలో సోమవారం సాయంత్రం జరిగిన విశేష సంపర్క్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 ఐటీ, స్టార్టప్‌లు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. '2026-27 నాటికి భారత డిజిటల్ ఎకానమీ 1 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకుంటుందని ప్రభుత్వం ముందుగా అంచనా వేసింది. అయితే కోవిడ్-19 మహమ్మారితో సహా వివిధ కారణాల వల్ల లక్ష్యం ఆ తర్వాతి సంవత్సరానికి మార్చారు' అని తెలిపారు.

ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ వినూత్న ప్రచారం

హైదరాబాద్: 'మీరు సరైనదే కొంటున్నారా?' అంటూ ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. వినియోగదారులు వంటనూనె కొనే ముందు పరిమాణాన్ని తనిఖీ చేయడమే ఈ ప్రచార ఉద్దేశమని తెలిపింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ 910 గ్రాముల నూనె కలిగి ఉండాలి. అయితే కొన్ని బ్రాండులు ఒక లీటరు ప్యాకెట్‌లా కనిపించే ప్యాకెట్‌ను తక్కువ పరిమాణంతో విక్రయిస్తున్నాయి. ఇలాంటి మోసపూరిత ప్రక్రియల పట్ల జాగ్రత వహించాలంటూ కస్టమర్లను కోరింది. ఈ సందర్భంగా ''ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్‌కు చెందిన ప్రతి ఒక లీటరు ప్యాకెటులో 910 గ్రాముల ఎడిబుల్ ఆయిల్ ఉంటుందని హామీ ఇస్తున్నాము'' అని జెమినీ ఎడిబుల్స్-ఫ్యాట్స్ ఇండియా సేల్స్-మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర రెడ్డి తెలిపారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-5-2024	
విశాఖ	550-00
చిత్తూరు	628-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00
రిటైల్ ధర	6.10

బీఎస్ఈ కంపెనీల సరికొత్త రికార్డ్

5 లక్షల కోట్ల డాలర్లు

6 నెలల్లోనే లక్ష కోట్ల డాలర్లు జమ

దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ తాజాగా 5 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)ను సాధించింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. ఈ ఏడాది ప్రారంభం నుంచి 633 బిలియన్ డాలర్లకుపైగా జమ చేసుకుంది. నిజానికి మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ చరిత్రాత్మక గరిష్టానికి 1.7 శాతం దూరంలో ఉన్నప్పటికీ బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ తొలిసారి 5 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించడం విశేషం!


ముంబై: బీఎస్ఈ తొలిసారి 5 లక్షల కోట్ల డాలర్ల విలువను అందుకుంది. ఓవైపు బ్లూచిప్స్ పరుగుతీస్తుంటే.. మరోపక్క మధ్య, చిన్నతరహా కంపెనీల ఇండెక్సులు సైతం సరికొత్త గరిష్టాలకు చేరాయి. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రికార్డ్ నెలకొల్పింది. వెరసి బీఎస్ఈ విలువ తొలిసారి రూ. 415 లక్షల కోట్లకు చేరింది. 2023 నవంబర్‌లో తొలిసారి బీఎస్ఈ విలువ 4 ట్రిలియన్ డాలర్లను తాకింది. ఆపై ఆరు నెలల్లోనే 5 లక్షల కోట్లకు చేరింది. ఇప్పటివరకూ ప్రపంచంలో 5 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో యూఎస్ఏ, చైనా, జపాన్, హాంకాంగ్ మాత్రమే ఉన్నాయి. మిడ్, స్మాల్ క్యాప్స్ భారీగా సహకరించడం ఈ సందర్భంగా గమనార్హం. ఇటీవల మార్కెట్లు ఆటుపోట్లను చవిచూస్తున్నప్పటికీ.. 2024 జనవరి మొదలు సెన్సెక్స్ 2.3 శాతం బలపడగా.. మిడ్ క్యాప్ 16.3 శాతం, స్మాల్ క్యాప్ 11.5 శాతం ఎగశాయి.



జర్నీ తీరిలా

2007 మే నెలలో ట్రిలియన్ డాలర్ల విలువను సాధించిన బీఎస్ఈ ఆపై దశాబ్దం తదుపరి అంటే 2017 జులైలో 2 ట్రిలియన్ డాలర్లను చేరింది. ఈ బాటలో 2021 మే నెలకల్లా 3 లక్షల కోట్ల డాలర్లను తాకింది. 5 లక్షల కోట్ల డాలర్ల జాబితాలో 55.65 ట్రిలియన్ డాలర్లతో యూఎస్ఏ టాప్ ర్యాంకులో ఉంది. 9.4 ట్రిలియన్లతో చైనా, 6.4 ట్రిలియన్లతో జపాన్, 5.47 ట్రిలియన్లతో హాంకాంగ్ తదుపరి నిలుస్తున్నాయి.

స్వల్ప నష్టాలతో సరి..



అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సార్వత్రిక ఎన్నికల వేళ అప్రమత్తత, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 53 పాయింట్లు నష్టపోయి 73,953 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27 పాయింట్లు పెరిగి 22,529 వద్ద నిలిచింది. మెటల్, ఇంధన షేర్లు రాణించగా, బ్యాంకులు, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు.., మిడ్ సెషన్‌లో కాసేపు లాభాల్లో ట్రేడయ్యాయి. తదుపరి అమ్మకాలు తలెత్తడంతో స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు వెల్లడికి ముందు(బుధవారం రాత్రి) అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. మరికొన్ని రోజుల్లో (జూన్ 4న) ఎన్నికల ఫలితాల వెలువడనున్న నేపథ్యంలో మార్కెట్లో అస్థిరతను సూచించే వీఐఎక్స్ సూచీ 7% పెరిగి 23 నెలల గరిష్టస్థాయి 22.3 స్థాయిని తాకింది.

మార్కెట్ విలువ మదింపులో మార్పులు

లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)ను మదింపు చేయడంలో సెబీ తాజాగా నిబంధనలను పునర్వ్యవస్థీకరించింది. దీంతో ఇకపై రోజువారీ మార్కెట్ విలువ మదింపునకు బదులుగా ఆరు నెలల సగటును ప్రాతిపదికగా తీసుకోనున్నారు. దీని వలన సరైన విలువ మదింపునకు వీలుంటుందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఓఎన్‌జీసీ లాభం 'హై'జంప్



న్యూఢిల్లీ: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. స్టాండెలోన్ నికర లాభం 19 రెట్లు ఎగసి రూ. 9,869 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23) క్యూ4లో కేవలం రూ. 528 కోట్లు ఆర్జించింది. అయితే 2016-22 మధ్య పన్ను వివాదాలకు రూ. 9,235 కోట్లు కేటాయించడం(ప్రొవిజన్లు) 2022-23 క్యూ4లో లాభాలను దెబ్బతీసింది. కాగా.. ప్రస్తుత సమీక్షా కాలంలో చమురు ఉత్పత్తి 4 శాతం పుంజుకుని 4.71 మిలియన్ టన్నులకు చేరింది. ఇక గ్యాస్ ఉత్పత్తి 2 శాతంపైగా నీరసించి 4.95 బిలియన్ ఘనపు మీటర్లకు పరిమితంకాగా.. ఒక్కో ఎంబీటీయూకి 6.5 డాలర్లు చొప్పున విక్రయించింది. ఇక మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 34,637 కోట్లను తాకింది. కాగా కంపెనీ షేరుకి రూ. 2.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇప్పటికే రూ. 9.75 డివిడెండ్ చెల్లించింది.

కొత్త రికార్డ్: చరిత్రలోనే అత్యధికంకాగా గతేడాది ఓఎన్‌జీసీ రూ. 40,526 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022-23లో రూ. 40,097 కోట్ల లాభం అందుకోగా.. తాజాగా మొత్తం ఆదాయం రూ. 1.38 లక్షల కోట్లకు చేరింది. విదేశీ అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్ 7.178 ఎంటీ చమురు, 3.34 బీసీఎం గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది.

ఓఎన్‌జీసీ షేరు స్వల్ప లాభంతో రూ. 280 వద్ద ముగిసింది.

రుణాల్లో ముత్తూట్ ఫిన్‌కార్ప్ జోరు

న్యూఢిల్లీ: బ్యాంకింగేతర రుణ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రుణాల మంజూరులో కొత్త రికార్డు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ రుణాలు అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24లో 18.6 శాతం ఎగసి రూ.61,703 కోట్లు నమోదయ్యాయి. నిర్వహణలో ఉన్న ఆస్తులు రూ.33,359 కోట్లుగా ఉన్నాయి. కన్సాలిడేటెడ్ నికరలాభం 62 శాతం దూసుకెళ్లి రూ.1,048 కోట్లకు చేరుకుంది. మార్చి త్రైమాసికంలో ఆదాయం 25.6% అధికమై రూ.1,197 కోట్లను తాకింది. మార్చి 31 నాటికి కస్టమర్ల సంఖ్య 14% పెరిగి 42.98 లక్షలు ఉంది. 81% మంది వినియోగదార్లు రూ.1 లక్ష లోపు రుణాలను తీసుకున్నారని సీఈవో షాజీ వర్గీస్ వెల్లడించారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్‌ను 137 ఏళ్ల చరిత్ర కలిగిన ముత్తూట్ పప్పాచన్ గ్రూప్ ప్రమోట్ చేస్తోంది.

బీహెచ్ఈఎల్ నేలచూపు

క్యూ4లో నికర లాభం 25 శాతం క్షీణత


న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(బీహెచ్ఈఎల్) గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 490 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా వ్యయాలు పెరగడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 658 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 8,339 కోట్ల నుంచి రూ. 8,417 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 7,412 కోట్ల నుంచి రూ. 7,794 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 0.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి బీహెచ్ఈఎల్ నికర లాభం భారీగా క్షీణించి రూ. 282 కోట్లకు పరిమితమైంది. 2022-23లో రూ. 654 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 23,854 కోట్ల నుంచి రూ. 24,439 కోట్లకు ఎగసింది.

బీహెచ్ఈఎల్ షేరు బీఎస్ఈలో 3 % జంప్‌చేసి రూ. 319 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యు సిమెంట్ రూ.3,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: సిమెంట్ తయారీలో ఉన్న జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రాజస్తాన్‌లో నూతన ప్లాంటు నెలకొల్పనున్నట్టు మంగళవారం ప్రకటించింది. ఇందుకోసం రూ.3,000 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు వెల్లడించింది. ఈ నిధుల కోసం సొంత వనరులతోపాటు రుణం సమకూర్చుకుంటామని తెలిపింది. నాగౌర్ జిల్లాలో రానున్న ఈ కేంద్రంలో 3.3 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో క్లింకర్ యూనిట్, 2.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. సిమెంట్ తయారీలో భాగంగా జనించే ఉష్ణం నుంచి విద్యుత్ తయారీకై 18 మెగావాట్ల పవర్ ప్లాంట్ సైతం నిర్మిస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,000 మందికిపైగా ఉపాధి అవకాశాలు ఉంటాయని జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఎండీ పార్థ్ జిందాల్ తెలిపారు. రాజస్తాన్, హరియాణ, పంజాబ్, ఎన్‌సీఆర్ ప్రాంతంలోని కస్టమర్లకు చేరువ అయ్యేందుకు నూతన ప్లాంటు దోహదం చేస్తుందని చెప్పారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ అయిన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 19 మిలియన్ టన్నులు. దీనిని 60 మిలియన్ టన్నులకు చేర్చాలన్నది సంస్థ లక్ష్యం.

మైక్రోసాఫ్ట్‌తో కోఫోర్జ్ జోడీ



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ కోఫోర్జ్ తాజాగా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపింది. ఇందులో భాగంగా విభిన్న పరిశ్రమల కోసం జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు ఇన్నోవేషన్ హబ్‌ను స్థాపించనుంది. ఉత్పాదకత పెంపునకు, పరివర్తనను నడిపించేందుకు మైక్రోసాఫ్ట్ ప్లాట్‌ఫామ్‌పై పరిష్కారాలను రూపొందిస్తామని కోఫోర్జ్ మంగళవారం తెలిపింది.

జాబ్ పాయింట్

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ... జనవరి 2025లో ప్రారంభమయ్యే 52వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ (టీఈఎస్) కోర్సు శిక్షణలో ప్రవేశాలకు సంబంధించి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 90
» అర్హత:గుర్తింపు పొందిన బోర్డు నుంచి 60 శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతోపాటు జేఈఈ(మెయిన్స్) 2024లో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» వయసు: 16.5ఏళ్ల నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: జేఈఈ(మెయిన్స్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» కోర్సు, శిక్షణ: మొత్తం ఐదేళ్ల కోర్సు, శిక్షణ కొనసాగుతుంది. ఇందులో ఏడాది పాటు బేసిక్ మిలిటరీ ట్రెనింగ్, నాలుగేళ్లు టెక్నికల్ ట్రెనింగ్ ఇస్తారు. శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి ఇంజనీరింగ్(బీఈ/బీటెక్) డిగ్రీ అందజేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 13.05.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.06.2024
» వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

జే-కే బ్యాంక్‌లో 276 అప్రెంటిస్‌లు

జమ్మూ-కశ్మీర్ బ్యాంక్.. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 276.
» శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం. స్టైపెండ్: నెలకు రూ.10,500.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థి సంబంధిత ప్రాంతంలోని స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 14.05.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.05.2024
» వెబ్‌సైట్: https://www.jkbank.com

టీసీఐఎల్‌లో జనరల్ మేనేజర్/ఏజీఎం పోస్టులు

న్యూఢిల్లీలోని టెలికమ్యూనికేషన్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(టీసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10
» పోస్టుల వివరాలు: జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్.
» అర్హతలు: సంబంధిత విభాగంలో బీఎస్సీ/బీటెక్/ఎంటెక్/ఎంబీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 03.06.2024
» వెబ్‌సైట్: https://www.tcil.net.in/index.php

ఐఐటీఎంలో 65 ప్రాజెక్టు పోస్టులు

కేంద్ర ఎర్త్‌సైన్సెస్ మంత్రిత్వ శాఖకు చెందిన పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయెరాలజీ(ఐఐటీఎం).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ప్రాజెక్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 65
» పోస్టుల వివరాలు: ప్రాజెక్టు సైంటిస్ట్ 3- 04 పోస్టులు, ప్రాజెక్టు సైంటిస్ట్ 2- 11 పోస్టులు, ప్రాజెక్టు సైంటిస్ట్ 1- 04 పోస్టులు, ట్రెనింగ్ కోఆర్డినేటర్-01 పోస్టులు, సీనియర్ ప్రాజెక్టు అసోసియేట్- 02 పోస్టులు, ప్రాజెక్టు అసోసియేట్ 2- 08 పోస్టులు, ప్రాజెక్టు అసోసియేట్ 1- 33 పోస్టులు, రీసెర్చ్ అసోసియేట్ -02.
» అర్హత:సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ,పీహెచ్‌డీ ఉత్తీర్ణత,నెట్/సీఎస్ఐఆర్ యూజీసీ నెట్/గేట్ స్కోర్‌తోపాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 22.05.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.06.2024
» వెబ్‌సైట్: www.tropmet.res.in

ఏపీ వైద్య కళాశాలల్లో 29 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.. డైరెక్ట్ ఎంట్రీ, లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 29
» అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం) ఉత్తీర్ణులై ఉండాలి. స్పెషాలిటీ: మైక్రోబయాలజీ అండ్ ఫార్మకాలజీ, అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.05.2024
» వెబ్‌సైట్: https://dme.ap.nic.in

క్లాట్‌తో మేటి సంస్థల్లో లా

» డిసెంబర్ 1న క్లాట్-2025 పరీక్ష
» వెల్లడించిన లా యూనివర్సిటీస్ కన్సార్టియం
» క్లాట్‌తో 24 నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశాలు
» యూజీ లా, పీజీ లా కోర్సుల్లో అడ్మిషన్స్
» లా కోర్సులతో విస్తృత కెరీర్ అవకాశాలు

నేటి కార్పొరేట్ యుగంలో.. న్యాయవిద్య కొత్త రూపు సంతరించుకుంటోంది. దీంతో లా కోర్సులతో కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకునే అవకాశం లభిస్తోంది. అందుకే ఇటీవల కాలంలో న్యాయ విద్యపై యువతలో ఆసక్తి పెరుగుతోంది. దీనికి అనుగుణంగానే దేశంలోని ప్రముఖ న్యాయ విద్య సంస్థలైన నేషనల్ లా యూనివర్సిటీలు.. యూజీ, పీజీ స్థాయిలో వినూత్న కోర్సులను అందిస్తున్నాయి. వీటిలో ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీలో ప్రవేశానికి మార్గం..కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్). తాజాగా క్లాట్(యూజీ)-2025 పరీక్షను ఈ ఏడాది డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. క్లాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



24 నేషనల్ లా యూనివర్సిటీలు

నాణ్యమైన న్యాయ విద్య కోర్సులను అందించడంలో నేషనల్ లా యూనివర్సిటీలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దేశవ్యాప్తంగా ఏర్పాటైన 24 నేషనల్ లా యూనివర్సిటీలు అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ స్థాయిలో లా కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఒక కన్సార్టియంగా ఏర్పాటై ప్రతి ఏటా క్లాట్ పరీక్షను నిర్వహిస్తున్నాయి. 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి క్లాట్-2025 పరీక్షను ఈ ఏడాది డిసెంబర్ 1న జరపనున్నట్లు ప్రకటించారు.

ప్రవేశాలకు క్లాట్

నేషనల్ లా యూనివర్సిటీలు అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీలో ప్రవేశానికి కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-యూజీని, ఎల్ఎల్ఎం కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం క్లాట్ పీజీ ఎంట్రన్స్‌లను నిర్వహిస్తున్నారు.

అర్హతలు

- క్లాట్-యూజీ: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- క్లాట్-పీజీ: ఎల్ఎల్‌బీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 45%మార్కులు సాధించాలి.

క్లాట్-యూజీ పరీక్ష

క్లాట్-యూజీ పరీక్షను మొత్తం 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై 22-26 ప్రశ్నలు, జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 28-32 ప్రశ్నలు, లీగల్ రీజనింగ్ 28-32 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 22-26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ నుంచి 10-14 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు. ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్‌లలో పూర్తిగా ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలే అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలోనూ గ్రాఫ్, టేబుల్స్, డయాగ్రమ్స్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి.

120 మార్కులకు క్లాట్-పీజీ

నేషనల్ లా యూనివర్సిటీల్లోని ఎల్ఎల్ఎం సీట్ల భర్తీకి క్లాట్-పీజీ పరీక్షను 120 ప్రశ్నలు-120 మార్కులకు నిర్వహిస్తారు. వీటిని ప్యాసేజ్ ఆధారితంగా ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలుగా అడుగుతారు. ఈ పరీక్షలో కాన్‌స్టిట్యూషనల్ లా సంబంధిత ప్రశ్నలు, జ్యూరిస్‌ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

కార్పొరేట్ కొలువులు

క్లాట్‌లో విజయంతో నేషనల్ లా యూనివర్సిటీల్లో అడుగుపెట్టి కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. వీరు న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ కొలువులు సైతం దక్కించుకోవచ్చు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో కన్సల్టింగ్ సంస్థలు, బ్యాంకింగ్ సంస్థలు, ఇతర కార్పొరేట్ కంపెనీలు సగటున రూ.10 లక్షల వార్షిక వేతనంతో జాబ్ ఆఫర్స్ ఇస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- క్లాట్-2025 పరీక్ష తేదీ: 2024, డిసెంబర్ 1
- నోటిఫికేషన్-జూలైలో మొదటి వారంలో వెలువడే అవకాశం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- వివరాలకు వెబ్‌సైట్: https://consortiumofnlus.ac.in

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

క్లాట్ యూజీకి సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఇందులో ఉండే అయిదు సెక్షన్లలోనూ మెరుగైన ప్రతిభ చూపేలా ఇప్పటినుంచే సన్నద్ధత కొనసాగించాలి. అందుకోసం సబ్జెక్ట్‌ల వారీగా సిలబస్ అంశాలపై దృష్టిపెట్టాలి.

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్

సమకాలీన అంశాలు, కళలు, సంస్కృతి, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలకు సంబంధించిన ప్యాసేజ్‌లు ఇచ్చి వీటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. దీంతోపాటు అభ్యర్థులు జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించడానికి ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా.. కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్‌పై అవగాహన పెంచుకోవాలి. సునిశిత పరిశీలన నైపుణ్యం, ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని గ్రహించడం, ప్యాసేజ్ ప్రధాన ఉద్దేశం తెలుసుకోవడం వంటి నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి. ఇందుకోసం జనరల్ ఎస్సేలు, న్యూస్ పేపర్ ఎడిటోరియల్స్, ఇతర ముఖ్య ప్రచురణలు చదవాలి.

లాజికల్ రీజనింగ్

తార్కిక విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు; అసెర్షన్ అండ్ రీజనింగ్ ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగంలో రాణించేందుకు సిలాజిజమ్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్

ఈ విభాగంలో స్కోర్ కోసం పదో తరగతి స్థాయిలోని గణిత అంశాలపై పట్టు సాధించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే అర్థమెటిక్‌కు కొంత ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. కాబట్టి అభ్యర్థులు పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజెస్, రేషియోస్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు గ్రాఫ్‌లు, చార్ట్‌లను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

లీగల్ రీజనింగ్

న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే ఉద్దేశంతో ఈ విభాగంలో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. సంబంధిత ప్యాసేజ్‌ల నుంచి నిబంధనలు, సిద్ధాంతాలు,ఫ్యాక్ట్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పెంచుకోవాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవాలి.

క్లాట్ పీజీ

క్లాట్ పీజీ పరీక్షలో రాణించేందుకు అభ్యర్థులు తాజాగా ముఖ్యమైన తీర్పులు తెలుసుకోవాలి. దీంతోపాటు రాజ్యాంగం, శాసనపరమైన అంశాలు, చారిత్రాత్మక తీర్పులు, వాటి ప్రభావం వంటివాటిపైనా అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు తాము ఎంపిక చేసుకోనున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి అకడమిక్‌గా బ్యాచిలర్ స్థాయిలోని అంశాలపై పట్టు సాధించడం కూడా మేలు చేస్తుంది.

ఇక టీఎస్‌ట్రాన్స్‌కో కాదు.. టీజీట్రాన్స్‌కో

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ విద్యుత్‌ సరఫరా సంస్థ (ట్రాన్స్‌మిషన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ తెలంగాణ లిమిటెడ్‌) సంక్షిప్త నామంగా 'టీఎస్‌ట్రాన్స్‌కో'గా ఇప్పటివరకు వాడుకలోగా ఉండగా, ఇకపై 'టీజీట్రాన్స్‌కో'గా వ్యవహరించాలని ఆదేశిస్తూ సంస్థ సీఎండీ ఎస్‌ఏఎం రిజ్వీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇకపై అన్ని రకాల అధికారిక దస్త్రాల్లో టీజీట్రాన్స్‌కోగానే రాయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు రైళ్లు రద్దు

సాక్షి, హైదరాబాద్‌: ట్రాక్‌ నిర్వహణ కారణాల దృష్ట్యా పలురైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్‌ రాకేశ్‌ తెలిపారు. ఈ మేరకు కాచిగూడ–రాయచూర్‌ (07477/07478), సికింద్రాబాద్‌–గుంటూరు (17202) ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు రద్దు కానున్నాయి. దౌండ్‌–నిజామాబాద్‌ (11409), నిజామాబాద్‌–పండరీపూర్‌ (01413) రైళ్లు నిజామాబాద్‌–ముద్ఖేడ్‌ మధ్య పాక్షికంగా రద్దు కానున్నాయి.

నకిలీ ఆర్‌ఎంపీ క్లినిక్‌ సీజ్‌ చేసిన డీసీఏ అధికారులు

సాక్షి, హైదరాబాద్‌: ఎలాంటి అర్హత లేకుండానే ఆర్‌ఎంపీగా చెలామణీ అవుతూ క్లినిక్‌ నిర్వహిస్తున్న బండి సైదిరెడ్డి అనే వ్యక్తిని నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం అజ్మాపూర్‌ గ్రామంలో డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారులు గుర్తించారు. ఆర్‌ఎంపీగా స్థానికంగా చెలామణీ అవుతూ మందులను ఎలాంటి అనుమతులు లేకుండానే విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం డీసీఏ అధికారులు ఈ సోదాలు చేపట్టినట్లు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రూ.70,900 విలువైన 42 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో నల్లగొండ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ కె.దాస్‌, మిర్యాలగూడ డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ అశ్విన్‌కుమార్‌, ఖమ్మం అర్బన్‌ డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ జీహెచ్‌ అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.

24న యూఎస్‌ స్టూడెంట్‌ వీసా ఇన్ఫర్మేషన్‌ సెషన్‌

సాక్షి,హైదరాబాద్‌: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లేందుకు వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు యూఎస్‌ కాన్సులేట్‌ జనరల్‌ హైదరాబాద్‌ అధికారులు యూఎస్‌ స్టూడెంట్‌ వీసీ ఇన్ఫర్మేషన్‌ సెషన్‌ నిర్వహించనున్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కాన్సులేట్‌ కార్యాలయం మంగళవారం ట్విట్టర్‌ ద్వారా తెలిపింది. 2024, 2025కు సంబంధించిన స్టూడెంట్‌ వీసాల దరఖాస్తుల్లో సందేహాలను వీసా అధికారి నివృత్తి చేయనున్నారు. ఇందులో పాల్గొనాలనుకునేవారు https://bit.ly/EdUSASVS24 లో లాగిన్‌ అయి రిజిస్టర్‌ చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా పాల్గొనాలనుకునే వారు జూబ్లీహిల్స్‌లోని ఎస్‌ఎల్‌ జూబ్లీ కాంప్లెక్స్‌లో జరిగే సదస్సుకు హాజరుకావాలని కోరారు.

ఏ కాలేజీ.. ఏ బ్రాంచీ!

ఇంజనీరింగ్‌ సీట్లపై విద్యార్థుల దృష్టి


తమ ర్యాంకుతో బేరీజు వేసుకుంటూ హడావుడి

తల్లిదండ్రులతో చర్చలు..కన్సల్టెన్సీలతో సంప్రదింపులు

కసరత్తు మంచిదే అంటున్న నిపుణులు

ఆప్షన్లు జాగ్రత్తగా పెట్టుకుంటే కోరుకున్న సీటు ఖాయమని స్పష్టీకరణ

4 వేల లోపు ర్యాంకొస్తే వర్సిటీలో పక్కా.. టాప్‌ కాలేజీల్లో 8 వేల లోపు



సాక్షి, హైదరాబాద్‌: టీఎస్‌ఈఏపీ ఫలితాలు ప్రకటించడంతో ఇంజనీరింగ్‌ సీట్ల కోసం విద్యార్థుల హడావుడి మొదలైంది. తనకు వచ్చిన ర్యాంకుకు ఏ కాలేజీలో బ్రాంచిలో సీటొస్తుంది? ఏ కాలేజీలో ఎంత ర్యాంకు వరకు సీటు వచ్చే అవకాశం ఉంది? కౌన్సెలింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? తదితర సవాలక్ష ప్రశ్నలు విద్యార్థులను వెంటాడుతున్నాయి. దీంతో కన్సల్టెన్సీలను, నిపుణులను సంప్రదిస్తున్నారు. తల్లిదండ్రులతో కలిసి ర్యాంకు గురించి చర్చిస్తున్నారు. కౌన్సెలింగ్‌ తేదీలు ప్రకటించేలోగా స్పష్టమైన సమాచారంతో సిద్ధంగా ఉంటే మంచిదని భావిస్తున్నారు. వాస్తవానికి ఇంజనీరింగ్‌ కౌన్సెలింగ్‌ మొదలయ్యేలోగా కొంత కసరత్తు అవసరమని నిపుణులు కూడా అంటున్నారు. తొలిదశ కౌన్సెలింగ్‌లో ఖచ్చితమైన ఆప్షన్లు పెట్టుకుంటే సీటు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గత ఏడాది కటాఫ్‌ను పరిశీలిస్తే కొంత స్పష్టత వచ్చే వీలుందని పేర్కొంటున్నారు.

టెన్షన్‌ అవసరమే లేదు

ఐదేళ్ళ క్రితం ఇంజనీరింగ్‌లో కంప్యూటర్‌ బ్రాంచిలకు తీవ్ర స్థాయిలో పోటీ ఉండేది. అయితే డిమాండ్‌ ఉన్న కోర్సులకే కాలేజీలు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల గత రెండేళ్ళుగా కంప్యూటర్‌ సైన్స్‌లో సీట్లు పెరిగాయి. గత ఏడాది ఏకంగా 14 వేల సీట్లు కొత్తగా వచ్చాయి. కాబట్టి సీటు కోసం టెన్షన్‌ పడాల్సిన అవసరమే లేదని నిపుణులు చెబుతున్నారు. కాకపోతే వచ్చిన ర్యాంకును బట్టి సీటు ఎక్కడ వస్తుందనేది సరిగ్గా అంచనా వేసి, ఆ దిశగా ఆప్షను ఇవ్వాలి. అవసరమైతే రెండో దశ కౌన్సెలింగ్‌ లేదా ఆఖరి దశలో సీట్లు మిగిలితే నచ్చిన కాలేజీని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. గత సంవత్సరం పరిస్థితిని బట్టి చూస్తే ఈ ఏడాది కూడా సీఎస్‌ఈలో పోటీ అదే విధంగా ఉండే వీలుంది. యూనివర్సిటీ క్యాంపస్‌లో సీఎస్‌ఈ బ్రాంచిలో సీటు రావాలంటే ఈఏపీ సెట్‌లో ఓపెన్‌లో 4 వేల లోపు ర్యాంకు వచ్చి తీరాలని నిపుణులు అంటున్నారు. టాప్‌ కాలేజీల్లో రావాలంటే 8 వేల లోపు ర్యాంకు అవసరమని స్పష్టం చేస్తున్నారు. అదే సమయంలో సాధారణ ఇంజనీరింగ్‌ కాలేజీల్లో ఈ సంవత్సరం 60 వేల ర్యాంకు వచ్చినా సీఎస్‌ఈలో సీటు వచ్చే వీలుందని అంచనా వేస్తున్నారు. జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్‌ క్యాంపస్‌లో పోటీ తక్కువగా ఉంటోంది. 19 వేల ర్యాంకు వరకు సీటు వచ్చే వీలుంది.

అందరి దృష్టీ సీఎస్‌ఈపైనే

ఏ స్థాయిలో ర్యాంకు వచ్చినా విద్యార్థి ముందుగా కోరుకునేది కంప్యూటర్‌ సైన్స్‌ సీటు. గత మూడేళ్ళుగా విద్యార్థులు పెట్టే ఆప్షన్లు చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. గత ఏడాది 58 శాతం కంప్యూటర్‌ సైన్స్‌ సీట్లకే ఆప్షన్లు ఇచ్చుకున్నారు. అయితే సరైన ర్యాంకు రాకపోయినా టాప్‌ కాలేజీలకు ప్రాధాన్యత ఇస్తూ ఆప్షన్లు పెడుతున్నారు. ఆఖరి దశ కౌన్సెలింగ్‌ వరకూ ఇదే తరహా ఆప్షన్లు ఇస్తున్నారు. ఫలితంగా తన ర్యాంకుకు వచ్చే కాలేజీని, బ్రాంచిని మొదటి రెండు దశల కౌన్సెలింగ్‌లోనే పోగొట్టుకుంటున్నారు. ఉదాహరణకు ఓ విద్యార్థికి 16 వేల ర్యాంకు వచ్చింది. అతనికి టాప్‌ టెన్‌లో కాకుండా వేరే కాలేజీలో కోరుకున్న బ్రాంచిలో సీటు వచ్చే వీలుంది. కానీ ఆప్షన్లు పెట్టే సమయంలో టాప్‌ టెన్‌కే పరిమితమ అవుతున్నారు. దీంతో కోరుకున్న కాలేజీ రావడం లేదు. ఇలా చేయడం వల్ల తనకు వచ్చేందుకు అవకాశం ఉన్న కాలేజీలోనూ సీటు పోగొట్టుకుంటున్నారు.

2023లో వివిధ కాలేజీల్లో కటాఫ్‌ ఇలా..

	బాలురు/ బాలికలు	ఓపెన్‌ ఏ	బీసీ బీ	బీసీ సీ	బీసీ డీ	బీసీ	ఎస్సీ	ఎస్టీ
ఓయూ–సీఎస్‌ఈ	బాలురు	3250	8620	4117	5963	4305	10042	15413
	బాలికలు	3768	11354	6279	7019	1900	18044	15042
ఓయూ–మెకానికల్‌	బాలురు	15768	31818	27832	30294	18228	42097	42800
	బాలికలు	20617	57851	43345	42451	----	60077	48878
జేఎన్‌టీయూ–సీఎస్‌ఈ	బాలురు	2317	4274	3158	4154	2365	8611	8683
	బాలికలు	2465	6020	1028	3414	----	12145	15285
సీబీఐటీ– సీఎస్‌ఈ (ఏఐ)	బాలురు	7772	14323	11678	7081	8168	22005	23734
	బాలికలు	7348	13872	11274	11010	5340	23121	36205
వాసవీ–సీఎస్‌ఈ	బాలురు	3259	7735	5372	4502	6539	17333	22470
వీఎన్‌ఆర్‌ విజ్ఞాన జ్యోతి (సీఎస్‌ఈ)	బాలురు	2843	5228	4217	3857	2507	12440	16747
	బాలికలు	2715	9225	4465	4367	3090	13774	18384
గోకరాజు రంగరాజు	బాలురు	5555	13508	9272	7425	11614	24378	28608
	బాలికలు	6202	15432	9272	9120	24378	29500	38359
నారాయణమ్మ జేఎన్‌టీయూ	బాలికలు	6470	20122	9187	8011	13868	25241	40453
సుల్తాన్‌పూర్‌ (సీఎస్‌ఈ)	బాలురు	19021	28835	31554	30032	17238	36341	46363
	బాలికలు	8487	60648	28752	37768	40062	33112	49899

> **ఆప్షన్లు ఇచ్చేటప్పుడు అప్రమత్తత అవసరం**
>
> ఆప్షన్లు ఇచ్చేప్పుడు విద్యార్థులు అన్ని అంశాలను పరిశీలించాలి. గత కొన్నేళ్లలో ఏ ర్యాంకుకు ఏ కాలేజీలో సీటు వచ్చిందనే అంశాన్ని పరిశీలించాలి. టాప్‌ కాలేజీలకే ప్రాధాన్యత ఇస్తూ ఆప్షన్లు ఇవ్వాలనే ధోరణి సరికాదు. ఈ దిశగా అనేక కౌన్సెలింగ్‌ల కోసం వేచి చూడటం మంచిది కాదు. మీకు సీటు వచ్చే వీలున్న కాలేజీని మీరు వదులుకుంటే, ఇతరులు ఆ సీటులో చేరతారు. అందువల్ల జాగ్రత్తగా కాలేజీని, బ్రాంచిని ఎంపిక చేసుకోవాలి. అవసరమైతే మంచి కాలేజీ కోసం తర్వాత కౌన్సెలింగ్‌లో ప్రయత్నించాలి.
>
> – ఎంఎన్‌రావు (గణిత శాస్త్ర నిపుణుడు)

రేవ్‌పార్టీపై సమగ్ర దర్యాప్తు

- పార్టీలో సినీనటి హేమ పాల్గొన్నారు.. ఆమె రక్తనమూనాలు ల్యాబ్‌కు పంపించాం
- హేమ వీడియోపై విచారణ జరుపుతాం: బెంగళూరు పోలీస్‌ కమిషనర్‌ దయానంద్‌

బనశంకరి: బెంగళూరు నగర శివారులోని హెబ్బగోడిలో ఓ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని నగర పోలీస్‌ కమిషనర్‌ బి.దయానంద్‌ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...రేవ్‌ పార్టీలో తెలుగు సినీనటి హేమ ఉన్నారు. సన్‌సెట్‌ టు సన్‌రైజ్‌ విక్టరీ అని ఈ రేవ్‌పార్టీకి పేరుపెట్టారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పార్టీ నిర్వహించాలనుకున్నారు. పార్టీలో ఎండీఎంఏ పిల్స్‌, హైడ్రో గాంజా, కొకైన్‌ ఇతర మాదక ద్రవ్యాలు విక్రయించారు. రేవ్‌పార్టీలో పాల్గొన్న వారి పేర్లలో హేమ పేరు వినబడగానే ఆమె జాగ్రత్త పడి, ఫాంహౌస్‌ ఖాళీ స్థలంలోకి వెళ్లి నేను ఆ పార్టీలో లేను, హైదరాబాద్‌లో ఫాంహౌస్‌లో ఉన్నాను అని చెప్పింది. ఆమె వీడియో గురించి కూడా దర్యాప్తు చేస్తున్నాం. పార్టీలో పాల్గొన్న వారందరికీ వైద్యపరీక్షలు చేపట్టాం, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం. రేవ్‌ పార్టీ జరిగిన స్థలం బెంగళూరు రూరల్‌లోని హెబ్బగోడి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోకి రావడంతో కేసును ఎలక్ట్రానిక్‌ సిటీ పీఎస్‌ నుంచి హెబ్బగోడి పీఎస్‌కు బదిలీ చేశాం.

డ్రగ్స్‌ విసిరేశారు: రేవ్‌పార్టీలో వందమందికి పైగా పాల్గొన్నారు. దాడి సమయంలో మాదక ద్రవ్యాలు లభించాయి. కొందరు దొరికిపోతామనే భయంతో స్విమ్మింగ్‌ పూల్‌, టాయ్‌లెట్‌ తదితర స్థలాల్లోకి డ్రగ్స్‌ విసిరేశారు, వాటిని వెతకడానికి జాగిలాలను ఉపయోగించాం. రణధీర్‌, మహమ్మద్‌సిద్దికి, వాసు, అరుణ్‌కుమార్‌, నాగబాబులను అరెస్టు చేసి విచారిస్తున్నాం. ఈ పార్టీలో ప్రజాప్రతినిధులు పాల్గొనలేదన్నారు. పార్టీలో సిద్దిక్‌, రణధీర్‌, రాజ్‌బావ డ్రగ్స్‌ విక్రయించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో సీసీబీ అధికారులు దాడి చేశారు. నటి హేమ కూడా పార్టీలో ఉంది. ఆమె రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. ప్రతి ఒక్కరిని విచారించి సీసీబీ వాంగ్మూలం సేకరిస్తుంది. అందరితో పాటు హేమకు కూడా నోటీసులు జారీ చేసి తదుపరి విచారణకు పిలుస్తాం' అని దయానంద్‌ తెలిపారు.

వీధి కుక్కలను చంపి 'పడేశారు'!

జానంపేట శివారులో హైవే పక్కన కాల్వలో 15 కుక్కల కళేబరాలు



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారు 44వ నంబర్‌ జాతీయ రహదారి పక్కన కాల్వలో కుక్కల కళేబరాలు కనిపించడం కలకలం రేపింది. పదిహేను వీధి కుక్కలను గుర్తు తెలియని దుండగులు చంపి వాటిని కాల్వలో పడేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. మంగళవారం స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ సుజాత అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం కుక్కల కళేబరాలను ట్రాక్టర్‌లో చక్రాపూర్‌ శివారులోని అటవీ ప్రాంతానికి తరలించి అక్కడ పశువైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. ఆ తర్వాత గుట్ట సమీపంలోని ప్రభుత్వ భూమిలో గుంతను తవ్వించి పూడ్చి వేశారు. కుక్కల కళేబరాలపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో విష ప్రయోగం చేసి చంపి ఉంటారని భావిస్తున్నారు.కుక్కలకు సంబంధించిన శాంపిల్స్‌ను ఫోరెన్సిక్‌ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్‌ రాజేష్‌ఖన్న తెలిపారు.

పొన్నకల్‌ ఘటన మరువక ముందే?

అసలు ఈ కుక్కలను ఎవరు.. ఎక్కడ.. ఎందుకు చంపారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏదో గ్రామంలో కుక్కల సంఖ్యను తగ్గించడానికి వాటిని చంపేసి కళేబరాలను ఇక్కడ వదిలేసి ఉంటారనే అనుమానం కలుగుతోంది. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 16న అడ్డాకుల మండలం పొన్నకల్‌లో 21 వీధి కుక్కలను తుపాకీతో కాల్చి చంపిన ఘటన మరువక ముందే ఇప్పుడు 15 కుక్కల కళేబరాలు హైవే పక్కన కాల్వలో కనిపించడం కలకలం రేపుతోంది.

సెల్‌ఫోన్ల రికవరీలో దేశంలోనే రెండోస్థానంలో తెలంగాణ

369 రోజుల్లో 30,049 మొబైల్‌ ఫోన్లు.. సీఈఐఆర్‌ పోర్టల్‌ టెక్నాలజీ ద్వారా చోరీ, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల జాడ

సాక్షి, హైదరాబాద్‌: చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్‌ ఫోన్ల జాడను తిరిగి కనిపెట్టి రికవరీ చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది. కేంద్ర టెలీకమ్యూనికేషన్స్‌కు చెందిన సీఈఐఆర్‌ (సెంట్రల్‌ ఎక్విప్మెంట్‌ ఐడెంటిటీ రిజిస్టర్‌) పోర్టల్‌ సాంకేతికతను వినియోగించి గత 369 రోజుల్లో తెలంగాణ పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా 30,049 మొబైల్‌ ఫోన్ల జాడను కనుగొన్నారు. ఈ మేరకు సీఐడీ ఇన్‌చార్జి అదనపు డీజీ మహేశ్‌భగవత్‌ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 780 పోలీస్‌ స్టేషన్లలో సీఈఐఆర్‌ సాంకేతికను వినియోగిస్తున్నట్లు తెలిరు. గతేడాది ఏప్రిల్‌ 19న తెలంగాణ రాష్ట్రంలో సీఈఐఆర్‌ను పైలెట్‌ ప్రాజెక్టుగా చేపట్టి, మే 17న పూర్తిస్థాయిలో ప్రారంభించారు. రోజుకు సరాసరిన 76 మొబైల్‌ ఫోన్ల చొప్పున జాడ కనిపెట్టినట్లు మహేశ్‌ భగవత్‌ పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 4,869 మొబైల్‌ ఫోన్లు, సైబరాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో 3,078 మొబైల్‌ ఫోన్లు, రాచకొండ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 3,042 మొబైల్‌ ఫోన్లు, వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 1,919 మొబైల్‌ ఫోన్లు గుర్తించినట్టు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో 35,945 ఫోన్ల రికవరీతో కర్ణాటక తొలిస్థానంలో ఉందని తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.